



- బటన్ నొక్కడమే... నగదు జమ కావడం లేదు..
- ముఖ్యమంత్రి చెప్పి నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు అందని సొమ్ము
- పోలింగ్‌కు వారంరోజుల ముందు వేస్తారని ప్రచారం
- బ్యాంకుల చుట్టూ మహిళల ప్రదక్షిణ
- దీవెన డబ్బులు పడక కళాశాలల్లో విద్యార్థుల ఇబ్బందులు

ఉత్తుత్తిదే!

ప్రభుత్వం లబ్ధిదారులను నిలువునా మోసం చేసింది. సీఎం జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కుడు ఉత్తుత్తిదే అని తేలిపోయింది. ఆయన సంక్షేమ బాకా 'పేరుగొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా మారింది. నవరత్నాల్లో భాగంగా అమలుచేస్తున్న అనేక పథకాల లబ్ధి నెలలు దాటుతున్నా అందని పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. డబ్బులు పడ్డాయో లేదోనని నిత్యం వారు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. 'నేను ఇక్కడ బటన్ నొక్కితే నేరుగా మీ ఖాతాలకే డబ్బులు చేరతాయి' అంటూ సీఎం ఆర్భాటంగా చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదు. అన్ని పథకాలదీ అదే తీరు. విద్యాదీవెన అయితే విద్యార్థులకు తలనొప్పిగా తయారైంది. ఫీజుల కోసం కళాశాలలు ఇబ్బంది పెడుతున్నాయి.

ఒంగోలు నగరం, ఏప్రిల్ 20: గోరంత సాయానికి కొండంత ప్రచారం చేసుకోవడం తప్ప సకాలంలో బాధితులకు, లబ్ధిదారులకు ఆ సాయం అందించడంలో వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. అందుకు విద్యా దీవెన, చేయూత, ఆసరా పథకాలతోపాటు జిల్లాలో మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ చెల్లింపుల విషయంలో నెలకొన్న పరిస్థితే నిదర్శనం. జగనన్న విద్యాదీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులే పూర్తిస్థాయిలో అందలేదు. గత ఏడాదికి సంబంధించిన నాలుగో విడత జాడ ఇంతవరకూ లేదు. ఎప్పుడు ఖాతాలకు చేరతాయో కూడా తెలియని గందరగోళం నెలకొంది. దీంతో తమను కళాశాలల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయంటూ విద్యార్థులు 'జగన్ మామా.. ఇంకెప్పుడు ఇస్తావు విద్యాదీవెన నిధులు' అంటూ ప్రశ్నిస్తున్నారు. చేయూత, ఆసరా కింద బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఆ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో పడలేదు. ఎప్పుడు అందుతాయో కూడా అంతుచిక్కక మహిళలు జగనన్నా మాకు డబ్బులు ఎప్పుడు పడతాయంటూ ప్రశ్నిస్తున్నారు.

విద్యాదీవెన నిధులు రూ.36.44కోట్లు వచ్చేది ఎప్పుడో..

గతేడాదికి సంబంధించిన జగనన్న విద్యాదీవెన నాలుగో విడత నిధులను సీఎం ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన కృష్ణా జిల్లా పామర్రులో బటన్ నొక్కి విడుదల చేశారు. జిల్లాలోని 48 వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.36.44 కోట్లు జమకావాల్సి ఉంది. ఇంతవరకూ పూర్తిస్థాయిలో రాలేదు. కళాశాలల యాజమాన్యాలు పెడుతున్న ఇబ్బందులను తట్టుకోలేక విద్యార్థులు ఒంగోలు ప్రగతిభవన్‌లోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. అధికారులు యాజమాన్యాలకు ఫోన్లు చేసి మీకు డబ్బులు వస్తాయి, విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వండి అంటూ బతిమాలుకుంటున్నారు.

చేయూత కింద విడుదల కావాల్సింది రూ.184 కోట్లు

చేయూత పథకం కింద 45 ఏళ్లలోపు వయస్సు ఉన్న పొదుపు సంఘాల మహిళలకు ఇవ్వాల్సిన రూ.184 కోట్లు ఇంతవరకూ లబ్ధిదారుల ఖాతాలకు జమ కాలేదు. చేయూత పథకం కింద నాలుగు సంవత్సరాల్లో ఏడాదికి రూ.18,750 లెక్కన నాలుగేళ్లపాటు మొత్తం రూ.75వేలు పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చేందుకు చేయూత పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద నాలుగో విడత నిధులను విడుదల చేసేందుకు మార్చి 7వ తేదీన సీఎం బటన్ నొక్కారు. జిల్లాలోని 98వేల మంది ఖాతాల్లో రూ.18,750 లెక్కన జమకావాల్సి ఉంది. స్వయంగా వ్యాపారాలు చేసుకుని జీవనోపాధి పొందేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ నిధులు కూడా మూడొంతుల మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరనేలేదు. మహిళలు రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.



మిచౌంగ్ తుపాన్‌తో కురిసిన వర్షాలకు వెలిగండ్ల మండలం మరపగుంట్లలో నీట మునిగిన మిర్చితోట (ఫైల్)

ఆసరా సొమ్ము ఇంతవరకూ పడలేదు



ఇంతవరకు మా గ్రూపునకు ఆసరా డబ్బులు పడలేదు. గ్రామంలోని ఓసీ వర్గం వారి గ్రూపులు దాదాపు 60 ఉంటే ఒక్క ఖాతాకు కూడా సొమ్ము జమ కాలేదు. మండలంలో అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు. అందరూ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

- పొనుగుపాటి సుజాత, కొణిజేడు, టంగుటూరు మండలం

అడ్రస్ లేని ఆసరా డబ్బులు

పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ మాఫీ కింద డబ్బులు వారి ఖాతాలకు జమ చేసే ఆసరా పథకానికి సీఎం జనవరి మాసంలో బటన్ నొక్కారు. ఆయా మండలాల్లో కూడా వైసీపీ నాయకులు భారీగా మహిళలతో సభలు పెట్టి నమూనా చెక్కులు ఇచ్చి పంపారు. అయితే ఇప్పటికీ నాల్గో విడత ఆసరా డబ్బులు పడలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లాలో 4లక్షల మంది మహిళలకు రూ.280 కోట్లు ఆసరా కింద జమకావాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో వారి ఖాతాలకు జమకాలేదు.

బటన్ నొక్కి నెలపైనే..

- రైతులకు అందని పెట్టుబడి సాయం
- ఎప్పటికి ఇస్తారో తెలియని పరిస్థితి
- మిచౌంగ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన వైనం
- పరిహారం అంతంతమాత్రం.. అది కూడా ఇవ్వలేదు!

ఒంగోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ము నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తున్నట్లు నెల క్రితం ప్రకటించారు. అలాగే గతనెల 6న సీఎం వైఎస్ జగన్ స్వయంగా బటన్ నొక్కారు. అయితే ఇంతవరకూ జిల్లాలో అత్యధికశాతం మందికి ఆ సాయం అందిన దాఖలాలు లేవు. వాస్తవానికి జిల్లాలోని రైతులను మిచౌంగ్ తుఫాన్ తీవ్రంగానే దెబ్బతీసింది. డిసెంబరు 2 నుంచి 4 వరకు కురిసిన వర్షాలతో వేలాది ఎకరాల్లోని పత్తి, మిర్చి, పొగాకు, కంది, మినుము, మొక్కజొన్న, వరి, శనగ అలసంద ఇతరత్రా పంటలు దెబ్బతిని కోట్లాది రూపాయల మేర నష్టపోయారు. అయితే పంట నష్టాల గుర్తింపులోనే నిబంధనల పేరుతో రైతులకు మొండిచేయి చూపారు. నలభై రోజుల లోపు పైరు పేరుతో శనగను తొలగించారు. పొగాకు బోర్డు అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆ నష్టాలను పెద్దగా పట్టించుకోలేదు. ఇతర పంటల విషయంలోనూ అలాగే వ్యవహరించారు. చివరకు 21 మండలాల్లో 5,137 ఎకరాలలో పలు పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. సుమారు నాలుగున్నర వేల మంది రైతులకు రూ.2.89 కోట్లు పెట్టుబడి రాయితీ ఇవ్వాల్సి ఉంటుందని తేల్చి ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదించారు. వాస్తవంగా జిల్లాలో జరిగిన నష్టం అంతకు పదిరెట్లు ఉండగా నిబంధనల పేరుతో మొండిచేయి చూపారు. ఇదిలా ఉండగా మిచౌంగ్ బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించి ఎన్నికల్లో లబ్ధే ప్రధాన లక్ష్యంగా మార్చి 6న సీఎం బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నెలన్నర గడుస్తున్నా అధికశాతం మందికి ఇంకా నగదు అందలేదు. త్రిపురాంతకం మండలంలో 1,100 మంది రైతులకు రూ.80 లక్షలకుపైగా రావాల్సి ఉండగా ఒక్క రైతు ఖాతాకు కూడా జమకాలేదని తెలుస్తోంది. కురిచేడు, ముండ్లమూరు మండలాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. తాళ్లూరు మండలంలో 115 మంది రైతులకు రూ.14.47 లక్షలు అందాల్సి ఉండగా సగం వచ్చినట్లు సమాచారం. ఇతర మండలాల్లోనూ కొన్నింటిలో అసలు రాకపోగా మరికొన్నింటిలో అరకొరగా జమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలుతో అసలు ఆ సొమ్ము వస్తుందా? రాదా? అన్న సంశయం రైతుల్లో వ్యక్తమవుతూ ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంటనష్టంపై రైతువారీ వివరాలు ప్రభుత్వానికి పంపామని తదనుగుణంగా వారి ఖాతాలలో రాయితీ సొమ్ము జమ అవుతుందన్నారు. ఎంతమంది రైతులకు ఇప్పటివరకు పడిందన్న విషయం తమ వద్ద వివరాలు ఉండవని చెప్పారు. కొంతమందికి ఏదైనా సాంకేతిక కారణాలతో జమ కాకపోయి ఉండవచ్చన్నారు. ఎవరైనా నగదు జమకాకపోతే తమ శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాంటి వారి వినతిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి నగదు అందేలా చూస్తామన్నారు.

14 మంది.. 17 సెట్లు..

- ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు
- ఐదు అసెంబ్లీ స్థానాలకు పది మంది దాఖలు
- కనిగిరి, ఎస్ఎన్‌పాడు, మార్కాపురం సెగ్మెంట్‌లకు నిల్


ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 20 : జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్ స్థానంతోపాటు ఐదు అసెంబ్లీ స్థానాలకు శనివారం 14 మంది 17 సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, ఐదు అసెంబ్లీ స్థానాలకు పది మంది అభ్యర్థులు 12 సెట్లను సమర్పించారు. అందులో ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు, దర్శి నియోజకవర్గానికి ఇద్దరు, ఒంగోలు నియోజకర్గానికి ఒకరు, కొండపికి నలుగురు, గిద్దలూరు నుంచి ఇద్దరు ఉన్నారు. ఒంగోలు ఎంపీ స్థానానికి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ఆయన భార్య లక్ష్మి ఒకసెట్ అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులు రాయపాటి జగదీష్, ఆకుమళ్ల మల్లికార్జునరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గొట్టిముక్కల సుజాత నామినేషన్ వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, బీఎస్పీ అభ్యర్థి ఇత్తడి శివప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు. ఒంగోలు అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా చప్పిడి రవిబాబు నామినేషన్ వేశారు. కొండపి నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా రాష్ట్రమంత్రి ఆదిమూలపు సురేష్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, పిరమిడ్ పార్టీ నుంచి బాలకోటయ్య మెండ, బీఎస్పీ అభ్యర్థిగా రావినూతల మాత్రిక, స్వతంత్ర అభ్యర్థిగా మమిడి మాల్యాద్రిలు నామినేషన్లు వేశారు. గిద్దలూరు అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా బాలసాని మాల్యాద్రిరెడ్డి, కొప్పోలు నరసింహులు నామినేషన్లు దాఖలు చేశారు. మూడోరోజైన శనివారం సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

సందట్లో సడేమియా!

- కరవదిలో వైసీపీ నేతల బరితెగింపు
- గుండ్లకమ్మలో జోరుగా ఇసుక తవ్వకాలు
- ట్రాక్టర్‌లలో తరలించి విక్రయం
- ఎన్నికల హడావుడిలో యంత్రాంగం



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 20 : వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికార యంత్రాంగం ఎన్నికల హడావుడిలో ఉండటాన్ని ఆసరా చేసుకొని ఇసుక అక్రమ తవ్వకాలకు తెరతీశారు. ఒంగోలు రూరల్ మండలం కరవది గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ పరీవాహక ప్రాంతమైన అమ్మనబ్రోలు డొంక, శిరిగిరివారిడొంక సమీపంలో ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి మరీ ఇసుకను తోడేస్తున్నారు. దాన్ని ట్రాక్టర్లలో తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతంలో వివిధ రకాల పంటలు సాగు చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నా అవేమీ పట్టించుకోకుండా అక్రమార్జనే ధ్యేయంగా దందా కొనసాగిస్తున్నారు. నిరంతరం ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండటంతో పొలాలకు వెళ్లేందుకు వేసిన మెటల్ రోడ్డు సైతం దెబ్బతింటోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయి అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



కరవదికి సమీపంలోని గుండ్లకమ్మలో కుప్పలుగా పోసిన ఇసుకను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కూలీలు



చంద్రబాబు జన్మదినం సందర్భంగా బొడ్డువారిపాలెంలో మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్ఎన్ పాడు కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- జిల్లావ్యాప్తంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు
- ఎక్కడికక్కడ పెద్దఎత్తున పాల్గొన్న టీడీపీ శ్రేణులు
- పలుచోట్ల కేక్ కటింగ్‌లు

ఒంగోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలుప్రాంతాల్లోని పార్టీ కార్యాలయాలతోపాటు, కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న చోట్ల కేక్ కటింగ్‌లు, సమావేశాలు నిర్వహించారు. ముఖ్యనేతలు పరస్పరం కేకులు తినిపించుకొన్నారు. తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కూటమిలోని ఇతర పార్టీల నాయకులు కూడా అక్కడక్కడా హాజరయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ కూటమి సంపూర్ణ విజయం సాధించి మరోసారి చంద్రబాబు సీఎం కావాలని, తద్వారా రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. మార్కాపురంలో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేశారు. కనిగిరిలో నిర్వహించిన వేడుకల్లో అక్కడి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు. దర్శిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అక్కడి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు హాజరయ్యారు. గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. ఒంగోలులోని రాజీవ్‌నగర్‌లో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం అక్కడ నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. బీజేపీ, జనసేన నాయకులు కూడా హాజరయ్యారు. ఒంగోలులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కేక్ కట్ చేయగా వివిధ మండలాల ముఖ్యనేతలు పాల్గొన్నారు. నగరంలోని భాగ్యనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ స్థానిక నేతలు ఉత్సాహంగా చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు.



మార్కాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, నారాయణరెడ్డి

జంట విషాదం

- రెండు జంటలు ఆత్మహత్య
- పిచ్చిగుంటపల్లిలో యువకుడు, యువతి
- ఆమెకు రేపు పెళ్లి.. అంతలోనే ప్రియుడైన వలంటీర్‌తో కలిసి అఘాయిత్యం
- పుచ్చకాయలపల్లిలో వివాహిత, అవివాహితుడు బలన్మరణం
- నాలుగు కుటుంబాల్లో విషాదం



పిచ్చిగుంట్లపల్లిలో ఆత్మహత్య చేసుకున్న ప్రేమికుల మృతదేహాలు

క్షణికావేశం నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తెలిసీతెలియక తీసుకున్న తొందరపాటు నిర్ణయమో, తమ వారందిరిలో చులకన అవుతామన్న భయమో వారిని ఆత్మహత్యలకు పురికొల్పింది. పచ్చని పెళ్లి పందిరిలో తమ బిడ్డ కళకళలాడుతుంటే చూడాలన్న సంతోషం ఒకరిది.., ముగ్గురు అక్కాచెల్లెల్ల నడుమ ఒక్కడే సోదరుడు సంతోషంగా ఉండాలనే ఆరాటం మరొకరిది. ఆ రెండు కుటుంబాల ఆశలను ఆ ప్రేమజంట అడియాశలు చేస్తూ బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మార్కాపురం రూరల్ మండలం పిచ్చిగుంట్లలో చోటుచేసుకుంది. మరో ఘటనలో.. చేసిన తప్పు పదిమందికి తెలిస్తే, పరువు పోతుందన్న భయం ఓ జంట ప్రాణాలు తీసుకొనేలా చేసింది. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లిలో ఈ ఉదంతం వెలుగు చూసింది.

లోపలి పేజీల్లో..

బాలినేని బడాచోర్

- ఆయన అవినీతి, అక్రమాలు కోకొల్లలు
- బినామీలతో పెద్దఎత్తున వసూళ్లు
- ఆధారాలతో సహా ప్రజలకు వివరిస్తా
- సొంత బావకే వెన్నుపోటు పొడిచారు
- నన్ను చంపుతామని కొందరు బెదిరిస్తున్నారు
- నాకుటుంబానికి ఏమైనా జరిగితే ఆయనదే బాధ్యత
- టీడీపీ నాయకుడు సూర్యప్రకాష్‌రెడ్డి



ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 20 : ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పెద్ద దొంగ అని టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఆయన అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపూ లేదన్నారు. తాను ప్రజల్లోకి వెళ్లి వాటిని ఆధారాలతో సహా వివరిస్తానని చెప్పారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రస్థానం కల్పించిన సొంత బావ వైవీ సుబ్బారెడ్డికి బాలినేని వెన్నుపోటు పొడిచారన్నారు. రఘురెడ్డి, భక్తవత్సలరెడ్డి అనే వ్యక్తులను బాలినేని బినామీలుగా ఏర్పాటు చేసుకుని జిల్లాలో అవినీతి దందాలు, నెలవారీ వసూళ్లకు పాల్పడిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. వాస్తవాలు మాట్లాడుతుంటే చంపుతామని బెదిరిస్తున్నారని, తన కుటుంబానికి ఏమైనా జరిగితే బాలినేనిదే బాధ్యత అన్నారు. అమాయకంగా ముఖంపెట్టి ప్రజలను మోసం చేస్తున్న బాలినేని మాటలు ఎవరూ నమ్మొద్దన్నారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తే ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను దహనం చేయించింది బాలినేని కాదా? అని ప్రశ్నించారు. గ్రానైట్ వ్యాపారుల నుంచి వేల కోట్ల రూపాయలను దోచుకున్న ఆయనకు రాజకీయంగా రోజులు దగ్గర పడ్డాయన్నారు. వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి విల్లాల కోసం యరజర్ల కొండ మట్టిని తరలించారని విమర్శించారు. బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి ఒంగోలు నగరంలో పెద్దఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అలాగే నకిలీ స్టాంపుల కుంభకోణంలో బాలినేని అనుచరులు పాత్ర ఉంటే వారిని కాపాడేందుకు కేసును నీరుగార్చారని ఆరోపించారు. ఇటీవల నగరంలోని సమతానగర్, రిమ్స్‌లో ఘటనలు జరిగినప్పుడు తాను ఎంపీ మాగుంటతో కలిసి కొండపిలో ఉన్నానని పెద్దిరెడ్డి చెప్పారు. అయితే తాను ఆ ఘటనల్లో పాల్గొన్నట్లు చూపి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం బాలినేని ప్రోద్బలంతోనే జరిగిందన్నారు.

రేపు పీసీసీ చీఫ్ షర్మిల పర్యటన

- ఎర్రగొండపాలెంలో బహిరంగ సభ



ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 20 : పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఎర్రగొండపాలెంలో కాంగ్రెస్ అభ్యర్థి బూదాల అజితారావు నామినేషన్ కార్యక్రమానికి ఆమె హాజరవుతారు. అనంతరం అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి శనివారం ఒంగోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అజితారావు నామినేషన్, అనంతరం జరిగే సభకు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేత

అడ్డగోలు నిర్మాణం..!

యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన ● కనీస సెట్ బ్యాక్‌లూ కనిపించని వైనం ● అదనపు అంతస్తులకు అనుమతులు నిల్

కళ్లుమూసుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు ● నిర్మాణరంగంపై లోకాయుక్త ఆదేశాలు బేఖాతరు



మంగమూరు రోడ్ మర్రిచెట్టు వద్ద అనుమతులు ఉల్లంఘించి నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 20: ఒంగోలు నగరంలో అధికార పార్టీ నేతల అడ్డగోలు వ్యవహారాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. నిన్నా మొన్నటి వరకు నగరంలో కొందరు నేతలు ఖాళీ స్థలాలు కబ్జాలు చేయగా, తాజాగా మరికొందరు వైసీపీ నేతలు అపార్ట్‌మెంట్ రంగంలో అడ్డగోలు నిర్మాణాలకు తెరలేపారు. అనుమతులు ఉన్నా లేకున్నా అదనపు అంతస్తులు నిర్మిస్తూ అధికార అహంకారాన్ని చూపుతున్నారు. తాజాగా నగరంలోని మంగమూరురోడ్ మర్రిచెట్టు వద్ద నిర్మిస్తున్న అనధికార అపార్ట్‌మెంట్ అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. కొండపి నియోజకవర్గానికి చెందిన ఓ వైసీపీ జడ్పీటీసీ భర్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవనం అనుమతులు అతిక్రమించినట్లు తెలుస్తున్నది. నిబంధనలు ప్రకారం అనుమతులు తీసుకుని వాస్తవ నిర్మాణంలో అందుకు విరుద్ధంగా మరో అంతస్తు నిర్మిస్తుండటం గమనార్హం. మరోవైపు ప్రభుత్వ నిబంధనల మేరకు వదలాల్సిన సెట్‌బ్యాక్‌లను లేకుండా నిర్మించారు. వైసీపీ నేతల ఒత్తిళ్ళు, భారీగా మామూళ్ళ చేతులు మారడంతో కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మంగమూరురోడ్ మర్రిచెట్టు సమీపంలో వందల కొద్ది అపార్ట్‌మెంట్లు వెలిశాయి. అయితే వాటి విషయంలో నిబంధనల పేరుతో అధికారులు సంబంధిత యజమానులకు అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టగా, వైసీపీ నేతల ఆధ్వర్యంలో నిర్మించే అపార్ట్‌మెంట్‌కు అన్నీ తామై వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. ఎన్నికల సమయం కావడంతో అధికార యంత్రాంగమంతా విధుల్లో ఉన్నామని చెబుతూ దాటవేస్తున్నారు.

బహుళ అంతస్తుల్లో భరోసా కరువు

సామాన్యుడి సొంతింటి కల కలగానే మిగిలిపోతుంది. దీంతో అపార్ట్‌మెంట్ రంగానికి ఆదరణ పెరిగింది. జిల్లాలో బహుళ అంతస్తుల సంస్కృతికి బహు డిమాండ్ ఏర్పడింది. గతంలో పట్టణాలకే పరిమితమైన అపార్ట్‌మెంట్లు మండలాల నుంచి గ్రామాలకు విస్తరిస్తున్నాయి. కష్టాలు పడి కట్టే నివాసం కన్నా కాసుల చెల్లించి, కమ్మని గృహాలను సొంతం చేసుకునేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లాలో క్రమేపీ సిరాస్థి వ్యాపారం విస్తరించింది. ఇదిలా ఉండగా ఒంగోలు నగరంలో బిల్డర్లకు కొదువ లేకుండాపోయింది. ఖాళీ స్థలాలు కొనుగోలు చేసి 60+40 పద్ధతిన నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగించేవారు. ఇప్పటి వరకు స్థానికంగా ఉండే కొందరు ప్రముఖులు బిల్డర్లుగా వ్యవహరిస్తుండగా, తాజాగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పలువురు నగరంలోని అపార్ట్‌మెంట్ రంగంలో అడుగుపెట్టారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగింది. 50+50 విధానంతో వ్యాపారాలు మొదలయ్యాయి. అయితే ప్రభుత్వం ఆదేశించిన ప్రమాణాలను విస్మరించి ఇష్టారాజ్యంగా నిర్మిస్తుండడంతో రూ.కోట్లు ఖర్చుచేసినా కనీస భద్రత కరువైపోతుంది. ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చూడాల్సిన అధికారులు ముడుపుల మత్తులో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

లోకాయుక్త ఆదేశాలు భేఖాతరు

గత పదేళ్ళలో అపార్ట్‌మెంట్ రంగం మరింతగా విస్తరించింది. అయితే నిబంధనల మేరకు అగ్నిప్రమాదాలు జరిగినపుడు ప్రమాదాలను నివారించేందుకు సెట్ బ్యాక్‌లు వదలాలి. అంతేగాకుండా ఫైర్ అనుమతులు ఉండాలి. కానీ అలాంటి వేమీ ఇక్కడ కనిపించడం లేదు. ఇప్పటి వరకు 70 శాతాకి పైగా అపార్ట్‌మెంట్‌లకు అగ్నిపాక శాఖ అధికారుల నుంచి అనుమతులు లేవనే విషయాన్ని లోకాయుక్త గుర్తించింది.

ఒంగోలులోనే దాదాపు 700లకు పైగా అపార్ట్‌మెంట్లు ఉండగా, జిల్లా వ్యాప్తంగా మరో మరో 300 అదనంగా ఉండొచ్చనేది అంచనా. కానీ నేటికి వాటిల్లో తనిఖీలు నిర్వహించకపోవడం అధికారుల పనితీరుకు దర్పణం పడుతోంది. కనీస ప్రమాణాలు పాటించకపోవడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భవనం నిర్మించాలంటే...

- ముందుగా భవనం నిర్మించాల్సిన భూమిని పరిశీలించాలి.
- ఎన్ని అంతస్తులు నిర్మించవచ్చనే విషయాన్ని జీయాలజిస్టులు నిర్ధారించాలి
- మునిసిపాలిటి అనుమతి పొందిన లైసెన్సు ఇంజనీర్‌తో ప్లాను గీయించాలి.
- నిర్మాణం ప్రారంభించే ముందు అగ్నిమాపకశాఖ శాఖ అనుమతి పొందాలి
- వారు అన్నీ పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఆ తర్వాత అనుమతి లభిస్తేనే కట్టడాలు ప్రారంభించాలి
- భవనం పూర్తయిన తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారులు అన్నీ సక్రమంగా ఉంటే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇవ్వాలి. భవనంలో వాడిన విద్యుత్ తీగలు నాణ్యమైనవా? కాదా అనేది విద్యుత్ శాఖాధికారులు పరిశీలించాల్సి ఉంది.

కచ్చితంగా పాటించాల్సినవి...

- భవనం చుట్టూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదలాలి.
- అపార్ట్‌మెంట్ చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగేందుకు స్థలం ఉండాలి
- ప్రమాదాల సమయాల్లో బయటకు వచ్చేందుకు వెనుక భాగంలో ఇనుప నిచ్చెన ఉండాలి
- విశాలమైన మెట్లు, లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- ప్రతిఫ్లోర్‌లోనూ అగ్నిప్రమాదాలు ఎదుర్కొనేందుకు తగిన సామగ్రి ఉండాలి. ప్రమాదాల నివారణకు నీటి నిల్వ ట్యాంకులు ఉండాలి.
- సెల్లార్లు వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే వాడాలి.
- వ్యాపారాల కోసం షాపింగ్‌లకు అనుమతి లేదు.



34వ డివిజన్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దామచర్ల జనార్దన్



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న బీఎన్, నాయకులు



గాంధీరోడ్డులో కేక్ కట్ చేస్తున్న ఆర్యవైశ్యులు

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం

● తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల

● ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 20: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఆ దిశగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కష్టపడి పనిచేసి అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలని కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 34వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజికాభివృద్ధి, సంక్షేమ పాలన అందించిన విజన్ గల నాయకుడు చంద్రబాబు అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవడం సంతోషంగా ఉందని చెప్పారు. అలాగే వైసీపీ పాలనలో అన్ని విధాలుగా నష్టపోయిన రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి కూటమి శ్రేణులంతా వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. అనంతరం పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగయ్యయాదవ్, బొద్దులూరి ఆంజనేయులు, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, టీడీపీ నాయకులు కొఠారి నాగేశ్వరరావు, దాయనేని ధర్మ, గొర్రెపాటి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో..

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం స్థానిక గాంధీరోడ్‌లో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంతోషాలు పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పబ్బిసెట్టి భాస్కర్, వలివేటి పవన్, కొల్లిపల్లి సురేష్, కొప్పురావూరి సురేష్, చీదెళ్ల ఉమా మహేశ్వరరావు, మిరియాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో కేక్ తినిపిస్తున్న అడకా స్వాములు, నాయకులు





ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడులో కేక్ కట్ చేస్తున్న శ్రేణులు

చీమకుర్తిలో..

చీమకుర్తి: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం చీమకుర్తి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నెహ్రూనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నం సుబ్బారావు, ఆరుద్ర రామారావు, నలపాటి కొండయ్య, రాచర్ల అనంత్, దాసరి సురేష్, దావులూరి సుధీర్, అవనిగడ్డ శేషయ్య పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: దేశరాజకీయాల్లో చక్రం తిప్పిన టీడీపీ అధినేత చంద్రబాబును నాయకులు, కార్యకర్తలు ఆదర్శంగా తీసుకుని పార్టీ పటిష్టతకు కృషి చేస్తూ ఎదగాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని చంద్రపాలెం, బొడ్డువారిపాలెం గ్రామాల్లోను, ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో విజయ్‌కుమార్ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే సంతనూతలపాడు అంకమ్మతల్లి ఆలయంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ఆయన ఆరోగ్యం బాగుండాలని బీఎన్ పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్, మండవ జయంత్‌బాబు, యడ్లపల్లి రాంబ్రహ్మం, గొల్లపూడి శ్రీనివాసరావు, సురేష్, అంకారావు, నరసింహారావు, తన్నీరు శ్రీను, టి.నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, ఎన్.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు : చంద్రబాబు జన్మదిన వేడుకలను నాగులుప్పలపాడులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఝాన్సీ, చుండూరు నాగేశ్వరరావు, గొల్లపూడి పెద్దసుబ్బయ్య, హరినాథ్‌బాబు, కుతురు రామారావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, వెంకటాద్రి పాల్గొన్నారు. అలాగే ఈదుమూడి గ్రామంలో జరిగిన జన్మదిన వేడుకల్లో గ్రామ అధ్యక్షులు కుర్రా వీరాంజనేయులు, భీమనేని స్వామి, భీమనేని తరుణ్, ఉప్పల ప్రసాద్, ఒంగోలు డెయిరీ మాజీ డైరెక్టర్ బాచిన నాగేశ్వరరావు, కొదమల ప్రతాప్, కొమ్మూరి సైమన్, చిలి పాల్సన్, తేళ్ళ ఏలియా తదితరులు పాల్గొన్నారు. ఎం.ముప్పాళ్ళలో చంద్రబాబు జన్మదిన వేడుకలు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ వాసు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు జెట్టి వీరాస్వామి, చిన్నం చైతన్య, పెండ్యాల సురేష్, కరుణామ అశోక్, మండవ వెంకటేశ్వర్లు, కల్లూరు శ్రీనివాసరావు, పెండ్యాల కోటేశ్వరరావు, మురళి, సురేష్, హనుమంతరావు, బోడ్డు ప్రసాద్, పి.కార్తీక్, పి.రాజేష్ పాల్గొన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పుగుండూరు గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తెలగతోటి జాన్సన్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, ఆనందరావు, సింగరయ్య, బాలయ్య, వెంకటాద్రి, పి.సుబ్బయ్య, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు..!

వచ్చేది చంద్రన్న ప్రభుత్వమే.. ● టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్



గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 20: "సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అప్రమత్తంగా ఉండాలి. సమయం వైసీపీ నాయకులు మభ్యపెట్టేందుకు ప్రలోభాలకు గురిచేస్తారు. వాస్తవాలను ప్రజలకు ఎప్పటికపుడు తెలియజేయండి." అంటూ టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ శ్రేణులు అప్రమత్తం చేశారు. గుమ్మళంపాడు గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించి కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందజేశారు. స్వర్ణయుగం పాలన టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. నియోజకవర్గంలో నాడు టీడీపీ హయాంలో చేపట్టిన శాశ్వత తాగునీటి పథకాలు, రోడ్డు నిర్మాణాలను వాస్తవాలు గమనించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.

పలువురి చేరిక

కాగా గుమ్మళంపాడు వైసీపీ ముఖ్యనాయకుడు నువ్వుల రాఘవరావు వైసీపీని వీడి బీఎన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచుకున్నారు. మరో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరగా వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర జనసేనపార్టీ అధికారప్రతినిధి రాయపాటి అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు తన్నీరు శ్రీను, మొలకలపల్లి శ్రీను, సుబ్బారావు, అంకారావు, కనకయ్య, నరసింహారావు, సురేష్, పున్నారావు, శేఖర్, రాము పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

వారికి ఇంటి పట్టాలు ఇచ్చింది తెలుగుదేశం హయాంలోనే..

అధికారంలోకి వచ్చాక ఇళ్లను నిర్మించి ఇస్తాం ● ఆత్మీయ సమావేశంలో దామచర్ల జనార్దన్

కొత్తపట్నం(ఒంగోలునగరం), ఏప్రిల్ 20: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా అనేక కార్యక్రమాలను అమలు చేసిందని, మళ్ళీ తెలుగుదేశం అధికారం చేపట్టిన వెంటనే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేయబోతుందని టీడీపీ కూటమి అభ్యర్థి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం కొత్తపట్నంలో జరిగిన విభిన్నప్రతిభావంతుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలోని పాదర్తి, మోటుమాల గ్రామాల మధ్య 280 మంది దివ్యాంగులకు ఇంటి నివేశన స్థలాలను తాను ఎమ్మెల్యేగా ఉండగా ఇప్పించానని తెలిపారు. అయితే తరువాత జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు దివ్యాంగుల అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్న హయాంలో ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఇళ్ళను నిర్మించి ఇచ్చే బాధ్యతలను కూడా తాను తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. త్వరలో జరిగే ఎన్నికల తరువాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాబబోతుందని, దివ్యాంగులకు పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని దామచర్ల హామీ ఇచ్చారు. అంతేగాకుండా చంద్రబాబు సీఎం కాగానే రాష్ట్రంలోని దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వబోతున్నారని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పటమే గాని అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించుకున్నదీ లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా కొత్తపట్నం మండలం ఎంత అభివృద్ధి చెందిందో గమనించాలని కోరారు. ఎమ్మెల్యేగా మరోసారి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సాయిజనార్దన్, మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, మాజీ జడ్పీటీసీ మేడా సుబ్బారావు, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణ, మండల నాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 4 నామినేషన్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల అధికారి దినేష్‌కుమార్‌కు ఈ నామినేషన్లను అందజేశారు. నలుగురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రెండు నామినేషన్లను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబులు బలపర్చారు. మరో నామినేషన్‌ను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి వేశారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా రాయపాటి జగదీష్ ఒక నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా ఆకుమల్ల మల్లికార్జునరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

ఒంగోలు అసెంబ్లీకి ఒక నామినేషన్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థి చప్పిడి రవిబాబు శనివారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డికి రవిబాబు నామినేషన్లను అందజేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ మూడు రోజుల్లో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి.

టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శిగా మురళీబాబు



దామచర్లను సత్కరిస్తున్న మురళీబాబు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ ఒంగోలు నియోజకవర్గ వాణిజ్య విబాగం కార్యదర్శిగా అల్లూరుకు చెందిన షేక్ మురళీబాబును రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ శనివారం నియమించారు. చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో సేవలందించినందుకు మురళీబాబుకి బాధ్యతలు అప్పగించినట్లు దామచర్ల తెలిపారు. ఈ సందర్భంగా మురళీబాబు మాట్లాడుతూ తనను కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

23 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 20: ఉప్పుగుండూరు గ్రామంలో జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సర్దార్ వల్లభాయ్‌పటేల్ క్రీడా ప్రాంగణం(ఊరచెరువు)లో అడ్వాన్సుడ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ పోటీలను జరుగుతాయి. మొదటి బహుమతి రూ.30,116, రెండో బహుమతి రూ.20,116, మూడవ బహుమతి రూ.15,116, నాల్గవ బహుమతి రూ.10,116, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అందజేస్తొన్నారు. ఈ పోటీలను ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు తమ వివరాలను 7893591227, 89194 31891, 9676617393 సెల్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు



కేక్ కట్ చేస్తున్న జయంత్‌బాబు, రఘుబాబు

మద్దిపాడు, ఏప్రిల్ 20 : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా నాయకుడు, అభివృద్ధి కాముకుడు చంద్రబా బునాయుడు అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మండవ గోపీనాథ్, అన్నమనేని సుబ్బారావు, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, కడియాల రఘుబాబు, దేవబత్తిని ప్రసాదరావు, కాకర్ల విజయకుమార్, రెబ్బవరపు ప్రభాకర్, దుద్దుకూరు డేవిడ్, పాటిబండ్ల చెంచయ్య, శుద్దపల్లి అనిల్, శుద్దపల్లి సుబ్బారావు, వేల్పుల నాగరాజు, ఎర్రగర్ల చైతన్య, చింతల శ్రీనివాసరావు, రావి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

24లోపు సీవీఎన్ సభ్యత్వం చెల్లించాలి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 20: ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము, క్లబ్ సభ్యత్వం కోల్పోయిన వారు ఈ నెల 24వ తేదీ లోపు సభ్యత్వ రుసుము, వెయ్యి రూపాయల పెనాల్టీతో కలిపి చెల్లించి తిరిగి సభ్యత్వం పొందాలని క్లబ్ ప్రత్యేక అధికారులు బేతంశెట్టి హరిబాబు, తోట రామస్వామిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే అటువంటి సభ్యులు తమ సభ్యత్వాన్ని శాశ్వతంగా కోల్పోతారని పేర్కొన్నారు.

రిమ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సంతనూతలపాడు, ఏప్రిల్ 20: పి.గుడిపాడు డొంక సమీపంలో కృష్ణ సాయి గ్రానైట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం కృష్ణసాయి గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ శిద్దా హనుమంతరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసిన అనంతరం రక్తదాన శిబిరం, వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానంలో పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణసాయి గ్రూపు ఉద్యోగులు, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లు వాడితే చర్యలు : ఎస్పీ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 20: మోటార్‌సైకిళ్లకు విపరీతమైన శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 118 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శబ్ధ సైలెన్సర్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనదారులపై కేసులు నమోదు చేసి సైలెన్సర్లను తొలగించారు. అదేవిధంగా శబ్ధ సైలెన్సర్లు అమర్చుకుని శబ్ధ కాలుష్యానికి పాల్పడితే వారిపై కేసులతో పాటుగా జరిమానా విధిస్తామన్నారు. అంతేగాకుండా ఇలాంటి సైలెన్సర్లు అమర్చే వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు రహదారి భద్రతా నియామాలు పాటించాలని ఎస్పీ కోరారు.

ఆంక్షలు..అవస్థలు..!

ట్రాఫిక్ పోలీసుల తీరుతో కలెక్టరేట్ సమీపంలో వ్యాపారం బంద్

వాపోతున్న వ్యాపారులు, వాహనాదారులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమలు చేస్తున్న ఆంక్షలు వ్యాపారుల పాలిట శాపంగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక కలెక్టరేట్ ప్రాంతమంతా బంద్ వాతావరణాన్ని తలపిస్తున్నది. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు కలెక్టర్ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లు ఉండగా, ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్‌లు దాఖలు చేసే కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఎలాంటి వ్యాపారాలు చేసుకోకూడదు. ఇతరులు ఎవరూ ఆ వైపు రాకపోలు సాగించకూడదు. అంతేగాకుండా అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా ఉంది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ వేసేందుకు సమయం ఉండగా, ఆ సమయంలో ఆంక్షలు అమలులో ఉన్నాయి. కానీ ప్రకాశంభవనం నాలుగు వైపులా పోలీసుల ఆంక్షలతో ప్రజలు అవస్థలు పడుతుండగా, వ్యాపారులు సైతం తమ దుకాణాలు మూసివేయాలని నోటీసులు జారీ చేయడంపై విలవిలలాడుతున్నారు. ప్రకాశంభవనం నుంచి కార్పొరేషన్ కార్యాలయం వెళ్ళే మార్గంలో కేశవస్వామిపేట జంక్షన్ వద్దనే బారికేడ్లు ఏర్పాటు చేయగా, నెల్లూరు బస్టాండ్ వరకు, రైల్వేస్టేషన్ రోడ్ మార్గంలో మాగుంట సుబ్బరామిరెడ్డి బొమ్మ వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేయడంతో ఆ సమీపంలోని వ్యాపార సంస్థలన్నీ మూతపడిపోతున్నాయి. కార్పొరేషన్ ఆఫీస్ రోడ్‌లో పీడీసీసీ బ్యాంకు, పోస్టాఫీస్, వన్‌టౌన్ పోలీసుస్టేషన్, కార్పొరేషన్ కార్యాలయం ఉండగా, ప్రకాశంభవనంలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులను సైతం ఆవైపు వెళ్ళనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఆఫీసుకు 9-30గంటలకే వెళ్ళి పోవాలని హెచ్చరించడంతో వాపోతున్నారు. ఇక ప్రకాశంభవనం ఎదురు ఉండే దుకాణాలు సాయంత్రం వరకు మూతపడి ఉంటున్నాయి. నిబంధనల మేరకు వంద మీటర్ల దూరంలో ఆంక్షలు తప్పు లేదని, అయితే ప్రకాశంభవనం నాలుగువైపులా సుమారు అరకిలోమీటరు దూరం ఆంక్షలు విధించడం ఏమిటని సామాన్య ప్రజల ప్రశ్నిస్తున్నారు.



వాహనదారుడిని అడ్డుకున్న కానిస్టేబుల్

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ టీడీపీకే సాధ్యం



చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ మమత, తెలుగు మహిళలు

టంగుటూరులో టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

టంగుటూరు, ఏప్రిల్ 20 : టంగుటూరు పట్టణ అభివృద్ధి తెలుగుదేశం పార్టీకే సాధ్యమని పలువురు టీడీపీ నాయకులు అన్నారు. ముదిరాజుకాలనీ, బ్రాహ్మణ బజారు, శివాలయం వీధి, రజకుల కాలనీలో శనివారం ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం జరిగింది. నాయకులు ఇంటింటికీ తిరుగుతూ టంగుటూరు పట్టణం ఏ విధంగా వెనుకబడి పోయిందో ప్రజలకు వివరించారు. సాధారణంగా పట్టణ అభివృద్ధి పంచాయతీ ద్వారా జరుగుతుందని, పంచాయతీ నిధులు సుమారు రూ.3కోట్లు ప్రభుత్వం మాటమాత్రం కూడా చెప్పకుండా దారిమళ్లించిందని, దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయిందన్నారు. గ్రామంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని, కొండపి రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని, దళిత వాడల్లో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేదని అన్నారు. దళిత వాడలకు అనుబంధంగా సుమారు 20ఏళ్ల నాడు ఇచ్చిన ఇళ్ల ప్లాట్లు మౌలిక వసతులు లేక పల్లపు ప్రాంతాల్లో చిల్లచెట్లు గుబురు పొదల మాటున దాగిఉన్నాయన్నారు. ఒక వైపు టంగుటూరు మీదగానే గ్రామాలకు రామతీర్థం నీరు సరఫరా అవుతుంటే ఇక్కడ మాత్రం కలుషిత నీటితోనే గడపాల్సిన పరిస్థితులు ఉన్నాయని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఈదారుణ పరిస్థితులు వైసీపీ ప్రభుత్వం కారణంగానే ఏర్పడ్డాయని, దీన్నుంచి బయటకు వచ్చేందుకు టీడీపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముదిరాజు కాలనీలో స్థానికులు చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు జరిపారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మద్దిరాల మమత, తోకల భారతి, బ్రహ్మానందం, జక్కుల శ్రీను, భానుచందర్, దయానందం, పెద్దోడు, కుందేటి వెంకట్రావు, ఉమామహేశ్వరావు, మక్కెన కోటేశ్వరరావు, మక్కెన హరిబాబు పాల్గొన్నారు.

నిత్య యవ్వనుడు చంద్రబాబు

పుట్టిన రోజు వేడుకల్లో టీడీపీ నేతలు

టంగుటూరు, ఏప్రిల్ 20 : 75వ పడిలోకి అడుగిడుతున్న నిత్య యవ్వనుడు చంద్రబాబు అని మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుక శనివారం టంగుటూరులోని మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ గృహంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 46 ఏళ్ల సుదీర్ఘకాలం ప్రజాసేవలో తరించిన ధన్యజీవని, తెలుగువారికి రేపటి వెలుగు చూపిన దార్శనికుడని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన, మైనారిటీల ఉన్నతికి అహరహం పరితపించిన వ్యక్తి చంద్రబాబు అని వివరించారు. పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని సామాన్యుని హితం కోసం వాడిన మేటి నాయకుడని, నవ్యాంధ్ర ప్రగతికి తొలిబాట వేసిన కార్యశూరుడని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, తోకల భారతి. బ్రహ్మానందం, జక్కుల శ్రీను, దయానంద్, భానుచందర్, మద్దిరాల వెంకట్రావు, కుందేటి వెంకట్రావు, పెద్దోడు, యజమాని, మక్కెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

టీపీనగర్‌లో కేక్‌కట్ చేసిన నేతలు

సింగరాయకొండ, ఏప్రిల్ 20 : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మాజీ ముఖ్యమంత్రి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమరాజుపల్లి పంచాయతీ టీపీనగర్‌లో టీడీపీ నేతలు కేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నర్రా రాంబాబు, వేల్పుల వెంకట్రావు, కొనికి అమర్నాథ్, పొన్నం బ్రహ్మయ్య, బ్రహ్మానందం పాల్గొన్నారు.



ఉప్పలపాడులో ప్రచారం చేస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

గ్రామాల్లో రోడ్డే వేయని వైసీపీ

- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్మాణం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 20 : ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ గ్రామంలోనూ రోడ్లు వేసిన దాఖలాలు లేవని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లు నిర్మిస్తామని ఎ మ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు గ్రా మంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయ న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులు ఎదురువెళ్లి రవికుమార్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన గొట్టి పాటి చంద్రబాబు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కనీసం రహదారులు బాగులేక ప్రజలు అల్లాడు తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో రోడ్లు వేయిస్తామన్నారు. గతంలో మేము చేసిన అభివృద్ధే తప్ప ఎక్కడా పనులు జరగలేదన్నారు. ఇంకా గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్ని విధాలా నాశనమైన రాష్ట్రం గాడిలో పడాలంటే సమర్థు డైన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఉప్పలపాడులో రూ.15 కోట్ల 56 లక్షలతో మంజూరు చేయించిన ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి ఐదేళ్లయినా పను లు చేపట్టలేదన్నారు. వ్యవసాయ రంగానికి టీడీపీ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింద ని, ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యకు పరిష్కా రం చూపేందుకు కృషి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు అంకితం చేస్తామన్నారు. అన్నీ సక్రమంగా సాగాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి ఎంపీగా కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు అన్నబత్తిన సుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, నీలం ప్రసా ద్, కటికాల సత్యనారాయణ, శ్రీనివాసరావు, భైరపునేని రామలింగయ్య, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, నేతలు పాల్గొన్నారు.

మర్రిపూడి మండలంలో జోరుగా సాగిన స్వామి ప్రచారం

అపూర్వస్వాగతం పలికిన ప్రజలు

గ్రామగ్రామాన నీరా'జనం'





ప్రచారరథంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి (ఇన్‌సెట్లో) ప్రచారంలో మహిళల అభివాదం

మర్రిపూడి, ఏప్రిల్ 20 : కొండపి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రచార కార్యక్రమం ఆనవాయితీ ప్రకారం శనివారం మండలంలోని చిలంకూరు గ్రామం నుంచి ప్రారంభించారు. ప్రతి ఎన్నికల్లో కూడా దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు సైతం చిలంకూరు గ్రామం నుంచే ప్రచారాన్ని ప్రారంభించే వారు. అదే ఆనవాయితీని స్వామి కూడా ప్రతి ఎన్నికల్లో అనుసరిస్తున్నారు. ముందుగా చిలంకూరు గ్రామం చేరుకున్న స్వామికి మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. గుమ్మడికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఎండనుసైతం లెక్కచేయకుండా టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా చిలంకూరు, కాకర్ల, శివరాయునిపేట, పన్నూరు, కెల్లంపల్లి, అగ్రహారం, గుళ్ళసముద్రం, రేగలగడ్డ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ కోసం టీడీపీ విజయం చారిత్రక అవసరమన్నారు. వైసీపీ పాలనలో అరాచకం రాజ్యమేలిందని నిరుద్యోగ సమస్య పెనుభూతంలా ఆవహించిందని ధ్వజమెత్తారు. అభివృద్ధి జాడలేకుండా పోయిందని, నవ్యాంధ్రప్రదేశ్‌లో రౌడీ రాజ్యం, భూకబ్జాలు, బీసీలు, దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రతి ఏటా మూడు గ్యాస్‌సిలిండర్లు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం చేయూతను అందిస్తుందని చెప్పారు. రైతులకు ఏటా 20వేల రూపాయల పెట్టుబడి నిధి సమకూర్చనున్నట్లు వెల్లడించారు. మూడు నియోజకవర్గాలు మారిన మంత్రి ఆదిమూలపు సురేష్ ఆయా నియోజకవర్గాల్లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. స్థానికుడైన తనకు మరో అవకాశం ఇస్తే రాష్ట్రంలోనే కొండపి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార సభల్లో స్వామి హామీ ఇచ్చారు. తనతోపాటు ఒంగోలు పార్లమెంట్ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్ళూరి నరసింహారావు, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు శివనారాయణ ప్రసాద్, మాకినేని శ్రీనివాసరావ్, బోయపాటి కృష్ణారెడ్డి, గురజాల యేసుపాదం, సూసాని కృష్ణారెడ్డి, మందాడి బాలకోటయ్య, కె వెూహన్‌రావు, గుంరు బ్రహ్మం, బూదాల యోసుదాస్, ఆర్. వెంకటేశ్వర్లు, కె. ఆంజనేయులు కిలారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మహిళా చైతన్యం

ఎమ్మెల్యే స్వామి ప్రచార సభలలో మహిళా చైతన్యం వెల్లివిరిచింది. ప్రతి గ్రామంలో మహిళలు పెద్దఎత్తున స్వామికి హారతులిచ్చి గుమ్మడికాయలు కొట్టి దిష్టితీసి పూలవర్షం కురిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు అందించే పథకాలపై స్వామి కల్పిస్తున్న అవగాహనకు మహిళలు ప్రతి స్పందిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా మహిళలు పసుపు చీరలు ధరించి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు ప్రచారంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనడం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.



ఇస్త్రీ బండి నిర్వాహకునికి టీడీపీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్న నాయకులు

భవిష్యత్ గ్యారెంటీకే సూపర్ సిక్స్ పథకాలు

ఎం నిడమలూరు(టంగుటూరు) ఏప్రిల్ 20 : రానున్న తెలుగుదేశం ప్రభుత్వం భవిష్యత్ గ్యారంటీకి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు పరచనుందని మండలంలోని ఎం. నిడమలూరు తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. ఎం. నిడమలూరులో శనివారం ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ శంఖారావం ప్రచారం కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆడపడుచులకు మహాశక్తి పథకం ద్వారా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు అందించడం జరుగుతుందన్నారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ల నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ1,500, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి అందజేయడం జరుగుతుందన్నారు. దీపం పథకం ద్వారా ఏడాదికి ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలెండర్లు ఉచితంగా సరఫరా చేస్తారని,మహిళలకు జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పించబడుతుందని వివరించారు. నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తారని, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం కల్పించి ప్రభుత్వం అండగా ఉంటుందని కూడా తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్, గ్రామ పార్టీ నాయకులు పిడుగురాళ్ల సురేష్, కటారి కోటయ్య, జనసేన నాయకుడు మేళం శ్రీనివాసరావు ఉన్నారు.

చిలంకూరు నుంచి స్వామి ప్రచారం

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

కొండపి, ఏప్రిల్19: కొండపి ఎమ్మెల్యే, కూటమి బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తన ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఉదయం నుంచి ప్రారంభించారు. ఆనవాయితీగా వస్తున్న విధంగా మర్రిపూడి మండలంలోని చిలంకూరు గ్రామం నుంచి స్వామి ప్రచారాన్ని ప్రారంభించారు. చిలంకూరులో దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు ప్రారంభించిన ఆంజనేయస్వామి ఆలయంలో డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రచారానికి ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. మర్రిపూడి మండలానికి ఈశాన్యంలో ఉండే గ్రామమైన చిలంకూరు నుంచి స్వామి గడచిన రెండు దఫాలుగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. ఆ సెంటిమెంట్ ప్రకారం ఈదఫా ప్రచారాన్ని కూడా చిలంకూరులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి బాలవీరాంజనేయస్వామి ప్రారంభించారు. ఆంజనేయస్వామి చెంత నుంచి బాలవీరాంజనేయస్వామి ప్రచారం అంటూ గ్రామస్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తూ ప్రచార కార్యక్రమంలో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైసీపీ నుంచి ఐదు కుటుంబాలు టీడీపీలో చేరిక



స్వామి సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ కుటుంబాలవారు

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 20: మండలంలోని పాలేటిపాడు గ్రామ వైసీపీకి చెందిన ఐదు కుటుంబాలవారు శుక్రవారం రాత్రి కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో పార్టీలో చేరారు. గడ్డం శివ, గడ్డం భవానీల ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలవారు స్వామిని ఇంటి వద్ద కలిసి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికిన ఎమ్మెల్యే స్వామి పార్టీ వారికి అండగా ఉంటుందని హామీనిచ్చారు.

'జంట' విషాదం

- క్షణికావేశంతో రెండు ప్రేమజంటలు ఆత్మహత్య
- రేపు పెళ్లి ముహూర్తం.. అంతలోనే అఘాయిత్యం
- వధువు పెళ్లింట విషాదం.. మృతుడు వలంటీర్
- మరోచోట వివాహిత, అవివాహితుడు
- నాలుగు కుటుంబాల్లో విషాదం



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 20: ప్రేమజంట పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం రాత్రి మార్కాపురం మండలంలోని పిచ్చిగుంట్లపల్లి గ్రామంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. పిచ్చిగుంట్లపల్లి గ్రామానికి చెందిన నారు వెంకటనాగేశ్వరి(20)కి తన మేనమామ కుమారుడితో పక్క గ్రామం ఇండ్ల చెరువులో ఆదివారం ఉదయం 8 గంటలకు వివాహం జరగాల్సి ఉంది. అయితే పెళ్లికుమార్తె శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి కనిపించకుండా పోయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన వలంటీరు జక్కుల గోపి (22) కూడా మాయమయ్యాడు. వారిద్దరి మధ్య రెండేళ్ల నుంచి ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వారిద్దరు కనిపించకపోవడంతో అందరూ వెతుకులాడారు. అయితే ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు గ్రామ శివారులో గొర్రెలదొడ్డి సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో విగతజీవులుగా పడి ఉన్న వారిద్దరిని గొర్రెలకాపరులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు వెంకటనాగేశ్వరి, గోపీలను గుర్తించారు. కుమార్తె ఆత్మహత్య చేసుకొందని తెలిసి ఆమె తల్లిదండ్రులు నారు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బలక్ష్మీ, వారి బంధువులు విషాదంలో మునిగిపోయారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తెను పెళ్లికూతురిని చేయాల్సిన సమయంలో ఇలా జరగడంతో వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. పెళ్లి కోసం వచ్చిన బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. నాగేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. అలాగే వలంటీరు గోపి ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు రమణయ్య, నాగమణి కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. గోపీకి ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. ఇంట్లో ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వరనాయక్ పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు.

వివాహేతర సంబంధానికి ఇద్దరు బలి

వివాహేతర సంబంధం ఇద్దరు వ్యక్తులను బలి తీసుకొంది. ఈ ఘటనకు సంబంధించి మార్కాపురం రూరల్ ఎస్‌ఐ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి సత్యనారాయణరెడ్డి(32) కొంత కాలం వలంటీర్‌గా పనిచేశాడు. అనంతరం ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొద్దిరోజులుగా ఆమె కనిపించకపోవడంతో ఈ నెల 17న తన భార్య కనిపించడం లేదని, ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారిస్తున్న నేపథ్యంలో మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలోని పొలాలలో వివాహిత, సత్యనారాయణరెడ్డిలు పురుగుల మందు తాగి మృతి చెందారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్, పెద్దారవీడు ఎస్‌ఐలు వెంకటేశ్వరనాయక్, వెంకట సైదులు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఘటనపై మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

రేపు ఎమ్మెల్యే ఏలూరి నామినేషన్

భారీగా తరలిరావాలని శ్రేణులకు పిలుపు

పర్చూరు, ఏప్రిల్ 20 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారని శనివారం ఏలూరి క్యాంప్ కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా మార్టూరు, గన్నవరం, రోడ్డులోని వినాయక స్వామి ఆలయంలో ఏలూరి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం దండుదోవ మీదుగా ఎనమదుల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అక్కడి నుంచి యద్దనపూడి మీదుగా జాగర్లమూడిలో మహంకాళీ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తారన్నారు. అనంతరం పెద్దివారిపాలెం ఆంజనేయస్వామి విగ్రహం, చర్చిలలో ప్రార్థనలు చేసి అక్కడి నుంచి కొల్లావారిపాలెం మీదుగా పర్చూరుకు చేరుకుంటారన్నారు. బొమ్మల సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. అనంతరం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీకి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు, ఏలూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

19 మంది వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 20 : మండలంలోని మార్టూరు గ్రామానికి చెందిన 13 మంది, రాజుపాలెంకు చెందిన 6గురు వలంటీర్లు శనివారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. దాంతో మండలంలో రాజీనామాలు చేసిన వలంటీర్ల సంఖ్య 181కి చేరింది. మండలంలో 368 మంది ఉండగా 181 మంది రాజీనామా చేశారు.

యువకుడి ఆత్మహత్య

బల్లికురవ, ఏప్రిల్ 20 : మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో శనివారం ఇప్పల సుబ్బారెడ్డి(35) యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుబ్బారెడ్డి భార్య ఇంట్లో లేని సమయంలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అప్పులు బా ధలు భరించలేకే ఆత్మహత్య చేసుకొని ఉంటారని అంటుండగా, కొందరు కు టుంబ కలహాలవల్లని కొందరు అంటున్నారు.



టంగుటూరు కేంద్రంలో కొనసాగుతున్న పొగాకు కొనుగోళ్లు

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ. 250

టంగుటూరు, ఏప్రిల్ 20 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.250 రైతులకు దక్కింది. కనిష్ఠ ధర రూ.220లకే పరిమితమై ఉంది. వేలం కేంద్రానికి తూర్పునాయుడుపాలెం గ్రామస్థులు 824 పొగాకు బేళ్లు అనుమతించారు. ఇందులో 737 బేళ్లు కొనుగోలు కాగా మిగిలిన 87 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఏకంగా 63 బేళ్లు ఎన్‌బీ అయ్యాయి. ఎన్‌ఏఎ-7 బేళ్లు, ఆర్‌ఆర్-2, సీఆర్-9బేళ్లు అయ్యాయి. కొనుగోళ్లలో 15 పొగాకు కంపెనీలు పాల్గొన్నాయి. కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.250 కాగా, కనిష్ఠ ధర రూ.220 లభించింది. సరాసరి ధర రూ.230.43 రైతులకు అభించింది. ధరలు ఆశాజనకంగానే ఉన్నా ఎన్‌బీ అవుతున్న పొగాకు బేళ్లను చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభంలో కొనుగోళ్లలో పాల్గొని కొద్ది రోజులుగా కొనుగోళ్లలో మందగించిన కంపెనీలు సైతం నేటికీ ముందుకు రావడంతో ధరల పెరుగుదల కనిపిస్తుందని టుబాకో బోర్డు అధికారులు భావిస్తున్నారు. వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఏ శ్రీనివాసరావు నేతృత్వంలో వేలం కొనసాగింది.

మూడోరోజు నాలుగు నామినేషన్లు దాఖలు

కొండపి, ఏప్రిల్ 20: కొండపి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా మూడోరోజు శనివారంనాడు నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయి. కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలోని ఈఆర్వో ఎ. కుమార్‌కు వైసీపీ అభ్యర్థి, మంత్రి సురేష్ తరుపున సురేష్ కుమార్తె స్రిష్టి, జరుగుమల్లి మండల పార్టీ అధ్యక్షుడు బి. మనోహర్, వైసీపీ బీసీసెల్ నాయకుడు బొట్ల రామారావు, చతుకుపాడు గ్రామ వైసీపీ నాయకుడు కొర్రకూటి వెంకటేశ్వర్లు, ప్రతిపాదికుడు కసుకుర్తి పున్నారావు పాల్గొని ఒక సెట్ నామినేషన్‌ను అందజేశారు. అదేవిధంగా పొన్నలూరు మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన మామిడి మాల్యాద్రి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా తరుపున నెల్లూరు జిల్లా కందుకూరు మండలం కొండికందుకూరు గ్రామానికి చెందిన మెండా బాలకోటయ్య నామినేషన్ వేశారు. బహుజన సమాజ్‌పార్టీ తరుపున గత అసెంబ్లీ ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో పోటీచేసిన కేవీపీఎస్ ప్రసాద్ భార్య రావినూతల మాత్రిక నామినేషన్ వేశారు.

ఎన్నికల ప్రక్రియపై నిఘానేత్రం



నామినేషన్‌లో మంత్రి సురేష్ భార్య పాల్గొనడంపై సీ-ఈసీకి ఫిర్యాదు

కొండపి, ఏప్రిల్ 20 : కొండపి తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి సురేష్ నామినేషన్ కార్యక్రమంలో ఆయన భార్య(ప్రభుత్వ ఉద్యోగి) పాల్గొనడంపై సీఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. శుక్రవారం మధ్యాహ్నం 12.25 గంటలకు దాఖలు చేసిన నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మంత్రి భార్య విజయలక్ష్మి పాల్గొని ఆర్వో కార్యాలయంలోకి ప్రవేశించారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని సీఈసీకి తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరాయుడు శనివారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల అధికారికి, జిల్లా ఎన్నికల అధికారి, కొండపి నియోజకవర్గ ఈఆర్వోకి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతోపాటు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని జత చేశారు.

సీసీ ఫుటేజ్ ఫీడ్ కావాలని వినతి

నామినేషన్లకు సంబంధించి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణ, ఈఆర్వో గది లోపల సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్ ఫీడ్ కావాలని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వసంతరాయుడు శనివారం ఈఆర్వో ఎ. కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు వినతిపత్రాన్ని పంపుతామని, ఆయన ఆదేశాల మేరకు సీసీ ఫుటేజ్ అందజేస్తామని ఆర్వో ఈసందర్భంగా తెలిపారని వసంతరాయుడు వివరించారు.

జిల్లాకు 25 కెమెరాల కేటాయింపు

అవి బిగించిన వాహనాలు జిల్లాలో సంచారం

ప్రధాన పార్టీల అభ్యర్థుల వెన్నంటే ఒకటి నిరంతరం పహారా

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20 : జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం దృష్టిసారించింది. అభ్యర్థుల ప్రచార సరళితో పాటు కోడ్ ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు చిత్రీకరించేందుకు నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అందుకోసం ఎన్నికల సంఘం జిల్లాకు 25 కెమెరాలను కేటాయించగా జిల్లా ఎన్నికల అధికారైన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల పైభాగంలో ఈ కెమెరాలను అమర్చారు. జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఈ వాహనాలతో నిఘా పెంచనున్నారు. అభ్యర్థుల ప్రచారాలతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రలోభాలు చేయడం వంటివి ఆ వాహనాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు వీడియో తీయనున్నాయి. ఈ వీడియోను ఎన్నికల సంఘానికి అనుసంధానం చేసినట్లు సమాచారం. ఒక్కొక్క నియోజకవర్గానికి మూడు వాహనాలను కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఒక వాహనం నిరంతరం అన్ని ప్రాంతాలను పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేసినట్లు సమాచారం. అందుకు సంబంధించి శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆ వాహనాలకు నిఘా కెమెరాలను అమర్చారు. ఆ వాహనాలు అన్ని నియోజకవర్గాలకు పంపడంతో పాటు అందుకోసం ప్రత్యేకంగా ఉద్యోగులను కూడా నియమించినట్లు సమాచారం. ఆ కెమెరా ద్వారా ఎప్పటికప్పుడు వీడియోలను అనుసంధానం చేసినట్లు సమాచారం.



నిఘా వాహనాలకు కెమెరా బిగింపు

కొండపి ఓటరు తీర్పు సపరేట్..!

తొలుత కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ

టీడీపీ ఆవిర్భావంతో మారిన సమీకరణాలు

గత రెండు ఎన్నికల్లోనూ సైకిల్‌కు పట్టం

కొండపి, ఏప్రిల్ 20 : కొండపి నియోజకవర్గ ఓటరు ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఎన్నికల్లోనూ విభిన్న తీర్పునిచ్చారు. ఉద్దండులైన నాయకులు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఓసీ జనరల్ కేటగిరీలో ఉండగా పునర్విభజనలో భాగంగా 2009లో ఎస్సీలకు రిజర్వు అయింది. కొండపి అసెంబ్లీ నియోజకవర్గం 1955లో ఏర్పడింది. అప్పట్లో అసెంబ్లీకి ఇద్దరు ప్రాతినిథ్యం వహించేవారు. ప్రారంభంలో నియోజకవర్గం అన్‌రిజర్వుడు కేటగిరీలో ఉంది. పూర్వపు నెల్లూరు జిల్లాలోని కొంత, ఒంగోలు జిల్లాలోని కొంత ప్రాంతాన్ని కలిపి నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో కనిగిరి ప్రాంతమైన అలవలపాడు ఫిర్కా కొండపి నియోజకవర్గంలో ఉండేది. 1978 తర్వాత అలవలపాడు ఫిర్కాను తొలగించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా కొండపి అసెంబ్లీ పరిధిలోకి ఐదు మండలాలతోపాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో ఉన్న టంగుటూరు మండలాన్ని కలిపారు. దీంతో కొండపి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కేటగిరీలోకి మారింది.

గతంలో ఇతర మండలాల్లోని గ్రామాలు కూడా..


కొండపి నియోజకవర్గంలో 2009కి పూర్వం కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, మర్రిపూడి, సింగరాయకొండ మండలాలతోపాటు పొదిలి మండలంలోని తలమళ్ల, ఏలూరు పంచాయతీలోని సల్లూరు, ఉప్పలపాడు పంచాయతీలోని గోగినేనివారిపాలెం గ్రామాలు ఉండేవి. వలేటివారిపాలెం మండలంలోని కూనిపాలెం, సమీరపాలెం, కందుకూరు మండలంలోని జి.మేకపాడు, పలుకూరు గ్రామాలు కూడా కొండపి నియోజకవర్గంలో కొనసాగాయి. మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం పంచాయతీలోని ఎస్‌టీ రాజుపాలెం, కెల్లంపల్లి పంచాయతీలోని అగ్రహారం దర్శి నియోజకవర్గంలో ఉండేవి. అయితే 2009 తర్వాత పొదిలి, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లోని గ్రామాలను పూర్తిగా కొండపి నియోజవర్గం నుంచి తొలగించారు. పునర్విభజనలో పూర్తి మండలాలన్నీ ఒకే నియోజకవర్గంలో ఉండేలా నిర్ణయం జరిగింది. అప్పటి నుంచి కొండపి నియోజకవర్గంలో ఉన్న ఇతర మండలాల గ్రామ పంచాయతీలు తొలగిపోయాయి.

ఐదుసార్లు టీడీపీ గెలుపు

కొండపి నియోజకవర్గంలో 1955 నుంచి 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సార్లు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఐదు సార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఒకసారి సీపీఐ అభ్యర్థి విజయం సాధించారు.

కొండపి నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులు (జనరల్)

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1955	నలమోతు చెంచురామానాయుడు	కాంగ్రెస్	జీ వెంకటసుబ్బయ్య	సీపీఐ	4.407
1962	చాగంటి రోశప్ప నాయుడు	కాంగ్రెస్	రావి చెంచయ్య	సీపీఐ	7,687
1967	చాగంటి రోశప్ప నాయుడు	కాంగ్రెస్	గుజ్జుల యల్లమందారెడ్డి	సీపీఐ	1,248
1972	దివి శంకరయ్య	సీపీఐ	దివి కొండయ్యచౌదరి	స్వతంత్ర	2,30
1978	గుండపనేని పట్టాభి	కాంగ్రెస్	రోశప్పనాయుడు	జనతా	18,291
1983	మోరబోయిన మాలకొండయ్య	టీడీపీ	గుండపనేని పట్టాభి	కాంగ్రెస్‌ఐ	3,476
1985	గుండపనేని అచ్యుత్‌కుమార్	కాంగ్రెస్‌ఐ	ఎం మాలకొండయ్య	టీడీపీ	1,271
1989	గుండపనేని అచ్యుత్‌కుమార్	కాంగ్రెస్‌ఐ	దివి శంకరయ్య	సీపీఐ	4,327
1994	దామచర్ల ఆంజనేయులు	టీడీపీ	అచ్యుత్‌కుమార్	కాంగ్రెస్‌ఐ	20,955
1999	దామచర్ల ఆంజనేయులు	టీడీపీ	పోతుల రామారావు	కాంగ్రెస్‌ఐ	10,952
2004	పోతుల రామారావు	కాంగ్రెస్‌ఐ	దామచర్ల ఆంజనేయులు	టీడీపీ	8,873
	ఎస్సీ రిజర్వుడుగా మార్పు				
2009	గుర్రాల వెంకటశేషు	కాంగ్రెస్‌ఐ	శ్రీబాలవీరాంజనేయస్వామి	టీడీపీ	5,164
2014	డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి	టీడీపీ	జూపూడి ప్రభాకరరావు	వైసీపీ	5,449
2019	డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి	టీడీపీ	మాదాశి వెంకయ్య	వైసీపీ	1,024



మొత్తం ఓటర్లు

కొండపి నియోజకవర్గంలో ప్రస్తుతం 2,35,950 మంది ఓటర్లు ఉన్నారు. 283 పోలింగ్ కేంద్రాలున్నాయి. కాగా నియోజకవర్గంలో మొత్తం 43 కులాలకు చెందిన ప్రజలు న్నారు. ఓసీలైన కమ్మ, రెడ్డి, బలిజ, వైశ్య, ముస్లిం, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు చెందిన ఓటర్లు 95,362 మంది, ఎస్సీలైన మాల, మాదిగ ఓటర్లు 65,916మంది ఉన్నారు. బీసీ కులాలైన యాదవ, రజక, వడ్డెర, దూదేకుల, కుమ్మరి, పల్లెకారు, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, గౌడ, పట్టపు, ముత్తరాశి కులాలతోపాటు ఇతర బీసీ కులాలకు చెందిన 64,703 మంది ఓటర్లు ఉన్నారు. ఎస్టీ కులాలైన యానాది, ఎరుకల, పూసలు, నక్కల, చెంచులుకు చెందిన 8,654 మంది ఓటర్లు ఉన్నారు.

వ్యవసాయం ప్రధానం

నియోజకవర్గంలో వ్యవసాయం ప్రధానంగా ప్రజలు జీవిస్తున్నారు. పొగాకు, కంది, శనగ, మిర్చి, వరితోపాటు పండ్లతోటలు పెంపకం రైతులు చేపడుతున్నారు. టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లో మత్స్య సంపద అపారంగా సముద్రతీరం ఉండటంతో సమృద్ధిగా ఉంది. నియోజకవర్గంలో పాలేరు, మున్నేరు, ముసి నదులతోపాటు అట్లవాగు ఇతర ఏరులు ఉన్నాయి.

రాజకీయ సిత్ర విసిత్రాలు

ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్ తొలగింపు

వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో చర్యలు

తాళ్లూరు, ఏప్రిల్ 20 : వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్‌ను విధుల నుంచి తొలగించారు. రెండురోజుల క్రితం జరిగిన వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్‌లో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ గంగవరపు శివారెడ్డిని సస్పెండ్ చేశారు. అలాగే, వైసీపీ ర్యాలీలో పాల్గొన్న వలంటీర్ కె.రాజారెడ్డిని విధుల నుంచి తొలగించారు. ఈమేరకు ఆయా శాఖలకు చెందిన అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా విధులు నిర్వహణకు సంబంధించి శుక్ర, శనివారాల్లో ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం విచారణ చేయించి నిజమని తేలడంతో వారిని సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

అంతులేని అభిమానానికి అభినందనలు

-బీఎన్ గెలిచే వరకూ చెప్పులేసుకోనని శపథం

-ఏలూరివారిపాలెం వాసికి విజయ్‌కుమార్ అభినందన



బక్కా ఉదయ్‌కిరణ్‌ను అభినందిస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్ 20 : అసలే ఠారెత్తించే ఎండలు.. బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితులున్నాయి. చెప్పులు లేకుండా అడుగు వేస్తే అరికాళ్లు బొబ్బలు ఎక్కడం ఖాయం. అయితే ఇవన్ని తన అభిమాన నాయకునిపై ఉన్న వెల్లువెత్తిన అభిమానానికి అడ్డురాలేదు. తమ అభిమాన నాయకుడు బీఎన్ విజయ్‌కుమార్ రానున్న ఎన్నికల్లో గెలిచే వరకూ చెప్పులేసుకోకుండా తిరుగుతానని ఏలూరివారిపాలెం క్రిస్టియన్‌పాలేనికి చెందిన బక్కా ఉదయ్‌కిరణ్ మొక్కుకున్నారు. ఆ మేరకు చెప్పులు లేకుండానే ఎర్రటి ఎండల్లో బీఎన్ గెలుపునకు ప్రచారం సైతం నిర్వహిస్తుండటాన్ని తెలుసుకున్న విజయ్‌కుమార్ శనివారం తన గృహానికి ఉదయ్‌కిరణ్‌ను పిలిపించుకొని మరి అభినందనలు తెలిపారు. ఆరోగ్యం గురించి వాకబు చేసి హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ, తనపై ఉన్న ప్రేమాభిమానాలకు చలించిపోయారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి రాఘవరావు, గోగినేని రాజా, గోనుగుంట రత్తయ్య, తదితరులు ఉదయ్‌కిరణ్‌ను అభినందించారు.

ఆరుగురు వలంటీర్లు రాజీనామా

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని విశ్వాసం



ఎంపీడీవోకి రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

తర్లుపాడు, ఏప్రిల్ 20 : మండలంలోని తుమ్మలచెరువు గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు రాజీనామా పత్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీవోకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే వాలంటీర్లకు రూ.10వేలు జీతం ఇస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. దీంతో ఆయనకు మద్దతు తెలిపేందుకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. అనేక మంది వలంటీర్లు టీడీపీకి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గుర్తుండేలా దామచర్ల ప్రచారం



ఎన్నికల సీజన్.. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార కార్యక్రమాన్ని కూడా కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. పాత పద్ధతులకు భిన్నంగా పూటకో రీతిలో.. రోజుకో తీరులో సాగిస్తున్నారు. కాకపోతే కాస్త నవ్యతను జోడిస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఒంగోలు నగరంలో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఆ పార్టీ ఎన్నికల గుర్తు అయిన సైకిల్‌ను తొక్కుతూ సైకిల్‌కు ఓటు వేయాలని ఆ గుర్తును చూపిస్తూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. శనివారం నగరంలోని 50వ డివిజన్ జయప్రకాష్‌కాలనీలో దామచర్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే నగరంలో ప్రధాన అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నాయకులు చింతపల్లి రాంబాబు, సోమిశెట్టి శ్రీను, నిడమనూరి హనుమంతరావు, తుపాకుల శ్రీను, షేక్ షబీర్, యోగయ్యయాదవ్, కొఠారి నాగేశ్వరరావు, కమ్మ వెంకటేశ్వర్లు, షేక్ నాజర్‌వలి, ఏనుగుంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక దారావారితోటకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు సామి వెంకటసుబ్బారావు దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరారు.

-ఒంగోలు కార్పొరేషన్

నిమ్జ్‌పై వైసీపీ చావుదెబ్బ

పామూరులో ప్రకాశించని కారిడార్

గత ప్రభుత్వాలు మంజూరు చేసినా పట్టించుకోని సీఎం జగన్

ఎన్నికలు సమీపిస్తుండటంతో హడావుడి చేస్తున్నారంటూ ఆరోపిస్తున్న ప్రజలు



భూములను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న పరిశ్రమలశాఖ కార్యదర్శి (ఫైల్)

పామూరు, ఏప్రిల్ 20 : గత ప్రభుత్వాలు అందించిన పారిశ్రామికీకరణ ఒరవడిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. పరిశ్రమలు.. ఉపాధి మాకెందుకు అన్నట్లు వ్యవహరించింది. ఫలితంగా పామూరు మండలంలో పారిశ్రామిక అభివృద్ధి పూర్తిగా చతికిలపడింది. వివరాల్లోకెళ్తే... పామూరు ప్రాంతంలో నిమ్జ్ పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం అప్పటి కాంగ్రెస్ శాసనసభ్యులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేసిన కృషి ఫలితంగా మండలంలో సుమారు 12 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పదేళ్ల క్రితం సేకరించారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రూ.45 వేల కోట్లతో పారిశ్రామిక వాడ నిర్మించాలని భావించింది. దానికి అనుగుణం గా చర్యలు తీసుకుంది. సేకరించిన నిమ్జ్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం విశాలమైన రోడ్లు, డ్రైనేజి వసతి నిర్మించారు. నీళ్ల అవసరాల కోసం చేతి పంపులతో పాటు సంప్‌లు నిర్మించేందుకు అధికారులు తగు ప్రణాళికలు సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా నిమ్జ్ విషయాన్ని విస్మరించింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటీవల పరిశ్రమలశాఖకు సంబంధించిన అధికారులు జిల్లా కలెక్టర్‌తో కలిసి నిమ్జ్ భూములను పరిశీలన చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే తగిన నీటివసతి కావాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు నీటిని మోపాడు రిజర్వాయర్‌కు కెనాల్ ద్వారా అనుసంధానం చేయటమే ఏకైక మార్గం అని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు.

ఇటీవల నిమ్జ్ భూముల్లో అధికారుల పర్యటనపై విమర్శలు

నిమ్జ్ మంజూరైన రెండేళ్లల్లోనే పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పటి కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పట్టా భూముల రైతులను ఒప్పించి నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారు. ఇటీవలకాలంలో రెం డుమార్లు పరిశ్రమల శాఖకు సంబంధించిన ము ఖ్య కార్యదర్శి యువరాజ్, పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్‌తో పాటు ఇతర అధికారులు పర్యటనలు చేసి నిమ్జ్ భూములను పరిశీలించారు. ఐదేళ్ల కాలాన్ని పూర్తిగా వదిలేసి ఇప్పుడు మళ్లీ అధికారుల చేత ఆకస్మిక పర్యటనలు చేయించడాన్ని చూసిన ప్రజలు ఎన్నికల స్టంట్‌గా భావిస్తున్నారు. విభజన హామీల్లో భాగంగా కేంద్రప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

నిమ్జ్ కోసం పామూరు మండలంలో బోడవాడ, మాలకొండాపురం, సిద్ధవరం అయ్యన్నకోట, రేణిమడుగు, పీసీపల్లి మండలంలో లక్ష్మక్కపల్లి, పెద ఇర్లపాడు, అడవిపల్లి, గ్రామాల్లో ప్రభుత్వ భూమి 3,700, అసైన్డ్ భూములు 2,600, పట్టా భూములు 5,800 ఎకరాలు మొత్తం 12 వేల ఎకరాలు సేకరించాలి. ఇప్పటి వర కు 1800 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూములను సేకరించారు. పట్టా భూములకు సంబంధించి నష్టపరిహారం మంజూరు చేయ్యా ల్సి ఉంది. నిమ్జ్ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అధికారులు తెలిపారు.

నిమ్జ్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 లక్షల మందికి ఉపాధి



మాలకొండాపురం వద్ద నిమ్జ్ కు సంబంధించిన బోర్డు

స్వర్గ సోపానం చెన్నకేశవ క్షేత్రం

● ఆకట్టుకునే కళాకృతులు ● విలక్షణం స్వామివారి దర్శనం ● ఆలయంలో అద్భుత వాస్తు శిల్పకళలు



మార్కాపురంలో సిద్ధమైన విమాన గోపురాలు

మార్కాపురం(వన్‌టౌన్), ఏప్రిల్ 20: మార్కాపురం పట్టణంలో వెలసిన శ్రీ లక్ష్మీచెన్నకేశవుడు నాలుగు యుగాల దేవుడిగా కామిత వరదాతగా ప్రసిద్ధిగాంచాడు. 'కృతయుగే గజారన్నే త్రేతాయం మాదవీపురి ద్వాపరే స్వర్గసోపానం కలౌ మారికాపురి' అని ఈ క్షేత్రం ప్రసిద్ధం. కలియుగంలో మారికా అనే యాదవ స్త్రీ పుట్టలో ఉన్న కేశవునికి పాలధారలతో అభిషేకించింది. ఆమె పేరుమీదే మారికాపురం వెలసి మార్కాపురంగా పిలవబడుతోంది.

మార్కాపురంలోని చెన్నకేశవ స్వామి ఆలయం విజయనగర రాజుల చరిత్రకు సజీవ సాక్ష్యం. ఇక్కడి ఆలయంలో శివునికి, విష్ణువుకు తేడా లేదని 'శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగం శివః' అనే వేదోక్తి ప్రకారం మార్కాపురం చెన్నకేశవ స్వామి మూల విరాట్ పానవట్టంలో ఉంటుంది. విష్ణువుకు వాహనమైన గరుక్మంతుడు స్వామి నిలుచొని ఉన్న పానవట్టాన్ని మోస్తుంటాడు. చెన్నయ్య కుడి చేతిలో నాగాభరణం ఉంటుంది. నాగులకు గరుడ జాతికి వైరం. స్వామి వద్ద ఇద్దరు ఉండటం విశేషం.

అబ్బురం రాతి మండపం

ఆస్థాన మండపం చుట్టూ ఒకే రాతితో చుంచు నిర్మాణం వంపులు వంపులుగా చెక్కబడి అందంగా కనిపిస్తుంది. చుంచుకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. మార్కాపురం చుంచు, మంగళగిరి గాలిగోపురం, ఎగువ పాలెం రచ్చబండ ప్రసిద్ధి గాంచాయి. 9 అంతస్తులతో గవాక్షాలతో అతి సుందర గాలిగోపురం చెన్నయ్య ప్రత్యేకం. గాలి గోపురాన్ని 1929లో లింగరాజు అనే భక్తుడు భక్తుల సహకారంతో నిర్మించాడు. అనంతరం రామనం యోగేశ్వరరావు గ్రామస్థ సహకారంతో ఏడు అంతస్తులు పూర్తి చేశాడు. 1936లో శ్రీరంగం శ్రీవాస మమలై జీయర్ స్వామి గోపుర కలశ స్థాపన మహా సంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహించారు. గాలి గోపురం శిథిలం కావటంతో రూ.70 లక్షలతో జీర్ణోధరణ పనులు నిర్వహించారు. 2013లో త్రిదండి చిన జీయర్ స్వామి జీర్ణోధరణ జరిగిన గాలి గోపురానికి మహాసంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహించారు.

వాస్తు శిల్ప వైభవం

చెన్నుని ఆలయ మండపంలో అద్భుత శిల్ప సంపద ఉంది. అన్నదమ్ముల స్తంభాలు ఆశ్చర్య చకితులను చేస్తాయి. అన్నదమ్ములైన ఇద్దరు శిల్పులు మధ్యలో తెర కట్టి ఒకరినొకరు చూసుకోకుండా చెక్కిన శిల్పా లు అచ్చు ఒకేలా ఉంటాయి. భవిష్యత్తులో ఆలయ మహాద్వార, మహా మండప నమూనాలతో ఉండాలని ఈ స్తంభాలు సూచిస్తాయి. మొత్తం 40 స్తంభాలు సకల ప్రాణి సమూహాలకు చిహ్నాలుగా ఉంటాయి. ఆలయంలో పదముగ్గురు ఆళ్వార్లు, వేణుగోపాల స్వామి, లక్ష్మీనరసింహస్వామి, గోదాదేవి, శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామి వార్ల అంతరాలయాలు ఉంటాయి. ఆలయ ఈశాన్య భాగంలో యజ్ఞశాల ఉంది. ఉత్సవమూర్తులు నిత్య నీరాజనాలు, పూజలు అందుకోవడం ఆలయంలో విశేషం. శ్రీదేవి భూదేవిలతో కలిసి చెన్నుడు భక్తులను అనుగ్రహిస్తాడు.

నూతన వెండి రథం

చెన్నకేశవ స్వామికి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ యక్కలి కాశీవిశ్వనాధం ఆధ్వర్యంలో దాతల సహకారంతో 550 కిలోల వెండిని సేకరించి రూ.3.50 కోట్లతో వెండి రథ నిర్మాణం చేయించారు. రథసప్తమి నాడు చెన్నకేశవునికి సప్తవాహనాలపై నగరోత్సవం నిర్వహిస్తున్నారు.

బంగారు, వెండి బల్లులు

ఆలయంలో బంగారు, వెండి బల్లుల తాపడం చేయించి భక్తులకు స్పర్శ దర్శనం కల్పించారు. యాగశాలలో సుదర్శన చక్రం ప్రతిష్ఠించారు. ఆలయంలో ఇటీవల లక్షల రూపాయల ఖర్చుతో అభివృద్ధి పనులు చేపట్టారు. శాండ్ బ్లాస్టింగ్ విధానంతో శిల్పాలకు సహజ కళ రప్పించారు. గర్భాలయం మధ్య రంగ మండపం, అమ్మవారి ఆలయంలో గ్రానైట్ వేయించి ఆళ్వార్లు వేణుగోపాల స్వామి, నరసింహస్వామి, రామానుజస్వామి ఉపాలయాలకు నూతన గోపురాలు నిర్మించారు. గుడి చుట్టు సాలాహారం నిర్మించారు. నూతన రథసప్తమి వాహనశాల, సూర్య రథ నిర్మాణం చేయించారు.

స్వర్గ సోపానం

చెన్నకేశవస్వామి ఆలయం అనేక విశేషాలకు ఆలవాలం. త్రేతాయుగంలో గౌతమ మహర్షి ఇక్కడ స్వామి కోసం తపస్సు చేశారు. ద్వారప యుగంలో రాక్షసుల బాధలు తట్టుకోలేని సురులు చెన్నకేశవుని పూజించారని అందుకే దీనికి స్వర్గ సోపానం అని పేరు వచ్చిందని పెద్దల చెప్తారు.

నూతన ప్రాకార గోపుర నిర్మాణాలు

ఆలయంలో సుమారు రూ.3 కోట్ల సీజీఎఫ్ నిధులతో ప్రాకార గోపురాలు పని పూర్తి కావొస్తోంది. ఇటీవల గోపుర కలశ కుంభాభిషేకం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. మరో రూ.3కోట్లతో దాతల సహకారంతో పడమటి గోపురం నిర్మించారు. రూ.కోటితో ఆండాళ్, రంగనాయక స్వామి ఆలయాలు, జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. మరో రూ.1.50కోట్లతో సీజీఎఫ్ నిధుల కింద ఆలయ అభివృద్ధికి మంజూరయ్యాయి. దాతల సహకారంతో ఆలయంలో వివిధ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయానికి మహారాజా గోపురం తలమానికంగా ఉంది.



క్షేత్రానికే తలమానికంగా ఉన్న చుంచు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. 21న అంకురార్పణ, ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, రాత్రి రాయభారం, ఎదుర్కోల, సూర్యవాహనం నిర్వహించనున్నారు. 22న తెల్లవారితే మంగళవారం కళ్యాణం నిర్వహించనున్నారు. 23న చంద్రవాహనం, 24న సింహవాహనం, 25న శేషవాహనం, 26న వ్యాళి వాహనం, 27న పొన్నవాహనం, 28న హనుమంత వాహనం, 29న గరుడ వాహనం, 30న గజవాహనం, మే 1న రథోత్సవం, 2న అశ్వవాహనం, 3న హంస వాహనం, 4, 5, 6, 7న వసంతోత్సవం, 8న ఊంజల్ సేవ, 9న 16 రోజుల పండుగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రభలు పలు కళాకార్యక్రమాలు, ఎడ్లబండ్ల లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.





దేవేర్లతో చెన్నకేశవుడు, అన్నదమ్ముల స్తంభాలు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పొదిలి, ఏప్రిల్ 20 : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాతమైన వాతావరణంలో నిర్వ హించేందుకు ప్రజలు సహకరించయాలని సీఐ మల్లికార్జునరావు అన్నా రు. శనివారం మండలం లో ఉప్పలపాడు, గోగినేనివారిపాలెం, కుంచేపల్లి, పోతవరంతో పాటు పట్టణంలో పోలీస్ కవాత్తు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మండలంలో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల వేళ ఎలాంటి హింసకు తావులేకుండా, స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. గ్రామాల్లో, పోలింగ్ స్టేషన్ల వద్ద ఏ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరైనా ఓటర్లను ప్రలోభపెట్టినా, భయాందోళనలకు గురిచేసినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి ఘటనలు జరిగితే 100, 112కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్సై కోటయ్య సూచించారు.

వలంటీర్ల రాజీనామా

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 20: ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో వైసీపీ నాయకులు వలంటీర్లతో రాజీనామాలు చేయిస్తున్నారు. దీంతో ఎన్నికల వేళ వలంటీర్లు నేడు పాలకపక్ష సేవలో ఉండనున్నారు. ఈ విధంగా మార్కాపురం పట్టణంలోని 8, 9, 12 సచివాలయాల పరిధిలోని వడ్డేరబజార్‌లో 20 మంది వలంటీర్లు శనివారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కు రాజీనామా పత్రాలు అందజేశారు. వలంటీర్లను స్థానిక రాజకీయ నాయకులు వివిధ రకాలుగా ప్రలోభాలు పెట్టి రాజీనామాలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. రాజీనామా పత్రాల్లో వైసీపీ కోసం, జగన్ గెలుపు కోసం రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు.

మాగుంటకు తర్లుపాడులో ఘన స్వాగతం

● సీతానాగులవరం నుంచి బైకు ర్యాలీ



టీడీపీలో చేరిన కేడర్

తర్లుపాడు, ఏప్రిల్ 20: ఒంగోలు కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి తర్లుపాడులో శనివారం తెలుగు యువత కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సీతానాగులవరం ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి బైకు ర్యాలీ నిర్వహించారు. తర్లుపాడు పురవీధుల్లో కూడా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందన్నారు. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో దుర్మార్గుడి పాలన పోవాలంటే ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి నాలుగు సార్లు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో వైసీపీ పాలన అంతమవుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే సీఎం జగన్ జాతికి అంకితం చేశామని చెప్పటం హాస్యాస్పదమన్నారు. మాగుంట కుటుంబాన్ని ఆదరించాలని కోరారు. చంద్రబాబు మార్కాపురాన్ని జిల్లా చేస్తారని హామీ ఇచ్చారన్నారు. అనంతరం కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మాగుంట కుటుంబం అంటేనే సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు అన్నారు. వైసీపీ దుర్మార్గ పాలనను అంతమొందించేందుకు కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మార్కాపురం ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కంచెర్ల కాశయ్య, మాజీ ఎంపీటీసీ పి.గోపినాథ్ చౌదరి, మండల యూత్ అధ్యక్షులు మేకల వెంకట్, గౌతుకట్ల సుబ్బయ్య పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 90 కుటుంబాలు చేరిక

మండలంలోని తుమ్మలచెరువు, కేతగుడిపి, బుడ్డపల్లి, నాయుడుపల్లి, నాగెళ్లముడుపు తదితర గ్రామాల నుంచి ఇద్దరు మాజీ సర్పంచ్‌లతో సహా 90 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి ఒంగోలు పార్లమెంట్ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, మార్కాపురం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బుడ్డపల్లి మాజీ సర్పంచ్ అంగిరేకుల అంకయ్య, జగన్నాథపురం మాజీ సర్పంచ్ మక్కెన బాలయ్య, బత్తుల అంకయ్య, బత్తుల వెంకటరత్నం, బాల వెంకటేశ్వర్లు, భీమనబోయిన శ్రీనివాసులు, నర్సింగ్ శీను, సేతుల శ్రీనివాసులు, పరికెల రంగయ్య, బొప్పరాజు శ్రీనివాసులు, పొదిలి రామయ్యలతో పాటు 80 కుటుంబాలు టీడీపీలో చేరారు. దీంతో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేడర్

టీడీపీలో జోరు - వైసీపీ బేజారు

పచ్చకండువా కప్పుకున్న సుగాలీలు



పార్టీలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 20 : నియోజకవర్గంలో అధికార వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదల నుంచే ఆ పార్టీ నుంచి వలసలు అధికమయ్యాయి. దీంతో వైసీపీ శ్రేణులు డీలాపడుతున్నాయి. ఐదేళ్ల జగన్ పాలనలో న్యాయం జరగక పోవడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు ఉంటున్నాయి.

గత సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఆపార్టీ ముఖ్య నాయకుల నుంచి సామాన్య కార్యకర్తల వరకు వైసీపీని వీడుతున్నారు. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో రోజు రోజుకు టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది తాజాగా శనివారం గిద్దలూరు మండలం ముండ్లపాడు పంచాయతీ పరిధి లోని బురుజుపల్లె తాండాకు చెందిన 14వ వార్డు సభ్యుడు మూడోకులం మౌనికా భాయితో సహ 60 సుగాలి కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మూడోకులం రామానాయక్, బాలానాయక్, ఇస్లావత్ కేశాలునాయక్, నారాయణనాయక్, ఇస్లావత్ వేంకటేశ్వరనాయక్, నాగేశ్వర చిన్ననాయక్, గోపాలనాయక్, భాస్కరనాయక్, బాలస్వామి నాయక్, చంద్రనాయక్, క్రిష్టనాయక్, భీమానాయక్, శేఖర్ నాయక్ ఉండగా మండలపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పట్టణంలోని వైసీపీ నాయకులు గుంటూరి డేవిడ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానిం చారు. డేవిడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ పందీటి రజనీబాబు ఉన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు



టీడీపీలో చేరిన కేడర్

కొనకనమిట్ల, ఏప్రిల్ 20 : వైసీపీలో నుండి టీడీపీలోకి ఇటీవల కాలంలో భారిగా వలసలు పెరిగాయి. మండలంలోని నాగంపల్లి గ్రామంలో శనివారం 150 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ముఖ్యంగా వైసీపీ పార్టీ చెందిన మండల మాజీ ఉపాధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి ఆధ్వర్యంలో వీరు పార్టీ వీడారు. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి వీరివురు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. . టీడీపీలో చేరిన వారిలో సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, వెలుగొండారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పగడాల వెలుగొండారెడ్డి, వెంకటరెడ్డి, తంగిరాల సుబ్బారెడ్డి, కీసరి వెంకటేశ్వరరెడ్డి, పెదవెలుగొండయ్య, మాలపాటి నారాయణరెడ్డి, కీసరి శ్రీనివాసరెడ్డి, పగడాల రమణారెడ్డి, దుగ్గెం వెంకగరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, చినకొండలు, వెంకటరెడ్డి, ఈదర నర్సిరెడ్డి, వెంకటరెడ్డి, కొక్కెర వెంకటేశ్వర్లు, బాలనాగయ్య, పాలకిట్టి రంగయ్య వెంకటేశ్వర్లు, కసిబిసి వెంకటరాజు., పెద్దిరాజు, పెదనాగులు, అశోక్, మలమంద సాయికుమార్, పొదిలి పిచ్చయ్య, కసిబిసి పెదేర్రయ్య, కొండి వెలుగొండయ్య, కొక్కెర వెంకటేశ్వర్లు, ముంగమూరి పెదతిరపతయ్య సంపతి నాగయ్య, మేకల బాలయ్య, మేకల వెలుగొండరాయుడు, తెల్లగడ్డపు వెంకటరాజు, సంపతి అచ్చయ్య, కొక్కెర వెంకటేశ్వర్లు, ఎస్‌కె కాశింవలి, కాశింషా, కాశీపీరా, యలమంద మస్తాన్, సుభానయ్య, షేక్ మస్తాన్, ఎస్‌కె జిందామధార్‌వలి, బందేసాహెబ్, మునెయ్య నేరెళ్ళ జమారావు, సాల్మాన్, బూదాల సామేల్, బూదాల మోషీన్ తదిరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : విజన్‌ఉన్న నాయకుడు నారాచంద్రబాబు నాయుడని చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రం కొనకనమిట్లలో శనివారం కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ పాలనలో బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడింది ఒక్క తెలుగుదేశం పార్టీ అనిచెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇరువురి గెలుపు వెలుగొండ ప్రాజెక్ట్, మార్కాపురం జిల్లా చేయడం మాలక్ష్యమన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబునాయుడి జన్మదినం



కేడర్‌కు కేకును తినిపిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 20 : రాష్ట్ర శ్రేయస్సుకోసం టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకో వాలని, టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆకాంక్షించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఐదుమండలాల టీడీపీ నాయకులు కలసి చంద్రబాబు నాయుడి జన్మదిన కేకును కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదు, మేకల వలరాజు, పి శ్రీనివాసరెడ్డి,టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, బీ.వీ.సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, వేగినాటి శ్రీను, గోళ్ల సుబ్బారావు, కొత్తమాసు సుబ్రమణ్యం, చీదెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : పెద్దదోర్నాలలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య ఆకాంక్షించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు జన్మిదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కత్తిరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో నాయకులు దొడ్డా శేషాద్రి, దేసు నాగేంద్రబాబు, షేక్ సమ్మద్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, కే శ్రీనివాసులు, ఇస్మాయిల్, షేక్ భాష, కె సుబ్బారెడ్డి, మంజూర్ భాష ,ఆర్ సుబ్బరత్నం, బట్టు సుధాకర్ పాల్గొన్నారు.

మార్కాపురం, ఏప్రిల్ 20 : మాజీముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు స్థానిక మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు కేక్ కట్ చేశారు.. కార్యక్రమంలో ఏఎంసీ మాజీఛైర్మన్ డీవీ.కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలీ, కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : కంభం టీడీపీ పార్టీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



కేకు కట్ చేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

పొదిలి : నగరపంచాయతీ పరిధిలోని కాటూరి వారిపాలెం గ్రామంలో జరిగిన వేడుకల్లో విఘ్నేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కాటూరి నారాయ ణస్వామి కుమారులు కాటూరి పెదబాబు, కాటూరి చినబాబు, టీడీపీ నాయకులు వెంకట్రావ్, నరేష్, మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : టీడీపీ అదినేత జన్మదినం సందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ ఏర్పాటు చేయగా టీడీపీ శ్రేణుల మధ్యలో అశోక్‌రెడ్డి కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో నష్టపోయిన ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, రాచర్ల మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుప్పా రంగనాయకులు, కౌన్సిలర్ చంద్రశేఖర్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు షాన్షావలి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, పెద్దభాషా, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

రెండు నామినేషన్లు దాఖలు

గిద్దలూరు, ఏప్రిల్ 20 : గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శనివారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గిద్దలూరు మండలం కొమ్మునూరు పంచాయతీలోని యగ్గెన్నపల్లి గ్రామానికి చెందిన కొప్పు నరసింహులు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మండలంలోని పొదలకొండపల్లి గ్రామానికి చెందిన బాలసాని మాల్యాద్రిరెడ్డి సైతం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. దాంతో ఇప్పటివరకు మొత్తం మూడు రోజులకు కలిపి ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ నాగజ్యోతి తెలిపారు.

రికార్డుల పరిశీలన

గిద్దలూరు, ఏప్రిల్ 20 : ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఐఆర్ఎస్ ఆఫీసర్ ఎస్.ఎస్.ప్రదీప్‌రావ్ శనివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థుల వ్యయ వివరాల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కోసం నియమించిన టీం అధికారులకు వ్యయ అంచనాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి పాల్గొన్నారు.

డ్రైనేజీలను ఆక్రమిస్తే చర్యలు

గిద్దలూరు, ఏప్రిల్ 20 : డ్రైనేజీ కాలువలను ఆక్రమించి దానిపై వస్తువులను ఉంచి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని బిల్డింగ్ టౌన్‌ప్లాన్ అధికారి రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొందరు వ్యాపారులు తమ దుకాణాల ముందు డ్రైనేజీ కాలువలను పూడ్చివేసో, బండలు వేసో వస్తువులను ఉంచి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పలు ప్రధాన వీధుల్లో ఆ మేరకు వ్యాపారులకు అవగాహన కల్పించడమే కాకుండా మార్కింగ్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. అతిక్రమించి కాలువలపై వస్తువులు ఉంచి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి టీడీపీ పెద్దపీట

● ముత్తుముల పుష్పలీల



ప్రచారం నిర్వహిస్తున్న ముత్తుముల పుష్పలీల

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 20 : ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి పుష్పలీల అన్నారు. శనివారం 11వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని బ్రిటన్‌రోడ్డు ప్రాంతంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, పాలుగుళ్ల శ్రీదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షులు షాన్షావలి, టీడీపీ నాయకులు పందిళ్ల శ్రీనివాసులు, శేఖర్, భాషా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంతో బలి

రెండు ప్రేమజంటలు ఆత్మహత్య

రేపు పెళ్లి ముహూర్తం.. నేడు అఘాయిత్యం

వధువు పెళ్లింట విషాదం..మృతుడు వలంటీర్

మరోచోట వివాహిత, అవివాహితుడు

నాలుగు కుటుంబాల్లో విషాదం

క్షణికావేశం నాలుగు కుటుంబాల్లో విషాదం నింపింది. తెలిసి తెలీక తీసుకున్న తొందరపాటు నిర్ణయో.., తమ వారందిరిలో చులకన అవుతామన్న భయమో వారిని ఆత్మహత్యలకు పురికొల్పింది. పచ్చని పెళ్లి పందిరిలో తమ బిడ్డ కళకళాడుతుంటే చూడాలనే సంతోషం ఒకరిది.., ముగ్గురు అక్కచెల్లెల నడుమ ఒక్కడే సోదరుడు సంతోషంగా ఉండాలనే ఆరాటం మరోకరిది. ఈ రెండు కుటుంబాల ఆశలను ఆ ప్రేమజంట అడియాశలు చేసింది. మరో ఘటనలో క్షణికావేశంలో చేసిన తప్పు పదిమందికి తెలిస్తే, పరువు పోతుందన్న భయం ప్రాణాలు తీసుకొనేలా చేసింది. దీంతో ఓ మహిళ చక్కని సంసారం చిన్నాభిన్నం కాగా, మరో యువకుడు కూడా అర్ధాంతరంగా తనువు చాలించాడు.



పుచ్చకాయలపల్లి ఘటనపై పోలీసుల విచారణ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 20: ప్రేమజంట పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం రాత్రి మార్కాపురం మండలంలోని పిచ్చిగుంట్లపల్లి గ్రామంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. పిచ్చిగుంట్లపల్లి గ్రామానికి చెందిన నారు వెంకటనాగేశ్వరి(20)కి తన మేనమామ కుమారుడితో పక్క గ్రామం ఇండ్ల చెరువులో ఆదివారం ఉదయం 8 గంటలకు వివాహం జరగాల్సి ఉంది. అయితే పెళ్లికుమార్తె శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి కనిపించకుండా పోయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన వలంటీరు జక్కుల గోపి (22) కూడా మాయమయ్యాడు. వారిద్దరి మధ్య రెండేళ్ల నుంచి ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వారిద్దరు కనిపించకపోవడంతో అందరూ వెతుకులాడారు. అయితే ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు గ్రామ శివారులో గొర్రెలదొడ్డి సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో విగతజీవులుగా పడి ఉన్న వారిద్దరిని గొర్రెలకాపరులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు వెంకటనాగేశ్వరి, గోపీలను గుర్తించారు. కుమార్తె ఆత్మహత్య చేసుకొందని తెలిసి ఆమె తల్లిదండ్రులు నారు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బలక్ష్మీ, వారి బంధువులు విషాదంలో మునిగిపోయారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తెను పెళ్లికూతురిని చేయాల్సిన సమయంలో ఇలా జరగడంతో వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. పెళ్లి కోసం వచ్చిన బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. నాగేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. అలాగే వలంటీరు గోపి ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు రమణయ్య, నాగమణి కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. గోపీకి ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. ఇంట్లో ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాలను స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు.

వివాహేతర సంబంధానికి ఇద్దరు బలి

వివాహేతర సంబంధం ఇద్దరు వ్యక్తులను బలి తీసుకొంది. ఈ ఘటనకు సంబంధించి మార్కాపురం రూరల్ ఎస్ఐ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి సత్యనారాయణరెడ్డి(32) కొంతకాలం వలంటీర్‌గా పనిచేశాడు. అనంతరం ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొద్దిరోజులుగా ఆమె కనిపించకపోవడంతో ఈ నెల 17న తన భార్య కనిపించడం లేదని, ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారిస్తున్న నేపథ్యంలో మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలోని పొలాలలో వివాహిత, సత్యనారాయణరెడ్డిలు పురుగుల మందు తాగి మృతి చెందారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్, పెద్దారవీడు ఎస్ఐలు వెంకటేశ్వరనాయక్, వెంకట సైదులు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఘటనపై మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

రేపు టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి నామినేషన్

దర్శి, ఏప్రిల్ 20: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోమవారం ఉదయం 11 గంటలకు ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈమేరకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని డాక్టర్ లక్ష్మి కోరారు. కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, జిల్లా కూటమి పార్టీల నాయకులు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.

దర్శి అసెంబ్లీకి మూడు నామినేషన్లు దాఖలు


కూటమి అభ్యర్థి లక్ష్మి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న టీడీపీ నాయకుడు వీరపనేని రంగ

దర్శి, ఏప్రిల్ 20: దర్శి అసెంబ్లీకి శనివారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి తరుపున టీడీపీ నాయకుడు వీరపనేని రంగ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముప్పరాజు రవీంద్ర, ముప్పరాజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బహుజన సమాజ్ పార్టీ తరుపున ఇత్తడి శివప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అంతకుముందు ఆయన కార్యకర్తలు, నాయకులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

'సూపర్ సిక్స్'తో అన్నివర్గాలకు ప్రయోజనాలు


టీడీపీ పథకాలపై ప్రచారం చేస్తున్న మాధవరావు

పామూరు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని ఆపార్టీ తూర్పుకోడిగుడ్లపాడు గ్రామ అధ్యక్షుడు దారపనేని మాధవరావు తెలిపారు. శనివారం గ్రామంలోని బీసీ కాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, మహిళాశక్తి సూపర్‌సిక్స్ పథకాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

మండుతున్న ఎండలు


పామూరు పట్టణంలో నిర్మానుష్యంగా రోడ్డు

పామూరు, ఏప్రిల్ 20: భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు, గత వారం రోజులనుంచి విపరీతమైన వడగాలులతో ప్రజలు విలవిల లాడుతున్నారు. ఏదైన ముఖ్యమైన అవసరాలు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. దాంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నా జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు వడగాలుల ప్రభావం కనిపిస్తున్నది. ఈప్రభావం మరో పది రోజులు కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అడుగంటిన 'మోపాడు'లో నీటిమట్టం

పామూరు, ఏప్రిల్ 20: మండలంలోని మోపాడు రిజర్వాయర్‌లో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతున్నది. ప్రస్తుతం నీటి మట్టం 7 అడుగులకు దిగజారింది. ఇంకా కొన్నిచోట్ల అక్కడక్కడ వరి సాగులో ఉంది. మోపాడు పరివాహక గ్రామాల్లో భూగర్భజలాలు అందుబాటులో ఉండాలంటే ఐదు అడుగుల నీటి మట్టాన్ని డెడ్ స్టోరేజీగా ఉంచాలని పలుగ్రామాల ప్రజలు కోరుతున్నారు. రాజకీయాల నేపథ్యంలో అనవసరంగా నీటిని వృథా చేశారని అధికారులపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఆయకట్టు గ్రామాల్లో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ జీవనోపాదిగా మారింది. ఉన్న నీటిని వృథాచేస్తే పశువులకు నీటి కోసం నానా కష్టాలు పడాల్సి వస్తుందని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి వృథా చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తులకు గంధం తాంబూలాలు పంపిణీ


గుర్రంపై దర్గాకు తెస్తున్న గంధం

పామూరు, ఏప్రిల్ 20: పామూరు మేజర్ పంచాయతి పరిధిలోని గోపాలపురం గ్రామంలో వెలసియున్న శ్రీ హజరత్ సయ్యద్ కరీముల్లా షా ఖాదిరీ(ఉరఫ్) కాలేషా పీర్ మస్తాన్‌వలి రహంతుల్లా అల్లాహీ దర్గా గంధమహోత్సవం 58వ (ఉరుసు) వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా శుక్రవారం రాత్రి గ్రామంలోని పాలపర్తి సత్యం కుమారుడు మస్తాన్ ఇంటివద్ద నుంచి గుర్రంపై గంధంను గ్రామోత్సవం నిర్వహించి తెల్లవారుజామున దర్గాకు చేరిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. శనివారం రాత్రి మిలాద్ శింగరా యకొండ వారిచే తహలీల్ ఫాతేహా నిర్వహించి భక్తులకు మొక్కుబడి గంధం తాంబులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దర్గా ప్రధాన ముతవల్లి పొదిలి షేక్ గౌస్‌బాషా, కస్మూర్ దర్గా ముజావర్లు సయ్యద్ కరీముల్లా, సల్మామస్తాన్, హనీఫ్, దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

80 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పామూరు, ఏప్రిల్ 20: స్థానిక మల్లికార్జునరెడ్డి మల్టీస్పెషాలిటి హాస్పిటల్‌లో యువ సముద్రం, నెట్జిజన్ రోబోటిక్స్ వ్యవస్థాపకులు పొలిమేర మాధవరెడ్డి సౌజన్యంతో మూడు రోజుల పాటు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు డాక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. సుమారు 80 మందకి పైగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. ఆదివారం కూడ ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పామూరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

13 మద్యం బాటిళ్ళు స్వాధీనం

పామూరు, ఏప్రిల్ 20: పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డు ప్రాంతంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో శనివారం తహసీల్దార్ షాకీర్‌పాష తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఓ వ్యక్తి అక్రమంగా కలిగిఉన్న 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

దర్శి, ఏప్రిల్ 20: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. శనివారం దర్శిలో వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు క్రయ, విక్రయాల్లో నిబంధనలు తుచ తప్పకుండా పాటించాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏడీఏ బాలాజీనాయక్, సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తా!

- కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 20: పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 15వ వార్డులో మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి శనివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీనాలీ చేసుకొని జీవించే తమను పట్టించుకునే వారు లేరని అక్కడి ప్రజలు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివిధాల ఆదుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపొంచాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో మాగుంట చరిత, బ్రహ్మం చౌదరి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, క్లష్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

దర్శి, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీలోకి వలసలు బారీగా కొనసాగుతున్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో దర్శి మండలంలోని చందలూరుకు చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో నుంచి టీడీపీలో చేరారు. అలాగే, కురిచేడు మండలం బోదనంపాడుకు చెందిన 16 కుటుంబాలు, దొనకొండ మండలంలోని తెల్లబాడు గ్రామానికి చెందిన 16 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కనకం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే విభిన్న ప్రతిభావంతులకు న్యాయం

దర్శి, ఏప్రిల్ 20: టీడీపీ హయాంలోనే విభిన్న ప్రతిభావంతులకు న్యాయం జరిగిందని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం దర్శిలో జరిగిన నియోజకవర్గ విభిన్న ప్రతిభావంతుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఎంతో ఇబ్బంది పడుతున్న విభిన్న ప్రతిభావంతులను ఆదుకోలేదన్నారు. టీడీపీ హయాంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి, అధిక నిధులు విడుదల చేసి వారి అభివృద్ధికి కృషి చేసినట్టు చెప్పారు.


విభిన్న ప్రతిభావంతుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


దర్శి పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా చంద్రబాబు పుట్టినరోజు పురస్కరించుకొని విభిన్న ప్రతిభావంతుల సమక్షంలో పుట్టినరోజు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు పి.సునీల్ ఆంటోనికుమార్, సందు వెంకటరావు, పూసల ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి ప్రాంత ప్రజల సంక్షేమమే లక్ష్యం

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 20: కనిగిరి ప్రాంత ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి మండలంలోని చల్లగిరగల పంచాయతీలో శనివారం రాత్రి డాక్టర్ ఉగ్ర, ఎంపీ తనయుడు మాగుంట రాఘవరెడ్డి సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా గ్రామంలోకి వెళ్లిన డాక్టర్ ఉగ్రకు గ్రామస్థులు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి ఇంటిని సందర్శించి సూపర్‌సిక్స్ పథకాల వల్ల జరిగే లబ్ధిని వివరించారు. చల్లగిరగల గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని డాక్టర్ ఉగ్ర అన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. 45 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15 వందలు అందించనున్నట్టు చెప్పారు. ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ15వేలు ఇస్తామన్నారు.


చల్లగిరగల గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ ఉగ్ర, ఎంపీ తనయుడు మాగుంట రాఘవరెడ్డి

నిరుద్యోగులకు భృతి కింద రూ3వేలు అందించనున్నట్టు చెప్పారు.

కనిగిరి ప్రాంతంలోని ప్రతి గ్రామానికి ఇంటింటికి తాగునీరు అందించి శాశ్వతంగా మంచినీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మెరుగైన పాలన అందిస్తానన్నారు. టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, షరీఫ్, నంబుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాగుంట, ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన అయ్యన్నకోట గ్రామస్థులు

టీడీపీలో పలువురు చేరిక

పామూరు, ఏప్రిల్ 20: మండలంలోని అయ్యన్నకోట గ్రామానికి చెందిన ఆరు కుటంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శనివారం కనిగిరిలో మాగుంట రాఘవరెడ్డి, టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, తుమ్మ ఆంజనేయరెడ్డి, పోకా నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్'తో ప్రతి కుటుంబానికి లబ్ధి


సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పీసీపల్లి, ఏప్రిల్ 20: సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందని టీడీపీ నాయకులు అన్నారు. కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో మండలంలోని నేలపాటిల్లి, చింతగుంపల్లి, పిల్లివారిపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీరపనేని పెద్దన్న, పువ్వాడి నాగరాజు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఏనుగంటి వెంకయ్య, దేవరపు కొండపనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన 30 కుటుంబాలు

- దోసకాయలపాడు గ్రామస్థులు టీడీపీలో చేరిక

తాళ్లూరు, ఏప్రిల్ 20: మండలంలోని దోసకాయలపాడు గ్రామంలో టీడీపీ సీనియర్ నేత నల్లపాటి సత్యం ఆధ్వర్యంలో వార్డు సభ్యుడు, రేషన్ డీలర్‌తో పాటు 30 కుటుంబాలు వైసీపీని వీడారు. శనివారం టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

దర్శిలోని గొట్టిపాటి నివాసం వద్ద గ్రామపంచాయతీ 5 వార్డు సభ్యుడు బందలకుంట కోటయ్య, రేషన్ డీలర్ బందలకుంట రాంబాబుతో పాటు యాచవరపు చినకోటేశ్వరరావు, ఆవుల నాగప్రసన్న, కూటాల రామాంజనేయులు, ఏలూరి కోటేశ్వరరావు, యాచవరపు ఇజ్రాయిల్, బాలకోటేష్, తదితర 30 కుటుంబాలకు చెందినవారు పార్టీలో చేరారు. వీరికి గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.


టీడీపీ తీర్థం పుచ్చుకున్న దోసకాయలపాడు వైసీపీ శ్రేణులతో కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్

ఏటీఎం వద్ద రూ.40 వేలు మోసపోయిన మహిళ

దర్శి, ఏప్రిల్ 20: దర్శి పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మోసగాళ్ల మాయలో పడి ఓ మహిళ రూ.40వేలు పోగొట్టుకున్నారు. మండలంలోని జముకులదిన్నె గ్రామానికి చెందిన బి.సుమిత్ర శనివారం పనినిమిత్తం దర్శికి వచ్చారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు వెళ్లారు. ఏటీఎం నుంచి డబ్బులు తీయడం తెలియక ఇతరులపై ఆధారపడ్డారు. అదును కోసం వేచిఉన్న యువకులు తాము డబ్బులు తీసి ఇస్తామని ఏటీఎం కార్డును తీసుకున్నారు. కొద్దిసేపు తీస్తున్నట్లు నటించిన వారు డబ్బులు రావడం లేదని చెప్పి ఆమెకు కార్డును మార్చి ఇచ్చారు. విషయం తెలియక అక్కడ నుంచి బయటకు వచ్చిన ఆమె ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్ ఏమిటని ఆమె వేరొకరికి చూపించగా మీ ఖాతాలో రూ.40వేలు డ్రా చేసినట్లు వచ్చిందని చెప్పారు. దీంతో ఆమె లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- ఘనంగా అధినేత పుట్టినరోజు వేడుకలు

దర్శి, ఏప్రిల్ 20: చంద్రబాబు అంటేనే ఒక విజన్ అని, ఆయన సారథ్యంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం దర్శిలో టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి చంద్రబాబు పుట్టినరోజు కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం శ్రీషిరిడి సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా గతంలో ఎన్నడూలేని విధంగా వేడుకలు నిర్వహించారని చెప్పారు. ఐటీ రంగం తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కౌన్సిలర్ విసి రెడ్డి, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.


కనిగిరిలో డాక్టర్ ఉగ్రకు కేకు తినిపిస్తున్న మాగుంట రాఘవరెడ్డి


దర్శిలో కేకు కట్ చేస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

దొనకొండ: దొనకొండలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు నేతృత్వంలో శనివారం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో పులిమి రమణాయాదవ్, దుగ్గెంపూడి చెంచయ్య, కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తోహిద్, కుందుర్తి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆపార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుమ్మడి సాయి కేకు కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వల్లభనేని సుబ్బయ్య, షేక్ కాలేషావలి, గొల్లపూడి వేణుబాబు, కూటాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు అజెండా

కనిగిరి, ఏప్రిల్ 20: చంద్రబాబు దేశానికే మకుటం వంటి వారని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి చంద్రబాబు పుట్టినరోజు కేకు కట్ చేసి డాక్టర్ ఉగ్రకు తినిపించి అనంతరం శ్రేణులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఎంతో సుదీర్ఘ అనుభవంతోపాటు ఎటువంటి మచ్చలేని నేతగా ఎదిగిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబు ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తారని, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధే అజెండాగా పనిచేస్తారన్నారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు క్రమశిక్షణ, పట్టుదల, పార్టీ పట్ల, కార్యకర్తల పట్ల గౌరవం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకలను శనివారం ఆపార్టీ మండల కమిటీ టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ జడ్పీటీసీ హుసేన్‌రావు యాదవ్, షేక్ ఖాజారహంతుల్లా, యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, బీజేపీ కన్వీనర్ కేవీ రమణయ్య, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా కేకు కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా పీసీపల్లి క్లస్టర్, సూపర్‌సిక్స్ సమన్వయ కర్త వీరపనేని పెద్దన్న, గుంటగాని జోసెఫ్‌లు మాట్లాడుతూ రాష్ట్రప్రజల భవిష్యత్తు కోసం ముందుచూపుతో పాలన సాగించిన దార్శనీకుడు చంద్రబాబునాయుడు అని అన్నారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, ఎబినేజరు, కొండయ్య, చినమాలకొండయ్య, కూరపాటి కిట్టు, శివప్రసాదు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో.. త్రిముఖ పోటీ

- నామినేషన్లకు ముహూర్తాలు ఖరారు
- రేపు చీరాల రానున్న పీసీసీ చీఫ్ షర్మిల

చీరాల, ఏప్రిల్ 20: చీరాలలో వివిధ పార్టీల తరఫున, స్వతంత్ర అభ్యర్థులు ఎంతమంది నామినేషన్లు దాఖలు చేసినా అంతిమంగా మూడు ప్రధాన పార్టీల (టీడీపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్) మధ్య త్రిముఖ పోటీ ఏర్పడనుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేశ్ నామినేషన్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కూటమి అభ్యర్థి కొండయ్య తరఫున ఆయన కుమారుడు గౌరీఅమర్‌నాథ్ తొలి సెట్ నామినేషన్ పత్రాలను శుక్రవారం దాఖలు చేశారు. పూర్తి బలనిరూపణతో ఈ నెల 24న ఎంఎం కొండయ్య మరో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీలో భిన్నస్వరాల వినిపించేవారు ఏకతాటిపైకి వస్తున్నారు. దీంతో టీడీపీలో రోజురోజుకు జోష్ పెరుగుతోంది. జనసేన, బీజేపీ శ్రేణులు కొండయ్య గెలుపు కోసం క్షేత్రస్థాయి నుంచి ముందడుగు వేస్తున్నారు.

నేడు బీఫాం అందుకోనున్న కొండయ్య

ఈ నెల 24న టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి కొండయ్య నామినేషన్ దాఖలు చేయనున్నారు. అందులో భాగంగా ముందస్తుగా ఆదివారం చంద్రబాబు నుంచి కొండయ్య బీఫాం అందుకోనున్నారు.

రేపు పీసీసీ చీఫ్ షర్మిల చీరాల రాక

మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరడం, ఆ పార్టీ తరఫున నామినేషన్ వేయడం లాంఛనప్రాయమే. ఇప్పటికే ఆమంచి పీసీసీ చీఫ్ షర్మిలను కలసి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల చీరాల రానున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ఆమంచి పార్టీలో చేరతారని ఆమంచి కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే రోజు బీఫాం అందుకుని 23న నామినేషన్ వేస్తారని చెప్తున్నారు.

25న వెంకటేశ్ నామినేషన్

వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేశ్ ఈ నెల 25న బలనిరూపణతో నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు సమాచారం. ఇక ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కూడా గణనీయమైన సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేలా కనిపిస్తోంది. కొందరు ఇటు నుంచి అటు అటు నుంచి ఇటు కప్పదాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల బలాబలాలపై రాజకీయ వర్గాల్లో రోజుకో విధమైన చర్చ సాగుతోంది.

చంద్రన్నతోనే.. గోదావరి!

- వరప్రదాయిని సాకారంపై రైతుల నమ్మకం
- అటకెక్కిన గోదావరి జలాల తరలింపు పథకం
- ఐదేళ్లుగా వివక్ష చూపారని సీఎం జగన్‌పై ఆగ్రహం
- సాగర్ ఆయకట్టులో సాగు సంక్షోభమైనా పట్టని పాలకులు
- 9.61 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా పథకంపై నిర్లక్ష్యం

9.61 లక్షల ఎకరాలకు సాగునీరు.. 679 చెరువులు, వందల గ్రామాలకు తాగునీరు.. సాగర్ ఆయకట్టులో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా.. గోదావరి జలాలను సాగర్ ఆయకట్టు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తి పోతల పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత వరప్రదాయిని లాంటి పథకంపై వివక్ష చూపింది. ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహనరెడ్డి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా పనులు నిలిపివేశారు. పైగా వైఎస్ఆర్ పల్నాడు కరవు నివారణ పథకంగా పేరు మార్చారే కాని పనులపై దృష్టి సారించలేదు. ఈ పరిస్థితుల్లో మళ్లీ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టుకు వస్తాయని.. తమకు నీటి కష్టాలు తీరతాయని రైతులు, గ్రామీణులు విశ్వసిస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మలో బిరబిరా పరుగులు లేవు. ఆయకట్టులో బంగారు పంటల ఆనవాళ్లు లేవు. నాగార్జునసాగర్ జలాశయంలో జలకళ లేదు. సాగునీటి కష్టాలతో ఆయకట్టు అల్లాడుతోంది. లక్షల ఎకరాల్లో రైతులు నీటి తడుల కోసం తంటాలు పడుతున్నారు. పంటల సాగు సందిగ్ధంలో పడింది. ఈ పరిస్థితిని గత టీడీపీ ప్రభుత్వం ముందస్తుగానే ఊహించి సాగర్ ఆయకట్టులో సాగు, తాగు నీటి కష్టాలను శాశ్వతంగా పరి ష్కరించేలా గోదావరి జలాలను తరలించే పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా రూపొందించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటా యించి శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వరప్రదాయనిలాంటి పథకంపై వివక్ష చూపింది. భూసేకరణ సహా ఇతర పనులన్నింటినీ అటకెక్కించింది. సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు వరప్రదాయనిగా నిలి చే పథకంపై ప్రభుత్వం శీతకన్ను వేయడం పై పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లావాసుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ పథకం పట్ల జగన్ వ్యవహరించిన తీరును అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదేళ్ల సీఎం జగన్‌మోహనరెడ్డి రూపాయి కూడా ఖర్చు చేయకుండా పనులు నిలిపివేయడంపై మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టు వస్తాయని రైతులు బలంగా విశ్వసిస్తున్నారు. అయనే అధికారంలోకి రావాలని అన్నదాతలు కోరు కుంటున్నారు.



ఎనిమిదేళ్లలో మూడేళ్లు కరువు

ఎనిమిదేళ్లలో మూడు సంవత్సరాలు సాగర్ ఆయకట్టులో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కుడి కాలువకు గోదావరి జలాలు అందుతాయన్న భరోసా నాలుగు జిల్లాల ప్రజల్లో సన్నగిల్లు తున్నది. గోదావరి జలాల తరలింపు పథకంతో పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 9,61231 వేల ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేలా గోదావరి జలాల ఎత్తి పోతల పథకం రూపొందించారు. పట్టిసీమ పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేస్తుండటంతో ఆ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇదే తరహాలో సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు కూడా గోదావరి జిలాలతో మహర్దశ పట్టేది. కుడి కాలువ ప్రాంతానికి గోదావరి, పెన్నా అనుసంధానం పథకం పూర్తి జీవం పోస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ పథకంపై వివక్ష చూపింది. దీంతో సాగర్ ఆయకట్టులో సాగునీటి సంక్షో భవంతో రెండేళ్లుగా పంటలు పండని పరిస్థితి నెలకొంది. అదే ఈ పథకం పూర్తి చేసి ఉంటే గోదావరి జలాలతో పంటలు పండేవని రైతుల అభిప్రాయం. ఈ ఎత్తి పోతల పథకం పూర్తి చేయటం ద్వారా రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీళ్లు కుడి కాల్వకు అందేవి. ఈ పథకం పూర్తయితే ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారేదని కానీ వైసీపీ ప్రభుత్వ తీరు తమకు శాపం లా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పథకం పనుల కోసం 3,437 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచ నా వేశారు. ఇందుకు సంబంధించిన సర్వే కూడా పూర్తి చేశారు. అమ రా వతి, పెదకూరపాడు, క్రోసూరు, రాజుపాలెం మండలాల నుంచి నకరికల్లు మండలంలోని సాగర్ కుడి ప్రధాన కాలువ వరకు భూసేకరణకు రూ.955 కోట్లు వ్యయం అవు తుందని అంచనా వేశారు. భూసేకరణకు సంబంధిం చిన ప్రకటనను కూడా రెవెన్యూ శాఖ జారీ చేసింది. ఇందుకు నిధులు విడుదల కాక పోవడంతో ఈ ప్రక్రియ నిలిచి పోయింది. ఎత్తిపోతల పథకం పనుల ను రెండు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగిం చింది. రూ.2281 కోట్లతో ఒక ప్యాకేజీ, రూ.2655 కోట్లతో రెండో ప్యాకే జీగా నిర్ణయించి ఇద్దరు కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చారు. ప్రభు త్వం నిధులు విడుదల చేయకపో వడంతో కాంట్రాక్టర్లు పను లు చేపట్టలేదు. ఎంతో ప్రా ధాన్యం కలిగిన ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయకుండా నిలిపి వేయడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3,437 ఎకరాల భూసేకరణ చేయాలి



గోదావరి జలాలు నాగార్జున సాగర్ కుడి కాల్వలో కలిసే ప్రదేశం ఇదే


పేరు మార్చి పట్టించుకోలేదు..

గోదావరి జలాల తరలింపు పథకానికి తన తండ్రి వైఎస్ఆర్ పేరు పెట్టుకోవడంలో ముఖ్యమంత్రి కాగానే జగన్ చూపిన శ్రద్ధ పథకం నిర్మాణంపై కనబరచలేదు. టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఎత్తిపోతల పథకం పనులను జగన్ నిలిపేశారు. ఈ పథకం నిర్మాణానికి రూ.6,020 కోట్లు నిధులు కేటా యించినట్లు 2020లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిధుల విడుదలను జగన్ ప్రభుత్వం విస్మ రించింది. దీంతో భూసేకరణ నిలిచిపోయింది. పంపుహౌస్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నిలి పివేశారు. పథకం నిర్మాణానికి భూసేకరణ ఎక్క డవేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. ఐదేళ్లుగా పనులు ముందుకు సాగక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే సాకారం


గోదావరి పెన్నా నదుల అనుసంధానం ఆంధ్రప్రదేశ్ వరప్రదాయని. దశాబ్దాల కలది. ఆంధ్రప్రదేశ్ విభజనతో నీటి సంక్షోభ ప్రమాదాన్ని చంద్రబాబు ఊహించారు. విభజిత రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు తరలించాలని నిర్ణయించారు. గోదావరి జలాల తరలింపు ద్వారా సాగర్ కుడి కాల్వ ఆ యకట్టులో నెలకొనే సాగు నీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా గుర్తించారు. దీంతో 2018లో నకరికల్లు వద్ద గోదావరి జలాలను సాగర్‌కు తరలించే ఎత్తిపోతల పథకానికి చంద్రబాబు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకం మూలనపడింది. పైగా ఈ పథకానికి సీఎం జగన్ తన తండ్రి పేరుతో వైఎస్ఆర్ పల్నాడు కరవు నివారణ పథకంగా మార్చారే కాని ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఆయన శంకుస్థాపన చేసిన పథకం పూర్తి అవుతుందని.. తమ నీటి కష్టాలు తీరతా యని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

జన చేతనం



ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఎన్నికల ప్రక్రియపై నిఘానేత్రం



నామినేషన్‌లో మంత్రి సురేష్ భార్య పాల్గొనడంపై సీ-ఈసీకి ఫిర్యాదు

కొండపి, ఏప్రిల్ 20 : కొండపి తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి సురేష్ నామినేషన్ కార్యక్రమంలో ఆయన భార్య(ప్రభుత్వ ఉద్యోగి) పాల్గొనడంపై సీఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. శుక్రవారం మధ్యాహ్నం 12.25 గంటలకు దాఖలు చేసిన నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మంత్రి భార్య విజయలక్ష్మి పాల్గొని ఆర్వో కార్యాలయంలోకి ప్రవేశించారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని సీఈసీకి తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరాయుడు శనివారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల అధికారికి, జిల్లా ఎన్నికల అధికారి, కొండపి నియోజకవర్గ ఈఆర్వోకి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతోపాటు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని జత చేశారు.

సీసీ ఫుటేజ్ ఫీడ్ కావాలని వినతి

నామినేషన్లకు సంబంధించి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణ, ఈఆర్వో గది లోపల సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్ ఫీడ్ కావాలని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వసంతరాయుడు శనివారం ఈఆర్వో ఎ. కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు వినతిపత్రాన్ని పంపుతామని, ఆయన ఆదేశాల మేరకు సీసీ ఫుటేజ్ అందజేస్తామని ఆర్వో ఈసందర్భంగా తెలిపారని వసంతరాయుడు వివరించారు.

జిల్లాకు 25 కెమెరాల కేటాయింపు

అవి బిగించిన వాహనాలు జిల్లాలో సంచారం

ప్రధాన పార్టీల అభ్యర్థుల వెన్నంటే ఒకటి నిరంతరం పహారా

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20 : జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం దృష్టిసారించింది. అభ్యర్థుల ప్రచార సరళితో పాటు కోడ్ ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు చిత్రీకరించేందుకు నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అందుకోసం ఎన్నికల సంఘం జిల్లాకు 25 కెమెరాలను కేటాయించగా జిల్లా ఎన్నికల అధికారైన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల పైభాగంలో ఈ కెమెరాలను అమర్చారు. జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఈ వాహనాలతో నిఘా పెంచనున్నారు. అభ్యర్థుల ప్రచారాలతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రలోభాలు చేయడం వంటివి ఆ వాహనాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు వీడియో తీయనున్నాయి. ఈ వీడియోను ఎన్నికల సంఘానికి అనుసంధానం చేసినట్లు సమాచారం. ఒక్కొక్క నియోజకవర్గానికి మూడు వాహనాలను కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఒక వాహనం నిరంతరం అన్ని ప్రాంతాలను పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేసినట్లు సమాచారం. అందుకు సంబంధించి శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆ వాహనాలకు నిఘా కెమెరాలను అమర్చారు. ఆ వాహనాలు అన్ని నియోజకవర్గాలకు పంపడంతో పాటు అందుకోసం ప్రత్యేకంగా ఉద్యోగులను కూడా నియమించినట్లు సమాచారం. ఆ కెమెరా ద్వారా ఎప్పటికప్పుడు వీడియోలను అనుసంధానం చేసినట్లు సమాచారం.



నిఘా వాహనాలకు కెమెరా బిగింపు

రాజకీయ సిత్ర విసిత్రాలు

ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్ తొలగింపు

వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో చర్యలు

తాళ్లూరు, ఏప్రిల్ 20 : వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్‌ను విధుల నుంచి తొలగించారు. రెండురోజుల క్రితం జరిగిన వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్‌లో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ గంగవరపు శివారెడ్డిని సస్పెండ్ చేశారు. అలాగే, వైసీపీ ర్యాలీలో పాల్గొన్న వలంటీర్ కె.రాజారెడ్డిని విధుల నుంచి తొలగించారు. ఈమేరకు ఆయా శాఖలకు చెందిన అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా విధులు నిర్వహణకు సంబంధించి శుక్ర, శనివారాల్లో ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం విచారణ చేయించి నిజమని తేలడంతో వారిని సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

అంతులేని అభిమానానికి అభినందనలు

-బీఎన్ గెలిచే వరకూ చెప్పులేసుకోనని శపథం

-ఏలూరివారిపాలెం వాసికి విజయ్‌కుమార్ అభినందన



బక్కా ఉదయ్‌కిరణ్‌ను అభినందిస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్ 20 : అసలే ఠారెత్తించే ఎండలు.. బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితులున్నాయి. చెప్పులు లేకుండా అడుగు వేస్తే అరికాళ్లు బొబ్బలు ఎక్కడం ఖాయం. అయితే ఇవన్నీ తన అభిమాన నాయకునిపై ఉన్న వెల్లువెత్తిన అభిమానానికి అడ్డురాలేదు. తమ అభిమాన నాయకుడు బీఎన్ విజయ్‌కుమార్ రానున్న ఎన్నికల్లో గెలిచే వరకూ చెప్పులేసుకోకుండా తిరుగుతానని ఏలూరివారిపాలెం క్రిస్టియన్‌పాలేనికి చెందిన బక్కా ఉదయ్‌కిరణ్ మొక్కుకున్నారు. ఆ మేరకు చెప్పులు లేకుండానే ఎర్రటి ఎండల్లో బీఎన్ గెలుపునకు ప్రచారం సైతం నిర్వహిస్తుండటాన్ని తెలుసుకున్న విజయ్‌కుమార్ శనివారం తన గృహానికి ఉదయ్‌కిరణ్‌ను పిలిపించుకొని మరి అభినందనలు తెలిపారు. ఆరోగ్యం గురించి వాకబు చేసి హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ, తనపై ఉన్న ప్రేమాభిమానాలకు చలించిపోయరు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి రాఘవరావు, గోగినేని రాజా, గోనుగుంట రత్తయ్య, తదితరులు ఉదయ్‌కిరణ్‌ను అభినందించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని విశ్వాసం

అరుగురు వలంటీర్లు రాజీనామా



ఎంపీడీవోకి రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

తర్లుపాడు, ఏప్రిల్ 20 : మండలంలోని తుమ్మలచెరువు గ్రామానికి చెందిన అరుగురు వలంటీర్లు రాజీనామా పత్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీవోకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే వాలంటీర్లకు రూ.10వేలు జీతం ఇస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. దీంతో ఆయనకు మద్దతు తెలిపేందుకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. అనేక మంది వలంటీర్లు టీడీపీకి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు.

బలాన్ని నిరూపించిన అద్దంకి ప్రజలు

ఆహ్వానాలు అందించలేకున్నా మరీ వచ్చి రవికుమార్‌కు మద్దతు

మండుటెండనూ పట్టించుకోని ప్రజలు

సెంటిమెంట్‌ను తుచతప్పక పాటించిన గొట్టిపాటి

లోకేష్ యువగళం నాటి సభను జ్ఞప్తికి తెచ్చిన ర్యాలీ

కూటమి శ్రేణుల్లో పెరిగిన జోష్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

మరోసారి అద్దంకిలో టీడీపీ కూటమి విజయకేతనం తప్పదు అన్న భావన అందరిలోనూ వింటున్నాం.. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ లౌక్యంతో నెరుపుతున్న ప్రజా సంబంధాలు కూడా అందుకు కారణమని అంచనా.. అద్దంకి నియోజకవర్గానికి అధికార వైసీపీ స్థానికేతర అభ్యర్థిని రంగంలో దింపటం, దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు, శ్రేణులు టీడీపీలో పాలోమని చేరిపోవటం తెలుగుదేశంపార్టీపై రాజకీయ విశ్లేషకుల అంచనాలను పెంచాయి. అవి అంచనాలు కావు నియోజకవర్గ వాస్తవ పరిస్థితులే అని శుక్రవారం అద్దంకిలో జరిగిన ర్యాలీ నిరూపించింది. టీడీపీ కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యే రవికుమార్ నామినేషన్ దాఖలు సందర్భంగా గ్రామగ్రామాల నుంచి స్వచ్ఛందంగా ప్రజలు తరలి వచ్చి ఎండను సహితం లెక్కచేయకుండా రవికుమార్‌కు మద్దతు పలకటం అందుకు దర్పణం పట్టింది. దీంతో టీడీపీ కూటమి శ్రేణుల్లో జోష్ మరితం పెరగటం విశేషం.

రవికుమార్‌ను ఇబ్బంది పెట్టేకొద్దీ పెరుగుతున్న సానుభూతి

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఎమ్మెల్యే రవికుమార్‌ను దెబ్బతీసేందుకు జగన్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేయటం, ఆయన గ్రానైట్ వ్యాపారాన్ని స్తంభింపజేయటం తెలిసిందే. అయినా బెదరని రవికుమార్ టీడీపీ తరఫునే పనిచేస్తూ అధినాయకుల వద్ద పట్టు పెంచుకోవటంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆ పార్టీ కీలక నేతగా ఎదిగారు. నియోజకవర్గ ప్రజలకు అనునిత్యం టచ్‌లో ఉన్నప్పటికీ భారీ స్థాయిలో పార్టీ కార్యక్రమాలు కానీ, సభలు కానీ నిర్వహించలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ తరఫున జరిగిన ఒకే ఒక్క పెద్ద కార్యక్రమం నారా లోకేష్ యువగళం పాదయాత్ర మాత్రమే. పాదయాత్రలో భాగంగా అద్దంకికి లోకేష్ వచ్చినరోజు అద్దంకి పట్టనంత జనం వచ్చి ఆయనకు మద్దతు పలికారు. అప్పుడే లోకేష్ ప్రకాశం పులి గొట్టిపాటి రవికుమార్ అంటూ కితాబిచ్చారు. ఆ తర్వాత రవికుమార్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం అద్దంకిలో జరిగిన ర్యాలీ యువగళం సభను జ్ఞప్తికి తెచ్చిందనేది అందరిమాట. నిజానికి దైవభక్తి అధికంగా ఉండటమే కాక సెంటిమెంట్‌లను గౌరవించే రవికుమార్ నామినేషన్ కార్యక్రమానికి గుట్టుచప్పుడు కాకుండా వస్తారని అందరూ భావించారు. ఆయన కూడా పరోక్షంగా కిందిస్థాయి నాయకులకు, ముఖ్యులకు చెప్పి ఉండవచ్చు కానీ బహిరంగంగా ఎక్కడ శుక్రవారం నామినేషన్ వేస్తున్న విషయం ప్రకటించలేదు. మీడియాలో ప్రకటనలు ఇవ్వలేదు. అంతకుమించి ఊరూవాడా భారీగా ప్రత్యేక వాహనాలు పంపలేదు. కానీ ఆయన నామినేషన్ కార్యక్రమానికి వేలసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఒక్క పరిశీలన జరపగా నియోజకవర్గంలోని కుగ్రామాలతో సహా ప్రతి గ్రామం నుంచి టీడీపీ కూటమి శ్రేణులతో పాటు గొట్టిపాటిని వ్యక్తిగతంగా గౌరవించే వారు తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులు పంపలేదు. విద్యాసంస్థల బస్సులు తీసుకొని పంపలేదు. ఎక్కడెక్కడో నుంచి తుపాన్ లాంటి వాహనాలు బుక్ చేసి అద్దంకికి రప్పించి గ్రామాలకు పంపలేదు.



అద్దంకి పట్టణంలో గొట్టిపాటి నామినేషన్‌కు హాజరైన అశేషజనవాహిని

కిటకిటలాడిన నగర పంచాయతీ

రవికుమార్ నామినేషన్ సందర్భంగా మధ్యాహ్నానికి అద్దంకి కిటకిటలాడింది. సెంటిమెంట్ ప్రకారం ఎక్కడెక్కడో ఆశీర్వాదాలు తీసుకొని దేవాలయాలు, మసీదులు, చర్చీలు సందర్శించి సింగరకొండ దేవస్థానం వరకు రవికుమార్ వచ్చే సరికి జనం పెద్దసంఖ్యలో అక్కడ గుమికూడారు. అక్కడనుంచి అద్దంకిలోని తహసీల్దారు కార్యాలయం వరకు పరుగుల తీసే జనం, వాహనాల్లో అనుసరించే అభిమానులు, కేరింతలు కొట్టే టీడీపీ శ్రేణులతో ప్రధాన రహదారి అంతా కిటకిటలాడింది. మిట్టమధ్యాహ్నం 1 గంటకు రవికుమార్ నామినేషన్ దాఖలకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరినా వచ్చిన ప్రజలు కదలలేదు. భగభగమండే ఎండలోనూ ప్రజలు నిలబడి రవికుమార్‌కు మద్దతు ప్రకటించారు. అనేక గ్రామాల్లో గ్రామ రాజకీయాల్లో గ్రూపులుగా ఉన్న ఇరువర్గాల వారు తమ స్థానిక భేదాలు పక్కనబెట్టి ఈ కార్యక్రమానికి రావటం కనిపించింది. కొన్ని గ్రామాల్లో అయితే నాయకులు తమకు చెప్పలేదు వాహనాలు పంపలేమని మీనమేషాలు లెక్కిస్తుండగా కార్యకర్తలు వారికున్న సొంత వాహనాల్లో తరలివచ్చారు. అందుకే ర్యాలీకి వచ్చిన వారు ప్రయాణించిన ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు భారీగా కనిపించాయి. ఈ కార్యక్రమం నిర్వహణను గమనించిన విశ్లేషకులు శనివారం గ్రామాల వారీ ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు ఎలా ఎంతమంది తరలివచ్చారో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ రూపంలో వెల్లడైన సమాచారంతో అద్దంకిలో టీడీపీకి ప్రత్యేకించి రవికుమార్‌కు మంచి ఆదరణ ఉందనేది ఊహాజనితం కాదని నిజమైన పరిస్థితి అని అంటున్నారు. కాగా భారీగా తరలివచ్చిన ప్రజలను చూసి రవికుమార్‌తో పాటు టీడీపీ నాయకులు సంబరపడుతుండగా కిందిస్థాయిలో ఆ పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ పెంచింది.

మాట్లాడుతున్న గొట్టిపాటి



గుర్తుండేలా దామచర్ల ప్రచారం



ఎన్నికల సీజన్.. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార కార్యక్రమాన్ని కూడా కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. పాత పద్ధతులకు భిన్నంగా పూటకో రీతిలో.. రోజుకో తీరులో సాగిస్తున్నారు. కాకపోతే కాస్త నవ్యతను జోడిస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఒంగోలు నగరంలో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఆ పార్టీ ఎన్నికల గుర్తు అయిన సైకిల్‌ను తొక్కుతూ సైకిల్‌కు ఓటు వేయాలని ఆ గుర్తును చూపిస్తూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. శనివారం నగరంలోని 50వ డివిజన్ జయప్రకాష్‌కాలనీలో దామచర్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే నగరంలో ప్రధాన అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నాయకులు చింతపల్లి రాంబాబు, సోమిశెట్టి శ్రీను, నిడమనూరి హనుమంతరావు, తుపాకుల శ్రీను, షేక్ షబీర్, యోగయ్యయాదవ్, కొఠారి నాగేశ్వరరావు, కమ్మ వెంకటేశ్వర్లు, షేక్ నాజర్‌వలి, ఏనుగుంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక దారావారితోటకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు సామి వెంకటసుబ్బారావు దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరారు.

-ఒంగోలు కార్పొరేషన్

నిమ్జ్‌పై వైసీపీ చావుదెబ్బ

పామూరులో ప్రకాశించని కారిడార్

గత ప్రభుత్వాలు మంజూరు చేసినా పట్టించుకోని సీఎం జగన్

ఎన్నికలు సమీపిస్తుండటంతో హడవుడి చేస్తున్నారంటూ ఆరోపిస్తున్న ప్రజలు



భూములను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న పరిశ్రమలశాఖ కార్యదర్శి (ఫైల్)

పామూరు, ఏప్రిల్ 20 : గత ప్రభుత్వాలు అందించిన పారిశ్రామికీకరణ ఒరవడిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. పరిశ్రమలు.. ఉపాధి మాకెందుకు అన్నట్లు వ్యవహరించింది. ఫలితంగా పామూరు మండలంలో పారిశ్రామిక అభివృద్ధి పూర్తిగా చతికిలపడింది. వివరాల్లోకెళ్తే... పామూరు ప్రాంతంలో నిమ్జ్ పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం అప్పటి కాంగ్రెస్ శాసనసభ్యులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేసిన కృషి ఫలితంగా మండలంలో సుమారు 12 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పదేళ్ల క్రితం సేకరించారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రూ.45 వేల కోట్లతో పారిశ్రామిక వాడ నిర్మించాలని భావించింది. దానికి అనుగుణం గా చర్యలు తీసుకుంది. సేకరించిన నిమ్జ్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం విశాలమైన రోడ్లు, డ్రైనేజి వసతి నిర్మించారు. నీళ్ల అవసరాల కోసం చేతి పంపులతో పాటు సంప్‌లు నిర్మించేందుకు అధికారులు తగు ప్రణాళికలు సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా నిమ్జ్ విషయాన్ని విస్మరించింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటీవల పరిశ్రమలశాఖకు సంబంధించిన అధికారులు జిల్లా కలెక్టర్‌తో కలిసి నిమ్జ్ భూములను పరిశీలన చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే తగిన నీటివసతి కావాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు నీటిని మోపాడు రిజర్వాయర్‌కు కెనాల్ ద్వారా అనుసంధానం చేయటమే ఏకైక మార్గం అని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు.

ఇటీవల నిమ్జ్ భూముల్లో అధికారుల పర్యటనపై విమర్శలు

నిమ్జ్ మంజూరైన రెండేళ్లల్లోనే పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పటి కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పట్టా భూముల రైతులను ఒప్పించి నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారు. ఇటీవలకాలంలో రెండుమార్లు పరిశ్రమల శాఖకు సంబంధించిన ముఖ్య కార్యదర్శి యువరాజ్, పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్‌తో పాటు ఇతర అధికారులు పర్యటనలు చేసి నిమ్జ్ భూములను పరిశీలించారు. ఐదేళ్ల కాలాన్ని పూర్తిగా వదిలేసి ఇప్పుడు మళ్లీ అధికారుల చేత ఆకస్మిక పర్యటనలు చేయించడాన్ని చూసిన ప్రజలు ఎన్నికల స్టంట్‌గా భావిస్తున్నారు. విభజన హామీల్లో భాగంగా కేంద్రప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

> నిమ్జ్ కోసం పామూరు మండలంలో బోడవాడ, మాలకొండాపురం, సిద్ధవరం అయ్యన్నకోట, రేణిమడుగు, వీసీపల్లి మండలంలో లక్ష్మక్కపల్లి, పెద ఇర్లపాడు, అడవిపల్లి, గ్రామాల్లో ప్రభుత్వ భూమి 3,700, అసైన్డ్ భూములు 2,600, పట్టా భూములు 5,800 ఎకరాలు మొత్తం 12 వేల ఎకరాలు సేకరించాలి. ఇప్పటి వర కు 1800 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూములను సేకరించారు. పట్టా భూములకు సంబంధించి నష్టపరిహారం మంజూరు చేయ్యా ల్సి ఉంది, నిమ్జ్ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అధికారులు తెలిపారు.
>
> **నిమ్జ్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 లక్షల మందికి ఉపాధి**



మాలకొండాపురం వద్ద నిమ్జ్ కు సంబంధించిన బోర్డు



తెలుగుదేశం పార్టీలోకి చేరిన బొబ్బేపల్లి గ్రామ వాసులు

ఏలూరికి జై కొడుతున్న వైసీపీ నేతలు

ఆయన సేవ, అభివృద్ధికి మద్దతు

బొబ్బేపల్లి మాజీ సర్పంచ్ పెంట్యాల, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దానయ్య చేరిక

మరో 200 కుటుంబాలు టీడీపీలోకి

ఇంకొల్లు, మార్టూరు, దేవరపల్లి నుంచి పలు కుటుంబాలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సాంబశివరావు

పర్చూరు, ఏప్రిల్ 20 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావుకు వైసీపీ శ్రేణులు జై కొట్టి సైకిలెక్కుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చూసి మద్దతు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. శనివారం పర్చూరు, మార్టూరు, ఇంకొల్లు మండలాలలోని పలువురు వైసీపీ శ్రేణులు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పర్చూరులో వైసీపీ శ్రేణులు, నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆపార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో వైసీపీలో అలజడి మొదలైంది. పార్టీలో చేరుతున్న వారికి ఏలూరి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు

బొబ్బేపల్లి మాజీ సర్పంచ్ పెంట్యాల రామారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డీ దానయ్య ఆధ్వర్యంలో 200 కుటుంబాలు ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారిలో దుడ్డు బాబు, ఐమాల సుబ్బారావు, రామకృష్ణ, దొడ్డ శ్రీహరిరావు, దొడ్డ శ్రీను, గంగ శేషగిరి, దైత ప్రతాప్,పుల్లగోర కిషోర్, దైదల వెంకట్రావు, పుల్లగోర శేషయ్య, బత్తుల సూరిబాబు, ప్రసాద్, తైదల అశోక్, కొండమూరి నాని, కొర్రపాటి ప్రవీణ్, పుల్లగోర శ్యామ్, పట్టేటి వెంకటస్వామి, పుల్లగోర శ్రీకాంత్, పెద్ద శేషయ్య, చింతలపూడి ఏసురత్నం, గంగాధర్ సింగరకొండ, ఐలపరపు గంగాధరరావు, దుడ్డు దేవయ్య, పారి దేవదానంతోపాటు మరో 150 కుటుంబాలు పార్టీలో చేరారు.

మార్టూరులో..

మార్టూరు రాంనగర్‌కు చెందిన 50 కుటుంబాలు ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారిలో చెరుకూరి అంజయ్య, నాగండ్ల శ్రీను, నాగండ్ల జనార్దన్, మురళి, మందపాటి పుల్లారావు, వీరాంజనేయులు, నాగండ్ల దుర్గ, నాగరాజు, వెంకట్రావు, సూరేపల్లి కృష్ణ, నాగండ్ల వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, బండారు వెంకటేష్, దుడ్డు క్రాంతి కుమార్ ఉన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లుకు చెందిన షేక్ షాతియా, షేక్ జుబేదా, షేక్ కరిమ్మ, షేక్ దారియాబీ, పసుపులేటి నాగేశ్వరమ్మ, శరద, కమ్మిశెట్టి ధనమ్మ, షేక్ మోతి, పుసుపులేటి కోటమ్మ, షేక్ షాహేనా, పటాన్ గౌసియా, మస్తాని, సయ్యద్ కాసింబి, షేక్.అభి బన్ని, జీడీఎం జ్యోతి, షేక్ పర్విన్ టీడీపీలో చేరారు.



ఏలూరి సమక్షంలో పార్టీలోకి చేరిన ఇంకొల్లు గ్రామ ముస్లిం కాలనీ వాసులు

దేవరపల్లిలో..

పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన గురవయ్య, వంకాయలపాటి కృష్ణుడు, వినుకొండ నాగరాజు, జాగర్లమూడి వీరాంజనేయులు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కుంభ సాంబశివరావు, కుంభ నాగేశ్వరరావు, చెప్పవరపు శ్రీను, గోగులమూడి బాబు, గోగులమూడి సామేలు తదితరులు సైకిల్ ఎక్కారు.





గొర్రెపాడు క్రాస్ రోడ్డులో బైకును ఢీకొట్టిన లారీ, మృతి చెందిన వృద్ధుడు అంజయ్య

బైకును ఢీకొన్న లారీ

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు


బల్లికురవ, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రహదారి గొర్రెపాడు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న బైకును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన సురభి అంజయ్య (60) అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్‌ఐ బాలకృష్ణ చెప్పిన వివరాల మేరకు.. మండలంలోని కూకట్లపల్లి గ్రామానికి చెందిన సురభి అంజయ్య, పులి కోటేశ్వరరావు బల్లికురవ గ్రామంలోని వారి బంధువు దశదిన కర్మ కార్యక్రమానికి బైకుపై వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా గొర్రెపాడు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి చెన్నై వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకు నడుపుతున్న అంజయ్య అక్కడికక్కడే మృతి చెందగా, వెనక ఉన్న కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అంజయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో యువకుడి అరెస్టు

మండలంలోని కూకట్లపల్లిలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడు జొన్నలగడ్డ అవినాష్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 15వ తేదీన కూలి పనులకు వెళ్లిన బాలికను ఆటో డ్రైవర్ మాయమాటలు చెప్పి ఘాతుకానికి పూనుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేశారు. బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ దర్యాప్తు చేపట్టి అవినాష్‌ను అరెస్టు చేశామని, కోర్టులో పరుస్తామని డీఎస్పీ తెలిపారు.

ఎస్‌ఈబీ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

పర్చూరు, ఏప్రిల్ 20 : పర్చూరు ఎస్‌ఈబీ స్టేషన్‌ను నెల్లూరు జోన్ డిప్యూటీ కమిషనర్ కే హేమంతనాగరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. మద్యం అక్రమ నిల్వలు, అమ్మకాలపై నిఘా ఉంచి పట్టుబడితే కేసులు నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ ఎం.భుజంగరావు, ఎస్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న హేమంత నాగరాజు

బటన్ నొక్కటమే...

నగదు జమ కావటం లేదు..

ముఖ్యమంత్రి చెప్పి నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాలకు జమ కాని డబ్బులు

పోలింగ్‌కు వారంరోజుల ముందుగా డబ్బులు వేస్తారంటూ ప్రచారం

బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

దీవెన డబ్బులు పడక కళాశాలల్లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఉత్తుత్తిదే!

ప్రభుత్వం లబ్ధిదారులను నిలువునా మోసం చేస్తోంది. సీఎం జగన్మోహనరెడ్డి బటన్ నొక్కుడు ఉత్తుతిదే అని తేలిపోయింది. ఆయన అమలుచేస్తున్న పథకాలు పేరుగొప్ప ఊరు దిబ్బలా తయారయ్యాయి. నవరత్నాల్లో భాగంగా అమలుచేస్తున్న అనేక పథకాల లబ్ధి నెలలు దాటుతున్న అందడం లేదు. పైగా లబ్ధిదారులకు తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. డబ్బులు పడ్డాయో లేదోనని నిత్యం వారు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నేను ఇక్కడ బటన్ నొక్కితే నేరుగా మీ ఖాతాలకే డబ్బులు చేరుతాయి అంటూ సీఎం ఆర్భాటంగా చెబుతున్న మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. అన్ని పథకాలదీ అదే తీరు. విద్యాదీవెన అయితే విద్యార్థులకు తలనొప్పిగా తయారైంది. ఫీజుల కోసం కళాశాలలు ఇబ్బంది పెడుతున్నాయి.



ఒంగోలు నగరం, ఏప్రిల్ 20: గోరంత సాయానికి కొండంత ప్రచారం చేసుకోవడం తప్ప సకాలంలో బాధితులకు లేదా లబ్ధిదారులకు ఆ సాయం అందించడంలో మాత్రం వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. అందుకు విద్యా దీవెన, చేయూత, ఆసరా పథకాలతోపాటు జిల్లాలో మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ చెల్లింపు తాజా పరిస్థితే నిదర్శనం. జగనన్న విద్యాదీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులే ఇంతవరకు పూర్తిస్థాయిలో అందలేదు. గత ఏడాది నాలుగో విడత కింద చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులను గత నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. ఆ నిధుల జాడ ఇంతవరకు లేదు. ఎప్పుడు ఖాతాలకు చేరతాయో కూడా తెలియని గందరగోళం నెలకొంది. దీంతో తమను కళాశాలల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయంటూ విద్యార్థులు జగన్ మామా ఇంకోప్పుడు ఇస్తావు విద్యాదీవెన నిధులు అంటూ ప్రశ్నిస్తుండగా చేయూత, ఆసరా కింద బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ నిధులు ఎప్పుడు లబ్ధిదారుల ఖాతాలకు చేరతాయో కూడా అంతుచిక్కక మహిళలు జగనన్న తమకు డబ్బులు ఎప్పుడు పడతాయంటూ ప్రశ్నిస్తున్నారు.

విద్యాదీవెన నిధులు రూ.36.44కోట్లు వచ్చేది ఎప్పుడో..

గతేడాదికి సంబంధించిన జగనన్న విద్యాదీవెన కింద నిధులను సీఎం ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన కృష్ణా జిల్లా పామర్రులో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ నిధులు జిల్లాలోని 48 వేల మంది విద్యార్థులకు రూ.36.44 కోట్లు సీఎం బటన్ నొక్కిన తర్వాత విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమకావాల్సి ఉంది. ఇంతవరకు పూర్తిస్థాయిలో జమకాలేదు. విద్యార్థులు కళాశాలల యాజమాన్యాలు పెడుతున్న ఇబ్బందులను తట్టుకోలేక ప్రగతిభవన్‌లోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. అధికారులు యాజమాన్యాలకు ఫోన్లు చేసి మీకు డబ్బులు వస్తాయి. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వండి అంటూ బతిమాలుకుంటున్నారు.

చేయూత కింద విడుదల కావాల్సింది రూ.184 కోట్లు

చేయూత పథకం కింద 45 ఏళ్లలోపు వయస్సు ఉన్న పొదుపు సంఘాల మహిళలకు ఇవ్వాల్సిన రూ.184 కోట్లు ఇంతవరకు లబ్ధిదారుల ఖాతాలకు జమ కాలేదు. చేయూత పథకం కింద నాలుగు సంవత్సరాల్లో ఏడాదికి రూ.18,750 లెక్కన నాలుగేళ్లపాటు మొత్తం రూ.75వేలు పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చేందుకు చేయూత పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద నాలుగో విడత నిధులను విడుదల చేసేందుకు మార్చి నెల 7వ తేదీన ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. జిల్లాలోని 98వేల మందికి రూ.18,750 లెక్కన వారి ఖాతాలకు జమకావాల్సి ఉంది. స్వయంగా వ్యాపారాలు చేసుకుని జీవనోపాధి పొందేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ నిధులు కూడా మూడొంతుల మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లోకి చేరనేలేదు. మహిళలు ప్రతి రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

ఆసరా డబ్బులు అడ్రస్ లేకుండాపోయాయి

పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ మాఫీ కింద డబ్బులు వారి ఖాతాలకు జమ చేసే ఆసరా పథకానికి బటన్ సీఎం జనవరి మాసంలో నొక్కారు. ఆయా మండలాల్లో కూడా వైసీపీ నాయకులు భారీగా మహిళలతో సభలు పెట్టి నమూనా చెక్కులు ఇచ్చి పంపారు. అయితే ఇప్పటికీ డ్వాక్రా మహిళలకు నాల్గవ విడత ఆసరా డబ్బులు పడలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లాలో 4లక్షల మంది మహిళలకు రూ.280 కోట్లు ఆసరా కింద జమకావాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో మహిళల ఖాతాలకు జమకాలేదు.

ఆసరా ఇంతవరకు పడలేదు:

-పొనుగుమాటి సుజాత, కొణిజేడు, టంగుటూరు మండలం

ఇంతవరకు మా గ్రూపునకు డబ్బులు పడలేదు. తమ గ్రూపునకే కాకుండా గ్రామంలోని ఓసీ వర్గం వారి గ్రూపులు దాదాపు 60 ఉంటే ఒక్క దానికి కూడా పడలేదు. మండలంలో చాలామందికి పడలేదు. అందరూ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.



తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వెలిగండ్ల ప్రాంతంలో మిర్చి చేలో నిలిచిన నీరు (ఫైల్)

బటన్ నొక్కినెల

- రైతులకు అందని పెట్టుబడి సాయం
- ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితి
- మిచౌంగ్ తుఫాన్ తో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- పరిహారం అంతంతమాత్రం, అది కూడా అందని దుస్థితి

ఒంగోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల క్రితం రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ము నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే గతనెల 6న సీఎం వైఎస్ జగన్ స్వయంగా బటన్ నొక్కారు. అయితే నెలరోజులు దాటిపోయినా ఇంతవరకు జిల్లాలో అత్యధికశాతం మంది రైతులకు ఆ సాయం అందిన దాఖలాలు లేవు. వాస్తవానికి జిల్లా రైతాంగాన్ని మిచౌంగ్ తుపాన్ తీవ్రంగానే దెబ్బతీసింది. డిసెంబరు 2 నుంచి 4 వరకు కురిసిన వర్షాలతో వేలాది ఎకరాల్లోని పత్తి, మిర్చి, పొగాకు, కంది, మినుము, మొక్కజొన్న, వరి, శనగ అలసంద ఇతరత్రా పంటలు దెబ్బతిని కోట్లాది రూపాయల మేర రైతులు నష్టపోయారు. అయితే పంట నష్టాలు గుర్తింపులోనే నిబంధనల పేరుతో రైతులకు మొండిచేయి చూపారు. నలభై రోజుల లోపు పైరు పేరుతో శనగ తొలగించారు. పొగాకుబోర్డు అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆ నష్టాలను పెద్దగా పట్టించుకోలేదు. ఇతర పంటల విషయంలోనూ అలాగే వ్యవహరించారు. చివరకు 21 మండలాల్లో 5,137 ఎకరాలలో పలు పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. సుమారు నాలుగున్నవేల మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతినగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.2.89 కోట్లు పెట్టుబడి రాయితీతో ఇవ్వాల్సి ఉంటుందని తేల్చి ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదించారు. వాస్తవంగా జిల్లాలో జరిగిన నష్టం అంతకు పదిరెట్లు ఉండగా నిబంధనల పేరుతో మొండిచేయి చూపారు. ఉభయగోదావరి జిల్లాల్లో తీవ్రనష్టం జరగ్గా కృష్ణా, గుంటూరు జిల్లాలోని డెల్టా ప్రాంతాన్ని బాగా దెబ్బతీసింది. ఆ ప్రాంతంతో పోల్చితే ఇక్కడ తక్కువే. ఆ విషయం అలా ఉంచితే మిచౌంగ్ బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించి ఎన్నికల్లో లబ్ధే ప్రధాన లక్ష్యంగా మార్చి 6న సీఎం బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నెలరోజులు గడుస్తున్నా అధికశాతం మందికి ఇంకా నగదు అందలేదు. త్రిపురాంతకం మండలంలో 1100 మంది రైతులకు రూ.80 లక్షలకుపైగా రావాల్సి ఉండగా ఒక్క రైతుకు కూడా జమకాలేదని తెలుస్తుంది. కురిచేడు, ముండ్లమూరు మండలాల్లోనూ అదే పరిస్థితి. తాళ్లూరు మండలంలో 115 మంది రైతులకు రూ.14.47 లక్షలు రావాల్సి ఉండగా సగం మొత్తం వచ్చినట్లు సమాచారం. ఇతర మండలాల్లోనూ కొన్నింటిలో అసలు రాకపోగా మరికొన్నింటిలో అరకొరగా జమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలుతో అసలు ఆ సొమ్ము వస్తుందా రాదా అన్న సంశయం రైతులలో వ్యక్తమవుతూ ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏఓ) ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంటనష్టంపై రైతువారి వివరాలు ప్రభుత్వానికి పంపామని తదనుగుణంగా వారి ఖాతాలలో రాయితీ సొమ్ము జమ అవుతుందన్నారు. ఎంతమంది రైతులకు ఇప్పటివరకు పడిందన్న విషయం తమ వద్ద వివరాలు ఉండవని చెప్పారు. కొంతమందికి ఏదైనా సాంకేతిక కారణాలతో జమ కాకపోయి ఉండవచ్చన్నారు. ఎవరైనా లబ్ధిదారుల జాబితాలో తన పేరు ఉండి నగదు జమకాకపోతే తమ శాఖ దృష్టికి తీసుకరావాలని సూచించారు. అలాంటి వారి వినతిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి నగదు అందేలా చూస్తామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జిల్లావ్యాప్తంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఎక్కడికక్కడ పెద్దఎత్తున పాల్గొన్న టీడీపీ శ్రేణులు

పలుచోట్ల కేక్ కటింగ్‌లు



మార్కాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, నారాయణరెడ్డి

ఒంగోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలుప్రాంతాల్లోని పార్టీ కార్యాలయాలతోపాటు, కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న చోట్ల కేక్ కటింగ్‌లు, సమావేశాలు నిర్వహించారు. ముఖ్యనేతలు పరస్పరం కేకులు తిని పించుకొన్నారు. తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కూటమిలోని ఇతర పార్టీల నాయకులు కూడా అక్కడక్కడా హాజరయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ కూటమి సంపూర్ణ విజయం సాధించి మరోసారి చంద్రబాబు సీఎం కావాలని, తద్వారా రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. మార్కాపురంలో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేశారు. కనిగిరిలో నిర్వహించిన వేడుకల్లో అక్కడి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు. దర్శిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అక్కడి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు హాజరయ్యారు. గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. ఒంగోలులోని రాజీవ్‌నగర్‌లో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం అక్కడ నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. బీజేపీ, జనసేన నాయ కులు కూడా హాజరయ్యారు. ఒంగోలులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కేక్ కట్ చేయగా వివిధ మండలాల ముఖ్యనేతలు పాల్గొన్నారు. నగరంలోని భాగ్యనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంతోపాటు జిల్లాలో ని వివిధ ప్రాంతాల్లోనూ స్థానిక నేతలు ఉత్సా హంగా చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు.



చంద్రబాబు జన్మదినం సందర్భంగా బొడ్డువారిపాలెంలో మహిళతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఎన్ పాడు కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్

బాలినేని బడా చోర్



ఆయన అవినీతి, అక్రమాలు కోకొల్లలు

బినామీలతో పెద్దఎత్తున దందాలు

ఆధారాలతో సహా ప్రజలకు వివరిస్తా

సొంత బావకే వెన్నుపోటు పొడిచాడు

నన్ను చంపుతామని కొందరు బెదిరిస్తున్నారు

నాకుటుంబానికి ఏమైనా జరిగితే ఆయనదే బాధ్యత

టీడీపీ నాయకుడు సూర్యప్రకాష్‌రెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 20 : ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసుల రెడ్డి పెద్ద దొంగ అని టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఆయన అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపూ లేదన్నారు. తాను ప్రజల్లోకి వెళ్లి వాటిని ఆధారాలతో సహా వివరిస్తానని చెప్పారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రస్థానం కల్పించిన సొంత బావ వైవీ సుబ్బారెడ్డికి బాలినేని వెన్నుపోటు పొడిచారన్నారు. రఘురెడ్డి, భక్తవత్సలరెడ్డి అనే వ్యక్తులను బాలినేని బినామీలుగా ఏర్పాటు చేసుకుని జిల్లాలో అవినీతి దందాలు, నెలవారీ వసూళ్లకు పాల్పడిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. వాస్తవాలు మాట్లాడుతుంటే చంపుతామని బెదిరిస్తున్నారని, తన కుటుంబానికి ఏమైనా జరిగితే బాలినేనిదే బాధ్యత అన్నారు. అమాయకంగా ముఖంపెట్టి ప్రజలను మోసం చేస్తున్న బాలినేని మాటలు ఎవరూ నమ్మొద్దన్నారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తే ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను దహనం చేయించింది బాలినేని కాదా? అని ప్రశ్నించారు. గ్రానైట్ వ్యాపారుల నుంచి వేల కోట్ల రూపాయలను దోచుకున్న ఆయనకు రాజకీయంగా రోజులు దగ్గర పడ్డాయన్నారు. తన వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి విల్లాల కోసం యరజర్ల కొండ మట్టిని తరలించారని విమర్శించారు. బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి ఒంగోలు నగరంలో పెద్దఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అలాగే నకిలీ స్టాంపుల కుంభకోణంలో బాలినేని అనుచరులు పాత్ర ఉంటే వారిని కాపాడేందుకు కేసును నీరుగార్చారని ఆరోపించారు. ఇటీవల నగరంలోని సమతానగర్, రిమ్స్‌లో ఘటనలు జరిగినప్పుడు తాను ఎంపీ మాగుంటతో కలిసి కొండపిలో ఉన్నానని పెద్దిరెడ్డి చెప్పారు. అయితే తాను ఆ ఘటనల్లో పాల్గొన్నట్లు చూపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం బాలినేని ప్రోద్బలంతోనే జరిగిందన్నారు.

14 మంది.. 17 సెట్లు..

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 20 : జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్ స్థానంతోపాటు జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు శనివారం 14 మంది 17 సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, ఐదు అసెంబ్లీ స్థానాలకు పది మంది అభ్యర్థులు 12 సెట్లను సమర్పించారు. అందులో ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు, దర్శి నియోజకవర్గానికి ఇద్దరు, ఒంగోలు నియోజకర్గానికి ఒకరు, కొండపికి నలుగురు, గిద్దలూరు నుంచి ఇద్దరు ఉన్నారు. ఒంగోలు ఎంపీ స్థానానికి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ఆయన భార్య లక్ష్మి ఒకసెట్ అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులు రాయపాటి జగదీష్, ఆకుమళ్ల మల్లికార్జునరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గొట్టిముక్కల సుజాత నామినేషన్ వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, బీఎస్పీ అభ్యర్థి ఇత్తడి శివప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు. ఒంగోలు అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా చప్పిడి రవిబాబు నామినేషన్ వేశారు. కొండపి నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఏలూరి నామినేషన్‌కు తరలిరండి

- టీడీపీ శ్రేణుల విజ్ఞప్తి
- కూటమి అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం



సంతరావూరులో ప్రచారం చేస్తున్న మహిళలు .. ఇంకొల్లులో ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 20 : పర్చూరులో సోమవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు నామినేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం మార్టూరులో టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. 22, 23వ బూత్‌ల పరిధిలో పాల కోఆపరేటివ్ బ్యాంక్ వీధిలో, పీర్ల చావిడి, పాత పోస్టాఫీస్, బొడ్డురాయి సెంటర్, గన్నవరం రోడ్, కరణం బజారులో ప్రచారం నిర్వహించారు. మార్టూరు గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, జనసేన పార్టీ కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. వారంతా ఇంటింటికీ తిరుగుతూ పర్చూరు నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయనకు సంఘీభావంగా సోమవారం జరిగే నామినేషన్‌కు తరలిరావాలన్నారు. వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వమని తెలిపారు. ఐదేళ్లుగా అరాచకాలు సాగించిన జగన్‌రెడ్డి ఎన్నికల సమయంలో కూడా దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒక్కచాన్స్‌తో వచ్చిన జగన్‌రెడ్డిని ఓట్లతో బుద్ధి చెప్పి గద్దె దింపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం బాగు కోసం చంద్రబాబును, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏలూరిని గెలిపించుకోవాలన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ చంద్రబాబు వస్తే అమలు చేసే పథకాలు, వాటి ప్రయోజనాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరావు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, శివనాగేశ్వరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, షేక్ ఫరూక్, అంజనేయులు, పోలూరి సింగయ్య, సకల అంజనేయులు, జంపని శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, బుడే, మహిళలు పాల్గొన్నారు.

గన్నవరం గ్రామంలో ప్రచారం

యద్దనపూడి, (మార్టూరు) : యద్దనపూడి మండలంలో గన్నవరం గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు ప్రచారం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధిలో ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏలూరిని గెలిపించాలని సైకిలు గుర్తుపై ఓటు వేయాలని కార్యకర్తలు ప్రచారం చేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, గన్నవరం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట వచ్చునని మండల పార్టీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి ప్రచారంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొట్టిపాటి సతీష్ కుమార్, పాపారాయుడు, సోమేపల్లి స్వా ములు, నర్రా వెంకటేశ్వర్లు, నర్రా అం జనేయులు పాల్గొన్నారు.

కూటమి నేతల ప్రచారం

చినగంజాం : మండల పరిధిలోని గ్రామాల్లో టీడీపీ కూటమి పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు, ఎంపీ అభ్యర్థి టీ కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరముగా నిర్వహిస్తున్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో, సంతరావూరు, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పెదగంజాం, పల్లెపాలెం, పల్లెపా లెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పు పల్లెపా లెం, పటమటి పల్లెపాలెం తదితర గ్రామాల్లో శనివారం కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పొద వీరయ్య, యార్లగడ్డ లక్ష్మి, ఆసోది సుబ్బారెడ్డి, సీ.హెచ్.రాఘవయ్య, గొల్లపోతు వెంకటేశ్వర్లు, జె.సంధ్యారాణి, దేవతోటి నాగరాజు, అతిన సురేష్, గోవిందు సుబ్బారావు, కేశనపల్లి శ్యాంబాబు, దేవరపల్లి రాజేష్, బార్గవి, రాములు, శ్రీను, శ్రీనివాసరావు, సాయిని మహేష్, పవన్, సుబ్బారావు, షేక్ జిలాని, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంతరావూరు, కడవకుదురులో కేక్ కట్ చేసి బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.


మార్టూరులో ప్రచారం చేస్తున్న శ్రేణులు

ఇంకొల్లులో ప్రచారం

ఇంకొల్లు : టీడీపీ కూటమి శ్రేణులు జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబును గెలిపించాలని, పర్చూరు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంకొల్లు ఇస్లాంపేట, నక్కలపాలెం, గంగవరం గ్రామాలలో ఆయా గ్రామ నాయకులు విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయుడు హనుమంతరావు, పాలేరు రామకృష్ణ, జరుగుల శ్రీను, బీజేపీ నాయకులు నల్లూరి కృష్ణయ్య, వెనిగండ్ల వెంకటేశ్వర్లు, వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

రేపే ఎమ్మెల్యే ఏలూరి నామినేషన్

భారీగా తరలిరావాలని శ్రేణులకు పిలుపు

పర్చూరు, ఏప్రిల్ 20 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారని శనివారం ఏలూరి క్యాంప్ కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా మార్టూరు, గన్నవరం, రోడ్డులోని వినాయక స్వామి ఆలయంలో ఏలూరి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం దండుదోవ మీదుగా ఎనమదుల అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అక్కడి నుంచి యద్దనపూడి మీదుగా జాగర్లమూడిలో మహంకాళీ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తారన్నారు. అనంతరం పెద్దివారిపాలెం అంజనేయస్వామి విగ్రహం, చర్చిలలో ప్రార్థనలు చేసి అక్కడి నుంచి కొల్లావారిపాలెం మీదుగా పర్చూరుకు చేరుకుంటారన్నారు. బొమ్మల సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. అనంతరం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీకి టీడీపీ, జనసేన, బీజేసీ నాయకులు కార్యకర్తలు, ఏలూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి.. కారంచేడులో కేక్ కట్ చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

చినగంజాం, ఏప్రిల్ 20 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజును శనివారం ఘనంగా నిర్వహించారు. బాబు పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో సోపిరాల గ్రామంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య కేకు కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు అబ్దుల్ కలాం అజాద్, చెరుకూరి రాఘవయ్య, కొండ్రగుంట శ్రీహరి, టీ.జయరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, వి.పార్థసారిధి, గంటా చెన్నయ్య, వాటుపల్లి ఏడుకొండలు, షేక్ సలాం, బడుగు సామ్యేలు, షేక్ నబీషా, షేక్ జిలానీ, టి.చిన్నా, వీ.శ్రీనివాసరావు, జి.నరసింహారావు, గోపాలం, జీవీ నారాయణ, గంటా లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, శిఖరం సూరిబాబు పాల్గొన్నారు.

జేవీపాలెంలో..

పంగులూరు : మండలంలోని జాగర్లమూడివారిపలెం గ్రామంలో శనివారం మాజీ సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకను ఘనంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, తెలగతోటి రాధాకృష్ణ, హరిబాబు పలువురు నేతలు పాల్గొన్నారు.

ఏలూరి క్యాంపు కార్యాలయంలో

మార్టూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు కేక్ కట్ చేసి బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయేది చంద్రబాబు పాలన అని, కూటమితో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని దేవున్ని ప్రార్థించారు. చంద్రబాబు నిండు నూరేళ్ల ఆయురారోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. అదేవిధంగా రాత్రి మార్టూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వలపర్ల గ్రామంలో ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు, గంవెంకటేశ్వర్లు, సుబ్బారావు, షేక్ బషీర్, సలాం, శంకర్, యలగా రామాంజనేయులు పాల్గొన్నారు.

కారంచేడులో..

కారంచేడు(పర్చూరు) : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. కారంచేడులోని పార్టీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరులో..

చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా పర్చూరులో మి ఠాయిలు పంచిపెట్టి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో కాకాని వీరయ్య చౌదరి, హైటెక్ సుభానీ, పఠాన్ బాజీ, అల్లం శ్రీను పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు శనివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యాంసుందర్, వీరగంధం ఆంజనేయులు, పాలేరు రామకృష్ణ, వలేరు మార్క్, శివాజీ, రావి అంకమ్మ,కందిమళ్ల బిందుమాధవి పాల్గొన్నారు.

అద్దంకి టౌన్‌లో..

అద్దంకిటౌన్ : మాజీ సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుయువత అధ్యక్షుడు వడ్లవల్లి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్, టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దివ్యాంగ బాలునికి కేక్ తినిపిస్తున్న గొట్టిపాటి

విజనున్న నేత చంద్రబాబు

టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే ప్రగతి సాధ్యమని, చంద్రబాబు ఎంతో విజన్ ఉన్న నేత అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని రామకూరు గ్రామ ఎస్టీ కాలనీలో శనివారం నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలో గొట్టిపాటి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సుజాత కేట్ కట్ చేయగా, దివ్యాంగ బాలునికి గొట్టిపాటి కేక్ తినిపించారు. ఈ సందర్భంగా గ్రామ నేతలతో ప్రజా సమస్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటు తథ్యమన్నారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. అనంతరం గొట్టిపాటి గ్రామంలో జరిగిన పలు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడవల్లి అశోక్, మాజీ సర్పంచ్‌లు మానం సుబ్బారావు, తొట్టెంపూడి చంద్రశేఖర్, గ్రామ పార్టీ అద్యక్షులు మానం వెంకటరావు పాల్గొన్నారు.

బోసుమృతికి నివాళి : మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన కొప్పోలు బోసు (80) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గొట్టిపాటి శనివారం చందలూరులో బోసు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్

టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలి

యువనేత కమల్‌కిషోర్ ఇంటింటి ప్రచారం

బల్లికురవ, ఏప్రిల్ 20 : రానున్న ఎన్నికలలో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమల్ కిషోర్ (బాబీ) కోరారు. శనివారం మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా దెబ్బతిన్నారన్నారు. రాష్ట్రంలో కంపెనీలు రాక, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు పెరిగిపోయారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే బాబు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అమరనేని కాశీయ్య, దేవినేని నరేంద్ర, అమరనేని భాస్కర్‌రావు, వినోద్ పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో జగన్ వంచన

టీడీపీ యువ నాయకుడు హర్షవర్ధన్


తంగేడుమల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు, ఏప్రిల్ 20 : జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో జనాన్ని వంచించారని టీడీపీ యువ నాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ఆరోపించారు. మండలంలోని తంగేడుమల్లి గ్రామంలో శనివారం ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కి మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్‌రెడ్డి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 2.30లక్షల ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి మాటిచ్చి మడమ తిప్పారన్నారు. రాష్ట్రంలో ఉన్న కంపెనీలను భయపెట్టి బయటకు పంపించి, కొత్త వాటిని తీసుకురాకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోయిందన్నారు. యువతను, రైతులను, ప్రజలను నిలువునా వంచించారన్నారు. మద్యాన్ని నిషేధిస్తానని చెప్పి మహిళలను మోసగించారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. ఒకపక్క అభివృద్ధి.. మరోపక్క పేదల సంక్షేమానికి సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతోపాటు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన మహిళలకు రూ.1500 అందజేస్తారని, బాలికలకు చదువుకు రూ.15వేలను అందజేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రగతి, ప్రజలందరూ ఆనందంగా జీవించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గాడిపర్తి వెంకట్రావు, అట్లా చినవెంకటరెడ్డి, ఏసోబు, రమేష్, చేవూరి వాసిరెడ్డి, ఏడుకొండలు, చింతా రామారావు, శ్రీరామమూర్తి, మాదాల సుబ్బారావు, వసంత వేణుబాబు, కోటేశ్వరరావు, కొం డలు, సుజాత, కొణికి గోవిందమ్మ, కృష్ణ, రామాంజి, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్డే వేయని వైసీపీ

- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్మాణం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


ఉప్పలపాడులో ప్రచారం చేస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 20 : ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ గ్రామంలోనూ రోడ్లు వేసిన దాఖలాలు లేవని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులు ఎదురువెళ్లి రవికుమార్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన గొట్టిపాటి చంద్రబాబు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కనీసం రహదారులు బాగులేక ప్రజలు అల్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో రోడ్లు వేయిస్తామన్నారు. గతంలో మేము చేసిన అభివృద్ధే తప్ప ఎక్కడా పనులు జరగలేదన్నారు. ఇంకా గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్ని విధాలా నాశనమైన రాష్ట్రం గాడిలో పడాలంటే సమర్థుడైన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అభివృద్ధి చేతగాని అసమర్థ జగన్‌రెడ్డి కరెంట్ చార్జీలను 9 సార్లు, అనేక రకాల పన్నులను పెంచడంలో దిట్ట అన్నారు. ఉప్పలపాడులో రూ.15 కోట్ల 56 లక్షలతో మంజూరు చేయించిన ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి ఐదేళ్లయినా పనులు చేపట్టలేదన్నారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ పథకం పూర్తయితే ఆయకట్టు కింద మైలవరం, ఉప్పలపాడు గ్రామాల్లో 2,500 ఎకరాలకు సాగునీరు అంది సస్యశామలంగా ఉండేదన్నారు. వ్యవసాయ రంగానికి టీడీపీ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చిందని, ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు అంకితం చేస్తామన్నారు. అన్నీ సక్రమంగా సాగాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి ఎంపీగా కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు అన్నబత్తిన సుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, నీలం ప్రసా ద్, కటికాల సత్యనారాయణ, శ్రీనివాసరావు, బైరపునేని రామలింగయ్య, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆదరించండి.. బాధ్యతగా పనిచేస్తా

- టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య
- వైసీపీని వీడిన పలు కుటుంబాలు


పార్టీలో చేరిన వాడరేవు, కీర్తివారిపాలెంవారితో కొండయ్య

చీరాల, ఏప్రిల్ 20 : సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఆదరించండి. బాధ్యతగా పనిచేస్తానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని వాడరేవు, కీర్తివారిపాలెంకు చెందిన పలువురు కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ జగన్ అరాచకాలకు అంతం పలికేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న అరాచకపాలనపై మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో రూపాయి ఇచ్చి దొడ్డిదారిన రూ.10 దోచుకుంటున్నారన్నారన్నారు. ఇలాంటి నియంత పాలకులను ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. అందుకు ఓటును వజ్రాయుధంగా ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీలో చేరినవారికి గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని కొండయ్య హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండయ్య గెలుపునకు కృషి చేస్తాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని టీడీపీ గల్ఫ్ కంట్రీస్ కోఆర్డినేటర్ వెంకట అప్పారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం గల్ఫ్ కంట్రీస్ ప్రతినిధులు ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యను కలిసి సంఘీభావం తెలిపారు. భవిష్యత్ కార్యాచరణలో తమ వంతు భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వారు మహా స్వాప్నికుడు అనే పుస్తకాన్ని కొండయ్యకు బహూకరించారు.

మన ప్రతి అడుగు గెలుపు వైపే ఉండాలి

టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ప్రతి అడుగు గెలుపు దిశగా ఉండాలని, చీరాలలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య అన్నారు. పట్టణ పరిధిలోని ఎల్‌బీఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కొండయ్య పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ముఖమండపానికి రూ.లక్ష విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 20 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ముఖ మండపం నిర్మాణానికి దాతలు తమవంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ప్రకాశం జిల్లా పొదిలి మండలం, తలమళ్ల గ్రామానికి చెందిన తెల్లమెఖల శ్రీనివాసులు, భార్య శివకుమారి దంపతులు 100116 రూపాయలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో రోజు 3 నామినేషన్లు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 20 : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అద్దంకి నియోజకవర్గం నుంచి పలు పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యరులలో పలువురు శనివారం నామినేషన్లు వేశారు. ఆర్వో టీవీ సునీల్‌కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా మందా జోసప్, పైరామిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి గుమ్మ సాంబశివరావు నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి నియోజకవర్గ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు డమ్మీ నామినేస్‌ను ఆర్వోకు శనివారం అందజేశారు.


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న సీఐ శేషగిరిరావు

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

200 బాటిళ్లు స్వాధీనం

చీరాలటౌన్, ఏప్రిల్ 20 : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని శనివారం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జాండ్రపేటకు చెందిన సలగల జాన్సన్, దక్కుమళ్ల కల్యాణ్‌బాబు స్కూటీపై 200 క్వార్టర్ మద్యం సీసాలను తరలిస్తున్నారు. దీంతో సమాచారం అందుకున్న సీఐ సిబ్బందితో దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి వద్ద ప్రవేశపెడుతున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 20 : శ్రీనివాసకాలనీలోని విజయగణపతి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణం అనంతరం, మూడో రోజు ఏకాంతసేవ ప్రత్యేక పూజలకు భక్తుల ఆహ్వానం మేరకు వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, గీత దంపతులు హాజరయ్యారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సత్యం, భారత్ ఇండస్ట్రీస్ అధినేత కొత్తమాసు పూర్ణ, సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, ఉపాధ్యాయులు శ్రవణం రెడ్డి, హరీష్, శ్యామ్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

మార్టూరు, ఏప్రిల్ 20 : రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారిస్ జయంతి శుక్రవారం రాత్రి ఎఫర్ట్ కార్యాలయంలో రోటరీ సభ్యులు 13 మంది మహిళా పారిశుధ్యకార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. తొలుత పాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి సాంబ శివరావు, జాష్టి సాంబ శివరావు, ఆంజనేయులు, షేక్ కాజా హుస్సేన్, రావి అంకమ్మ చౌదరి, సాంబశివరావు, అంజిబాబు పాల్గొన్నారు.

19 మంది వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 20 : మండలంలోని మార్టూరు గ్రామానికి చెందిన 13 మంది, రాజుపాలెంకు చెందిన 6గురు వలంటీర్లు శనివారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. దాంతో మండలంలో రాజీనామాలు చేసిన వలంటీర్లు సంఖ్య 181కి చేరింది. మండలంలో 368 మంది ఉండగా 181 మంది రాజీనామా చేశారు.

కూకట్లపల్లిలో యువకుడి ఆత్మహత్య


బల్లికురవ, ఏప్రిల్ 20 : మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో శనివారం ఇప్పల సుబ్బారెడ్డి(35) యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుబ్బారెడ్డి భార్య ఇంట్లో లేని సమయంలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అప్పులు బాధలు భరించలేకే ఆత్మహత్య చేసుకొని ఉంటారని అంటుండగా, కొందరు కుటుంబ కలహాలవల్లని కొందరు అంటున్నారు.

మాయమాటలతో బంగారు వస్తువుల అపహరణ

ఇంకొల్లు, ఏప్రిల్ 20 : ఇంకొల్లులో ఇద్దరు వ్యక్తులు శని దోష పూజలు చేస్తామని మహిళకు మాయమాటలు చెప్పి, బంగారు వస్తువులను అపహరించారు. వివరాల్లోకి వెళితే.. యడవల్లి సాహిత్య ప్రైవేటు కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు.వారి తల్లిదండ్రులు పనులకు వెళ్లగా, సాహిత్య ఒంటరిగా ఉన్న సమయంలో కాషాయ దుస్తులు ధరించి వచ్చిన ఇద్దరు శనిదోషం ఉందని పూజలు మొదలు పెట్టారు. ఒంటిమీద బంగారు వస్తువులన్నీ తీసి పసుపులో పెట్టాలని సూచించారు. సాయంత్రం అందులోనే ఉంచాలని కోరారు. ఆమెను 108 బియ్యం గింజలు లెక్కించాలని చెప్పి బంగారు ఉంగరం, చెవి దిద్దులతో పారిపోయినట్లు సాహిత్య ఇంకొల్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.

జూదరుల అరెస్ట్

పంగులూరు, ఏప్రిల్ 20 : మండలంలోని బూదవాడ గ్రామ ఎస్సీ కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఎస్ఐ తిరుపతిరావు తన సిబ్బందితో బూదవాడ ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,920 నగదును స్వాధీనం చేసుకున్నారు.



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	40.3	38.0	43.0	43.0	38.0
కనిష్ఠం	28.2	28.0	28.0	28.0	28.0

సోమశిలలో 8.472 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి ప్రాజెక్టులో 8.472 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 15, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

గర్జించిన సర్వేపల్లి

ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ ● జనవాహినితో కిక్కిరిసిన పొదలకూరు

'కేజీఎఫ్-1, కేజీఎఫ్-2ను చూశాను. ఎందుకంటే కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కుప్పం నియోజకవర్గం పక్కనే ఉంటాయి. కానీ కేజీఎఫ్-3 (కాకాణి గోవర్ధన్ ఫీల్డ్స్) చూడాలంటే సర్వేపల్లికి రావాలి. క్వార్ట్జ్, ఇసుక, గ్రావెల్, సిలికా అక్రమంగా తరలించి రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఒక్క క్వార్ట్జ్ లోనే రూ.4వేల కోట్లు దోచుకున్నారు. ఈ కోట్లు వింటుంటే కళ్లు తిరుగుతున్నాయి. రాష్ట్రాన్ని ఇప్పటి వరకు ఐదుగురు వ్యక్తులు జగన్‌రెడ్డి, విజయసాయి రెడ్డి, సజ్జల, పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి దోచుకుంటే ఇప్పుడు ఆరో వ్యక్తి కాకాణి వారికి తోడయ్యారు. ఈ అవినీతి సొమ్ముతో కాకాణి ఓటుకు రూ.10 వేలు ఇస్తారు. పూటుగా మద్యం తాగిస్తారు.. బెదిరిస్తారు.. లొంగదీసుకుంటారు.. పొరపాటున మళ్లీ లొంగితే జీవితం చీకటిమయం అవుతుంది. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే మీ ఆస్తులు లాక్కుంటారు. అందరూ వైసీపీ అరాచకాలను ధైర్యంగా ఎదుర్కోండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'

- తెలుగుదేశం పార్టీ అధినేత
నారా చంద్రబాబు నాయుడు

పొదలకూరు (ఆంధ్రజ్యోతి) : ఎటు చూసినా జనం.. కిక్కిరిసిపోయిన రోడ్లు.. అరుపులు, కేకలు, నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలు.. పొదలకూరులోని గేట్ సెంటర్‌లో శనివారం కనిపించిన దృశ్యాలివి. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వ హించిన ప్రజాగళం ఎన్నికల ప్రచార సభ సూపర్ సక్సెస్ అయ్యింది. మంత్రి కాకాణి సొంత మండలం కావడంతో పరిస్థితి ఎలా ఉంటుందా!? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూడగా సాయంత్రం నాలుగు గంటలకు సభ ప్రారంభమయ్యే నాటికి భారీ జనసందోహంతో రోడ్లన్నీ నిండిపోయాయి. అటు చంద్రబాబు, ఇటు సోమిరెడ్డి ప్రసంగాల సమయంలో కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు. 'నలభై ఏళ్లుగా సర్వేపల్లి ప్రజల కోసమే జీవిస్తున్నా.. ఈసారి నన్ను తలెత్తుకునేలా చేయండి' అంటూ సోమిరెడ్డి భావోద్వేగంతో ప్రసంగించగా సభకు వచ్చిన వారంతా 'మేమున్నాం.. మేమున్నాం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడం విశేషం. ప్రజలు, కార్యకర్తల ఉత్సాహాన్ని చూసిన చంద్రబాబు ఎప్పటిలాగా కాకుండా రెట్టించిన ఉత్సాహంతో ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలు, కార్యకర్తల చేతనే చెప్పించడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. చంద్రబాబు ప్రసంగానికి సభకు వచ్చిన వారు చేతులతో సంకేతాలిస్తూ, ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ తమ మద్దతు తెలియజేశారు. 'కోర్టు దొంగ కాకాణి.. ఈ విషయం మరిచిపోయారు..' అంటూ సభకు వచ్చిన వారు పెద్ద ఎత్తున అరుస్తూ చంద్రబాబుకు గుర్తు చేయడంతో ఆయన ఆ విషయంపై మాట్లాడారు. కోర్టు దొంగను వదిలే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. సన్న బియ్యం ఇస్తానన్న సన్నాసి జగన్ కాదా.. అని చంద్రబాబు ప్రశ్నించగా ఆ సన్నాసి ఇవ్వలేదంటూ కింది నుంచి పెద్ద ఎత్తున సమాధానాలు వచ్చాయి. కరెంటు బిల్లులు ఎన్నిసార్లు పెరిగాయంటూ చంద్రబాబు ప్రశ్నించగా ఎనిమిది సార్లు అంటూ ప్రజలే గట్టిగా అరుస్తూ చెప్పడం నాయకులకు ఆశ్చర్యాన్ని కలిగిచింది. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎవరిదంటూ చంద్రబాబు ప్రశ్నించగా.. మాదే, మాదే అంటూ ప్రజలు గట్టిగా సమాధానమిచ్చారు. తన సర్వేలో సోమిరెడ్డి గ్రాఫ్ పెరిగిందని, సర్వేపల్లిలో తెలుగుదేశానికి బ్రహ్మాండంగా ఉందని చంద్రబాబు చెప్పడంతో సభకు వచ్చిన వారంతా గట్టిగా చప్పట్లు కొట్టి కేరింతలు వేశారు.

తలెత్తుకునేలా చేయండి



నాలుగు సార్లు ఓడిపోయినా మన నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు మళ్లీ నాకు చంద్రబాబు టికెట్ ఇచ్చారు. ఈసారి ఎన్నికల్లో సగర్వంగా తలెత్తుకునేలా ఆశీర్వదించాలి. సర్వేపల్లిలో కాకాణి బెదిరింపులకు భయపడకుండా ప్రజలు కట్టలు తెంచుకుని వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నారు. ఇప్పటివరకు 3771 కుటుంబాలు, 12వేల మంది జనాభా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసారి ఎన్నికల్లో భారీ మెజారిటీతో నన్ను గెలిపిస్తే బతికినంతకాలం సర్వేపల్లికి, రాష్ట్రానికి సేవచేస్తా. నిద్రాహారాలు మాని రాష్ట్ర భవిష్యత్తు కోసం పేదలను ధనవంతులుగా చేయాలన్న లక్ష్యం కోసం పనిచేసే ఎన్డీఏ కూటమిని ఆదరించాలి.

- సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి

రాజకీయ తోడేలును తరిమేద్దాం




రాష్ట్రంలో జగన్ సీఎంగా ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం ఉండదు. ఐఏఎస్ అధికారిగా నా 30ఏళ్ల సర్వీసులో ఇలాంటి నిరంకుశ అవినీతిపాలనను చూడలేదు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి సొంత ఆస్తులను పెంచుకుని రాజకీయాన్ని ఒక వ్యాపారంగా మార్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని ఆదరిస్తే డబుల్ ఇంజన్‌తో పని చేస్తాము. రాజకీయ తోడేలును రాష్ట్రం నుంచి తరిమేసి సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించే ఉమ్మడి కూటమిని ఆదరించాలి.

- తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్




రాజగోపాల్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న చంద్రబాబు





మళ్లీ లొంగితే జీవితం చీకటే!

పొదలకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : శనివారం సాయంత్రం మధ్యాహ్నం 4:00 గంటలకు పొదలకూరుకు చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ముఖ్య నేతలంతా పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం గేట్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. ముందుగా చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. టీడీపీ నేతలంతా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. సర్వేపల్లిలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం తన అదృష్టమని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

● సహజ వనరులే సమాధి కడతాయి

'క్వార్ట్జ్, ఇసుక, గ్రావెల్, సిలికా అవినీతిలో కాకాణి కూరుకుపోయారు. మళ్లీ పైకి వచ్చే అవకాశమే లేదు. కాకాణి దోచిన సహజ వనరులే ఆయనకు రాజకీయ సమాధి కడతాయి. ఒక అసమర్థ మంత్రి సర్వేపల్లి నుంచి ఉండడం ప్రజలు చేసుకున్న ఖర్మ. మంత్రి దోపిడీ మూలంగా కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలిపోయింది. దాని మూలంగా పది వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోరాడి పోరాడి బక్కచిక్కిపోతే కాకాణి దోచుకొని దోచుకొని పెరిగిపోయారు. కరోనా వంటి విపత్కర సమయంలో ప్రజల పేరుతో డబ్బులు వసూలు చేసి కరోనా ప్యాలెస్ కట్టుకున్న వ్యక్తి కాకాణి. ఆయన అవినీతిపై పోరాడిన సోమిరెడ్డిపై 22 కేసులు పెట్టారు. కార్యకర్తలు, ప్రజలపైనా కేసులు పెట్టారు. తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాలు అధికారంలోకి ఉంది. నేను 14 ఏళ్లు సీఎంగా ఉన్నాను. నేను కూడా ఇలా చేసి ఉంటే వైసీపీ నాయకులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చే వాళ్లా!? ప్రజలు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదలను. చక్రవడ్డీతో సహా చెల్లిస్తా.


చంద్రబాబుకు చిత్రపటం అందజేస్తున్న మేకపాటి చంద్రశేఖరరెడ్డి, శాంతమ్మ దంపతులు

● సర్వేపల్లి గ్రాఫ్ పెరుగుతోంది

నేను ఐవీఆర్ఎస్ సర్వే చేస్తే సర్వేపల్లిలో సోమిరెడ్డి ఒక్కరే ఢీకొంటారని కార్యకర్తలు చెప్పారు. మీ మీద నమ్మకంతో సోమిరెడ్డికి సీటు ఇచ్చి నా బాధ్యత నెరవేర్చుకున్నా. ఇక సోమిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. చంద్రమోహన్‌రెడ్డి వద్ద డబ్బుల్లేవు. నాలుగుసార్లు ఓడిపోయినా ప్రజా సమస్యలపై పోరాడి మళ్లీ మీ ముందుకు వస్తున్నారు. ఐఏఎస్ అధికారిగా పని చేసిన వరప్రసాద్ తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్నారు. వీరిద్దరినీ గెలిపించండి. సర్వేపల్లిలో గ్రాఫ్ పెరుగుతోంది. విజయంపై నాకు నమ్మకం ఏర్పడింది.

● అధికారంలోకి రాగానే..

టీడీపీ అధికారంలోకి రాగానే ముత్తుకూరులో క్రికెట్ మినీ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. పొదలకూరులో నిమ్మ రైతులను ఆదుకుంటాం. కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్ అవసరమని నిమ్మ రైతులు అడిగారు.. అవి కూడా నిర్మిస్తాం. కృష్ణపట్నం పోర్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు రూ.15 లక్షల పరిహారం చెల్లిస్తాం. బండేపల్లి-డేగపూడి కాలువను పూర్తి చేస్తాం. తెలుగుగంగ కాలువల పెండింగ్ పనులు పూర్తి చేసే బాధ్యత నేను తీసుకుంటా' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ సభలో టీడీపీ నాయకులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఆనం వెంకట్రమణారెడ్డి, సోమిరెడ్డి తనయుడు రాజగోపాల్‌రెడ్డి, కోడలు శ్రుతిరెడ్డి పాల్గొన్నారు.

ఇదిగో మద్యం డంప్!


మద్యం సీసాల బస్తాలతో ఉన్న కారు



రొయ్యల చెరువు వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం బస్తాలు

ముత్తుకూరు, ఏప్రిల్ 20 : పంటపాలెం పంచాయతీలో మద్యం నిల్వ చేసిన స్థావరాలపై శనివారం ప్రత్యేక బృందం దాడులు చేసి సుమారు 4,232 మద్యం సీసాలు, మూడు కార్లను స్వాధీనం చేసుకుంది. వైసీపీ నాయకుడు సుధాకర్ రెడ్డితో పాటు ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకుంది. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు పంటపాలెంకు చెందిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అను చరుడు మారు సుధాకర్ రెడ్డి ఇంటిపై సెబ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం దాడులు నిర్వహించింది. ఇదే సమయంలో తన సొంత వాహనాలలో గోతాలలో మద్యం సీసాలను నింపి బయటికి పంపించేశారు. దీంతో అప్రమత్తమైన అధికారులు వాహనాలను వెంబడించగా పంటపాలెం గ్రామానికి 2 కి.మీ దూరంలో ఉన్న ఆయిల్ డబ్బాల తయారీ కేంద్రం వద్ద పట్టుకున్నారు. అందులో ఉన్న ఏడు బస్తాల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పంటపాలెం గ్రామాన్ని ఎస్పీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు, ఎస్ఈబీ అధికారులు జల్లెడ పట్టారు. వాహనాల జాడలను గుర్తించి, నక్కల కాలువ సమీపంలో మారు శ్రీనివాసులురెడ్డి రొయ్యల చెరువుల వద్ద అక్రమంగా నిల్వ చేసిన 13 గోతాముల్లోని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాస్థాయి అధికారులు వచ్చే వివరాలు వెల్లడించలేమని ఎస్ఈబీ శ్రీనివాసులు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో తొలిసారిగా భారీస్థాయిలో మద్యం స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

3వ రోజు.. 9 నామినేషన్లు

నెల్లూరు(హరనాథపురం) : ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో 3వ రోజు శనివారం జిల్లావ్యాప్తంగా 9 సెట్ల నామినేషన్లు దాఖలు అయ్యాయి. నెల్లూరు లోక్‌సభ స్థానానికి ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కందుకూరు కావలి, కోవూరు, నెల్లూరుసిటీ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవవర్గాలకు 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కందుకూరులో జయభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పొడపాటి శివకుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా అక్కిలగుంట ఇషాక్‌లు తమ నామినేషన్ పత్రాలను ఆర్వో విద్యాధరికి అందచేశారు. నెల్లూరు సిటీ నుంచి సోషల్ డెమెక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా షేక్ అమీర్ అహ్మద్ నామినేషన్ పత్రాన్ని ఆర్వో వికాస్‌మర్మత్‌కు అందచేశారు. కాగా ఈ మూడు రోజుల్లో ఏడు సెగ్మెంట్లకు 23 మంది, ఎంపీ స్థానానికి ఇద్దరు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

కావలి కందుకూరు

నేడు చుండి మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

వలేటివారిపాలెం, ఏప్రిల్ 20 : మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఉదయం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. మొత్తం 125 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.



ఉలవపాడు : ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నేతలు



లింగసముద్రం : కరపత్రాలు పంపిణీ చేస్తున్న...

ఇంటింటా టీడీపీ నేతల ప్రచారం

కొండాపురం, ఏప్రిల్ 20 : మండలంలోని ఉప్పలూరు పంచాయతీ కొత్త ఉప్పలూరులో టీడీపీ నాయకులు ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను ఆశీర్వదించాలంటూ స్థానిక నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల కర పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కుంకు జయమ్మ, సర్పంచు వల్లేటి కొండలరావు, యూనిట్ ఇన్‌చార్జి కుమ్మరి వెంకటరావు, పరిశీలకులు కె.సుబ్బారావు, యారవ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం : ఇంటింటి ప్రచారంలో మహిళలు

ఉలవపాడు : ఉలవపాడు హైస్కూల్ సంఘంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. జగన్ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు పెంపును వివరిస్తూ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను గెలిపించి తద్వారా చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

లింగసముద్రం : రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తేనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతితో పాటు, ఉపాధి అవకాశాలు దక్కుతాయని తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, మాజీ ఎంపీపీ పి బాలకోటయ్యలు చెప్పారు. లింగసముద్రంలో టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలంకి ప్రసాద్, ఎలిపాటి శ్రీను, జంపాల శివప్రసాద్, కమ్మిశెట్టి శ్రీనివాసులు, అంద్రా హరి, ఎం రవికుమార్, పి మాల్యాద్రి కె మహేష్, కోనూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జేబీ చరిత్ర గొప్పది : డీఎంహెచ్‌వో

కావలిటౌన్, ఏప్రిల్ 20: జవహర్ భారతి కళాశాల చరిత్ర చాలా గొప్పదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం జేబీ డిగ్రీ కళాశాల ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్ మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన క్రీడా దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభావంతులైన క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ తాను జేబీ పూర్వ విద్యార్థినైనందుకు గర్వపడుతున్నానన్నారు. జేబీ కళాశాలను తలచుకున్నా సందర్శించినా హృదయం పులకరిస్తుందని, విద్యార్థి దశలో జ్ఞాపకాలు గుర్తుకొస్తాయన్నారు. విశ్వోదయ వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) క్రీడలకు ప్రాముఖ్యతనిచ్చేవారన్నారు. అన్ని రోగాలకు వైద్యం వ్యాయామని, క్రీడాకారులు శారీరక దృఢత్వంతోపాటు మానసిక దృఢత్వం కలిగి ఉంటే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పెంచలయ్య, పూర్వ పీడీ కోటేశ్వరమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజగోపాల్, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, పీడీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



రాంప్రసాద్‌కు కండువా వేస్తున్న చంద్రబాబునాయుడు

చంద్రబాబు సమక్షంలో
టీడీపీలో చేరిన నాయుడు రాంప్రసాద్

కావలి, ఏప్రిల్ 20: రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ నాయుడు రాంప్రసాద్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి శనివారం ఉదయం రాజీనామా చేసిన జిల్లాలోని పొదలకూరులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును కలిశారు. వెంటనే బాబు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండిన నాయుడు రాంప్రసాద్ గత ఎన్నికల్లో వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి టీడీపీనేత పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

మంచి విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు



అల్లూరు : భారీ కేక్ కట్ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డి, బీద గిరిధర్, తదితరులు



వలేటివారిపాలెం : టీడీపీ కార్యాలయంలో...

● అట్టహాసంగా జన్మదిన వేడుకలు

అల్లూరు, ఏప్రిల్ 20 : మంచి విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని, ఇటువంటి నాయకులు అరుదుగా ఉంటారని, మన రాష్ట్రానికి ఉండడం అదృష్టంగా భావించాలని కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని శింగపేటలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం స్థానిక నేత బండి అమర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, బండి అమర్‌రెడ్డి, జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ సుందరరామిరెడ్డిలతో కలసి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పావనబోయిన రత్తయ్య, అరగల రమణయ్య, బండి శ్రీనివాసులు రెడ్డి, ఆట తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయు డు జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం అట్టహాసంగా జరుపుకున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి నేతలకు తినిపించారు. సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరోసారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శప్రాయంగా, జనరంజకంగా పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పరిటాల భాస్కర్‌రావు, నాయకులు కాకుమాను అంజనేయులు, వలే టి నరసింహం, వలేటి శ్రీధర్‌నాయుడు, కొంకా రమేష్, కాకుమాను హర్షకుమార్, వీరమోసు అంజయ్య, గుత్తా కొండయ్య, వలేటి మధుసూదన్‌రావు కాకుమాను మాల్యాద్రి, మీసాల మాల్యాద్రి, బూదాల మాదవరావు, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ ఎం.ఓంకారం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీని గెలిపించుకొని చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి సుబ్బారావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.మల్లికార్జున, నాయకులు యారవ కృష్ణయ్య, పోలినేని రమేష్, చెరుకూరి వెంకటాద్రి, పి.చంద్రబాబునాయుడు, ఎన్.శివన్నారాయణ, డి.అశోక్, బి.మాచర్ల, తిమోతి, అల్లిక మధు, వి.వెంకటేశ్వర్లు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు మండల పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు జిందాబాద్ అంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగసముద్రం : నారా చంద్రబాబునాయు డు జన్మదిన వేడుకలు టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పలువురు నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుళ్లా సుధాకర్, పి మాల్యాద్రి, దేవకి సుబ్రహ్మణ్యం, పి బాలకోటయ్య, సీహెచ్ బాలకోటయ్య, కండే మాలకొండయ్య, ఎన్ నారాయణ, ఎ నర్సయ్య, జంపాల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం : సంబరాల్లో టీడీపీ నేతలు



కొండాపురం : కేక్ తినిపించుకుంటున్న నాయకులు

23న ఇంటూరి నామినేషన్



మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 20 : కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఈనెల 23వ తేదీదిన నామినేషన్ వేయనున్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఇంటూరి మాట్లాడతు చంద్రబాబు నాయుడు, లోకేష్‌బాబు ఆశీస్సులతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేస్తానని తెలిపారు. మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి, కందుకూరు ప్రజల ఇలవేల్పు అంకమ్మ దీవెనలు, నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలు తనకు ఉన్నాయన్నారు.

టీడీపీలో చేరికలు

మండలంలోని పెంట్రాల పంచాయతీ చీమలపెంటకు చెందిన ముత్తులూరి సుధాకర్, గంగినేని మధుసూదనరావు ఆధ్వర్యంలో వైసీపీ నేతలు గుడిపూడి వెంకటేశ్వర్లు, గుడిపూడి తిరుపతయ్య కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఇంటూరి నాగేశ్వరరావు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు.

మాజీ ఎమ్మెల్యే పోతులను కలిసిన ఇంటూరి

కందుకూరు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శనివారం మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుని తన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 23వ తేదీన నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలు, సలహాలు, సూచనలు ఇచ్చారు.

మాలకొండ ఆదాయం రూ.7,72,049

వలేటివారిపాలెం, ఏప్రిల్ 20 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.7,72,049 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ. శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ.5,700, కుంకుమార్చన ద్వారా రూ.18,880, వివాహములకు రూ.3 వేలు, తలనీలాల సమర్పణకు రూ.37,775, వాహన పూజలు ద్వారా రూ.3,380, ప్రత్యేక దర్శనానికి రూ.2,00,100, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 820, రూము అద్దెలు ద్వారా రూ. 33,200, కవర్ల విక్రయం రూ.5,400, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,04,200, అన్నదానం ద్వారా రూ. 2,44,478, విరాళముల ద్వారా రూ. 15,116 ఆదాయం లభించినట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహుడి సేవలో ఎమ్మెల్సీ మాధవరావు

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. మాధవరావుకు ఆలయ అధికారులు ఆలయ సకల మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రధా న ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు మాధవరావుకు శాలువా, పూలమాలతో సత్కరించారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన

కావలి రూరల్, ఏప్రిల్ 20: కావలి అగ్నిమాపక కేంద్రం ఆవరణలో శనివారం విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అగ్నిమాపక కేంద్రం అధికారి జి.రామసిద్ధార్థ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుని అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు 101, 08626 243101, 9963734286ను సంప్రదించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న రామసిద్ధార్థ

అభివృద్ధి చేస్తారని గెలిపిస్తే దోచుకుతిన్నారు!

● టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 20 : అభివృద్ధి చేస్తారని రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే దొరికినకాడికి దోచుకు తిన్నాడని టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని బట్రకాగొల్లు, నార్తుఆములూరు, బీరంగుంట, సింగపేట గ్రామాల్లో ఆయన నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలసి రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నార్తుఆములూరు, నార్తుమోపూరు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం నిధులు మంజూరు చేయించి బీద రవిచంద్ర రైతులకు మేలు చేకూర్చాలని ప్రయత్నిస్తే ప్రతాప్ కుమార్‌రెడ్డి గెలిచి ఈ గ్రామ రైతులకు శాపంగా మారిందన్నారు. గ్రావెల్ అమ్ముకొని రూ.కోట్లు సంపాదించుకున్న వ్యక్తి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీడీపీ రైతులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తే దోచుకునేందుకు వైసీపీ సిద్ధపడిందన్నారు. గత ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి కోడికత్తి డ్రామాతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాడని మరలా అదే పంథా కొనసాగించేలా నేడు గులకరాయి కారణాన్ని చూపిస్తున్నాడన్నారు. జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా తనను, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి అమర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గుంజి రుద్రయ్య, పెయ్యల భాస్కర్, దాసరి ప్రభాకర్, శ్రీనివాసులు, అరగల రమణయ్య, రామకృష్ణారెడ్డి, కప్పిరి విష్ణు, బండి శ్రీనివాసులు రెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురు చేరిక

బిట్రగుంట : బోగోలు పంచాయతీ అరవపాళెంకు చెందిన మాజీ సర్పంచు ప్యాట్రిక్ ఆధ్వర్యంలో కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డికి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిచారు. అనంతరం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నాగేశ్వరావు, మధుబాబు నాయుడు, సుధీర్ బాబు, వెంకటేశ్వర్లుయాదవ్, బీ.యోహాన్, అంజయ్యయాదవ్, శ్రీనివాసులు యాదవ్, ఎంఏ రవి తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న మాజీ సర్పంచు ప్యాట్రిక్

జనసేన నాయకుల ఘర్షణ

కావలి రూరల్, ఏప్రిల్ 20: కావలి పట్టణం అరుంధతీయ వాడలో శనివారం జనసేన నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. 1వ పట్టణ పోలీసులు, బాధితుల వివరాల మేరకు... పట్టణంలోని అరుంధతీయవాడ జనసేన నాయకుడు మంద శ్రీనివాసులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అలహరి సుధాకర్‌తో కలసి ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న స్థానిక జనసేన నాయకుడు చేవూరి నాయబ్ తనకు చెప్పకుండా నా ఏరియాలో ప్రచారానికి ఎలా వస్తారని గొడవ పెట్టుకుని అక్కడ ఉన్న అల శ్రీనాథ్ చొక్కా చించి వేయడంతో పాటు అలహరి సుధాకర్‌ను రాయితో కొట్టబోగా అడ్డుకోవటంతో రాయి తగిలి శ్రీనివాసులు వేలుకు రక్తగాయం అయ్యింది. అతని ఫిర్యాదు మేరకు 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ స్టేడియం @ 24 ఏళ్లు!

- పునాదుల దశ దాటని నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన శిలాఫలకం
- గత టీడీపీ ప్రభుత్వంలో పనుల ప్రారంభం
- నిధులు చాలవంటూ అడ్డుకున్న ఎమ్మెల్యే
- వైసీపీ పాలనలో మంజూరు కాని నిధులు
- కావలిలో కలగా మిగిలిన క్రీడా వికాస కేంద్రం



పునాదుల దశ దాటని క్రీడా వికాస కేంద్రం



శిథిలమవుతున్న శిలాఫలకం

కావలిటౌన్, ఏప్రిల్ 20 : వ్యక్తి వికాసానికి క్రీడలు దోహదపడతాయని, విద్యార్థికి విద్య, క్రీడలు రెండు కళ్లు అని పాలకులు, అధికారులు పదే పదే ఉపన్యాసాల్లో ఊదరగొట్టడం.. ఉత్తుత్తి హామీలు ఇవ్వడం తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. అందుకు నిదర్శనం కావలిలో మినీ స్టేడియం నిర్మాణానికి వేసిన శిలాఫలకం శిథిలావస్థకు చేరి 24 ఏళ్లుగా ఎక్కిరిస్తుండడమే. వివరాల మేరకు.. కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో 2001లో మినీ స్టేడియం నిర్మాణానికి కోట్ల రూపాయలు విలువ చేసే 9 ఎకరాల స్థలం కేటాయించారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప స్టేడియం నిర్మాణం మాత్రం జరగడంలేదు. అదిగో అల్లదిగో స్టేడియం అంటూనే రెండున్నర దశాబ్దాలు గడిచిపోతున్నాయి. అప్పటి క్రీడాకారుల పిల్లలకు కూడా ఆటలాడే వయసు దాటిపోయింది. వారి మనవళ్లకైనా స్టేడియం అందుబాటులోకి వస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

● 2014లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీడీపీ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యుఐడీసీ)ఆధ్వర్యంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఒక్కో దానికి రూ.2 కోట్ల చొప్పున ప్రతి నియోజకవర్గానికో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కావలి, విడవలూరు(కోవూరు,) ఆత్మకూరు, కోట, సూళ్లూరుపేట, ఉదయగిరిలలో క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు ప్రారంభించారు. ఈ క్రమంలో కావలిలో స్టేడియం మైదానంలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించి పునాది నిర్మాణం పూర్తి చేసుకునే సమయంలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. ఈ క్రమంలో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు సరిపోవని రూ.5.50 కోట్లతో ప్రతిపాదనలు పంపామంటూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిర్మాణ పనులు అడ్డు కున్నారు. గడిచిన 5ఏళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. దీంతో మినీ స్టేడియం నిర్మాణం కావలి వాసులకు కలగా మిగిలింది. గత ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అంగుళం ముందుకు కదలకపోవడంతో జరిగిన పనులు సైతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో క్రీడాకారుల సంక్షేమమే మాధ్యేయం.. క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.. క్రీడా మౌలిక వసతులు కల్పిస్తామన్న నేతల మాటలు నీటి మూటలుగా మారాయి. వైసీపీ ప్రభుత్వం క్రీడలను క్రీడాకారులను పూర్తిగా విస్మరించిందనేందుకు ఇక నిదర్శనం. ఇదిలావుండగా క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించకుండా వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర అట్టర్ ప్లాప్ షోగా మిగిలిందే తప్ప నిజమైన క్రీడాకారులకు ఒరిగిందేమీ లేదు.

ఎన్నికల కోడ్ ఉన్నా ఇష్టారాజ్యం

● రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

కావలి రూరల్, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టణంలోని 38వ వార్డు చేవూరివారితోటలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ నేతలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కోడ్ అమలులో ఉండగా పనులు చేపట్టవద్దని అడ్డుకున్నారు. దీంతో రోడ్డు నిర్మాణానికి తెచ్చిన సామగ్రిని వైసీపీ నేతలు అక్కడ వదిలి వెళ్లిపోయారు. ఈ విషయంపై కావలి మున్సిపల్ డీఈ సాయిరాంను వివరణ కోరగా కోడ్ మునుపు నిర్మాణ పనులు చేపట్టిన రోడ్డుకు కనెక్టివిటీగా ఈ రోడ్డు పనులు ఉండటంతో వాటిని ప్రారంభించారని, ఎంసీసీ అభ్యంతరంతో పనులు ఆపివేశామన్నారు.

మళ్లీ గెలిపిస్తే అభివృద్ధి చేస్తాం

అల్లూరు, ఏప్రిల్ 20 : మరోసారి వైసీపీకి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని నెల్లూరు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలతో కలసి ఆయన శనివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇస్కపల్లి గ్రామాభివృద్ధి జరగాలంటే వైసీపీకి ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కావలిలో మూడో రోజు నాలుగు నామినేషన్లు

కావలి, ఏప్రిల్ 20: కావలి అసెంబ్లీకి మూడవ రోజు శనివారం నలుగురు నేతలు తమ నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందజేశారు. పిరమిడ్ పార్టీ తరుపున సబ్బెల విజయభాస్కర్‌రెడ్డి, రెవెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ తరుపున గోసాల రవికాంత్, స్వతంత్ర అభ్యర్థిగా రాచూరు వెంకటసుబ్బారావులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ తరుపున గుంజి వెంకటేశ్వర్లు రెండో సెట్టు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన గురువారం కూడా ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

ఆర్ఎస్ఆర్‌లో వర్క్‌షాప్

బిట్రగుంట, ఏప్రిల్ 20: బోగోలు మండలం కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల్లో శనివారం వద్దే నేషనల్ ప్రోగ్రాం ఆన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020, అవుట్ కం బెస్ట్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) టైటిల్‌పై ఒక్కరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వీపీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్‌గా కేఎల్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ డాక్టర్ కే.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఎస్‌డీ ముజాహిద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవధార సోమశిల ప్రాజెక్టు జిల్లాకే తలమానికం. సుమారు 8 లక్షల ఎకరాలకు సాగు, పది లక్షల ప్రజానీకానికి తాగు నీరు అందిస్తున్న మహోత్తర జలనిధి అయిన ఈ డ్యాం నేడు సమస్యల సుడిలో చిక్కుకుపోయింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా డ్యాం మనుగడకే ప్రమాదం నెలకొంది. పోటెత్తిన లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని డ్యాం తట్టుకుని నిలబడుతున్నా మరమ్మతులు, నిర్వహణలో మాత్రం పాలక యంత్రాంగం చేతులెత్తేస్తోంది. ప్రకటించిన నిధులు కూడా సరిగ్గా రాకపోవడంతో భవిష్యత్తులో సోమశిల మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తుందని జిల్లావాసులు గగ్గోలు పెడుతున్నారు.

- అనంతసాగరం

- నీటి సామర్థ్యం పెంచినా కానరాని అభివృద్ధి
- పోటెత్తిన వరదలకు దెబ్బతింటున్న నిర్మాణాలు
- మరమ్మతుల్లో చేతులెత్తేస్తున్న వైసీపీ సర్కారు

పాలకులకు పట్టని జలనిధి!


- సమస్యలు సుడిగుండంలో 'సోమశిల'



అడుగంటిన సోమశిల జలాశయం

పెంచిన నిల్వకు అనుకూలమేనా!?

సోమశిల క్యాచ్‌మెంట్ ఏరియాపై అధికారుల పర్యవేక్షణ కరువయ్యింది. డ్యాం సామర్థ్యం 75 నుంచి 78 టీఎంసీలకు పెంచినా ఎగువ ప్రాంత అభివృద్ధిని మాత్రం విస్మరించారు. ఎగువ నుంచి వచ్చే వరదతో ప్రాజెక్టు చెంతన పూడిక పేరుకొని ఉండవచ్చు. అయితే ఈ విషయంపై యంత్రాంగం అసలు దృష్టి సారించ లేదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం జలాశయం పూర్తిస్థాయి నిల్వకు అనుకూలంగా ఉందా!? లేదా!? అనే అంశంపై కూడా అనుమానం కలుగుతోంది. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం డ్యాంలో 8.5 టీఎంసీల నీరు ఉంది. వాస్తవికతో పరిశీలిస్తే అంత నీటి నిల్వ ఉండదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



క్రస్ట్ గేట్ల నుంచి లీకవుతున్న నీరు (ఫైల్)

సోమేశ్వరుడినీ పట్టించుకోలా

2020, 2021 ఏడాదిలో సోమశిలకు ఎగువ నుంచి వచ్చిన వరదలతో జలాశయ ప్రాంగణంలోని ప్రముఖ సోమేశ్వరుడి ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించామని పాలకులు చెబుతున్నా ఆ దిశగా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవు. చరిత్ర కలిగిన గుడి నేడు దెబ్బతిని ఉండగా భక్తులు తీవ్ర వేదనకు గురవుతున్నారు.

ఆఫ్రాన్ పనులకు మంగళం

రెండేళ్లపాటు సోమశిలకు వచ్చిన వరదతో జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమైన సంగతి తెలిసిందే. జలాశయం నిర్మాణంలో ఆప్రాన్ ప్రాంతం కీలమైన నిర్మాణం కాగా దెబ్బతిన్న నిర్మాణాలు యథాస్థితికి తెచ్చేలా తీసుకొన్న ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. అప్రాన్ నిర్మాణం కోసం రూ.99.11 కోట్లు ప్రతిపాదించగా నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిన్నరగా మరమ్మతు పనులు జరగలేదు. దీంతో ఆ కట్టడాలు మరింత ప్రమాదభరితంగా మారాయి.



అధ్వానంగా అసంపూర్తిగా నిలిచిన అప్రాన్ పనులు

క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానం

ప్రాజెక్టుకు అమర్చిన క్రస్ట్‌గేట్ల వ్యవస్థ సరిగా లేదు. ఏటా నీరు వదిలే సమయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పోటెత్తిన వరద తిరిగి తగ్గే వరకు ఇంజనీర్లు ఉత్కంఠకు గురవుతున్న పరిస్థితి. ఏ సమయంలో ఏ గేటు మొరాయిందోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. మొత్తం 12 క్రస్ట్‌గేట్లు ఉండగా.. ఒక్కో గేటు 15 మీటర్ల వరకు ఎత్తేలా డిజైన్ చేసి ఉంది. వరద పోటెత్తినప్పుడు మొత్తం గేట్ల నుంచి గరిష్ఠంగా 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీరు వదిలే వెసులుబాటు ఉంది. అయితే గడిచిన ఐదేళ్ల కాలంలో వరద సమయంలో పలుగేట్లు మొరాయించి సిబ్బంది అవస్థలు పడిన సందర్భాలు ఉన్నాయి. ఏటా గేట్లకు చేయాల్సిన ఆధునికీరణ పనులపై శ్రద్ధ లోపించింది. జలాశయం నిండిన సందర్భంలో గేట్ల నీళ్ల దెబ్బతిని లీకేజీ కొనసాగుతున్నా నివారణ పనులు చేస్తున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ తక్కువగా ఉంది. ఈ సమయం పనులకు అనుకూలమైనా యంత్రాంగంలో చలనం లేదు.

గ్యాలరీలో సమస్యలు

జలాశయం గ్యాలరీ ప్రాంతంలో లీకేజీ అధికంగా ఉంటుంది. లీకేజీని తోడేందుకు 24 గంటలపాటు సిబ్బంది పని చేయాల్సిన అవసరం ఉండగా సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై పనిభారం పెరిగి శారీరక, మానసిక వేదనతో ఇబ్బంది పడుతున్నారు. ఇక గ్యాలరీకి అనుసంధానించిన లిఫ్ట్ కొన్నిసార్లు సాంకేతికతో మరమ్మతులకు గురవుండగా ఉద్యోగులు మెట్ల మార్గం నుంచి 100 అడుగుల కిందకు వెళ్లి విధులు నిర్వహించాల్సి ఉంది.

మట్టికట్ట పటిష్టంగా ఉందా!?

జలాశయం మట్టికట్ట పటిష్టతపై అనుమానం కలుగుతోంది. మట్టికట్ట నిర్మాణంపై ఏటా పరీక్షలు నిర్వహించి భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా పనులు చేసిన సందర్భాలు కరువయ్యాయి. దీంతో మట్టికట్టకు - కాంక్రీట్ నిర్మాణానికి వ్యత్యాసం నెలకొనగా సరిచేసే చర్యలు కరువయ్యాయి. ఇక కరకట్టలపై ఏర్పాటు చేసిన రివెట్‌మెంట్లపై మొక్కలు మొలచి మానులుగా మారుతున్నా చర్యలు లేవు.

పడకేసిన పర్యాటకం

జలాశయం వద్ద 2013లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అతిథి భవన సముదాయం శిథిలావస్థకు చేరుకొంది. సుమారు 100 మంది బస చేసేలా డార్మెంటరీ ని వినియోగించుకోలేని పరిస్థితి. కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు కూనరిల్లుతున్నాయి. ఇక వసతి ఏర్పాట్లు లేక సోమశిలకు వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

అభివృద్ధికి నోచని కాలువలు

సోమశిల జలాశయం పరిధిలో ఉత్తర, దక్షిణ కాలువలు ఉండగా ఆదునికీరణ పనులు పడకేశాయి. ఉత్తర కాలువ 0 నుంచి 106 కి.మీ కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు వరకు విస్తరించి ఉండగా కాలువ సామర్థ్యం పనులు చేసేలా చర్యలు చేపట్టారు. 750 క్యూసెక్కుల నుంచి 1,550 క్యూసెక్కులకు పెంచేలా ప్రణాళిక చేశారు. ఇదే తరహాలో దక్షిణ కాలువను 350 నుంచి 700 క్యూసెక్కులకు పెంచేలా తీసుకొన్న చర్యలు పూర్తిస్థాయిలో అమలు జరగక పోవడంతో పనులు స్తంభించాయి. ఇక తెలుగుగంగ వరద కాలువ గేటు ఏటా మొరాయిస్తోంది. జాకీలు పెట్టి గేటును ఎత్తాల్సిన పరిస్థితితో నీరు విడుదల, నిలుపుదల సమయంలో సిబ్బంది పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

జలాశయ పరిసరాల్లో రోడ్లు ధ్వంసం

ప్రాజెక్టు పరిసరాల్లో సుమారు 5 కి.మీ రోడ్లు విస్తరించి ఉండగా అవి అధ్వానంగా ఉన్నాయి. డ్యాం ఘాట్‌రోడ్డు రాళ్లు తేలి నరకప్రాయంగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దశాబ్ద కాలంగా రోడ్ల అబివృద్ధి జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరికీ ప్రతిష్ఠాత్మకమే!

ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల పోరు ఆసక్తిగా మారింది. మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా, సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అర్థ, అంగ బలాల్లో ఇద్దరూ సమ ఉజ్జీలే. అయితే వైసీపీ నుంచి టీడీపీలోకి రోజు రోజుకు వలసలు జోరందుకుంటున్నాయి. ఆనం పోటీలో ఉండడం టీడీపీ శ్రేణుల్లో జోష్ పెంచింది.

-ఆత్మకూరు



ఆనం రామ నారాయణ రెడ్డి



మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆనం రామనారాయణరెడ్డి 2009లో తొలిసారిగా ఆత్మకూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి కూడా పనిచేశారు. అప్పట్లో ఆయన నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయించి, పలు అభివృద్ధి పనులు చేశారు. ముఖ్యంగా తాగు, సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆత్మకూరు రెవె న్యూ డివిజన్ ఏర్పాటు, మున్సిపాలిటీగా మార్పు, 100 పడకల ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ పాలిటె క్నిక్, ఐటీఐ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, హైలెవల్ బ్రిడ్జీలు, ఆత్మకూరు ప్రజలకు శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు సోమశిల నుంచి పైపులైను ఏర్పాటు పనులు చేయించారు. అప్పటి నుంచి ఆయన ఎక్కడ ఉన్నా ఆత్మకూరు ప్రజల ఆదరాభి మానాలకు దూరం కాలేదు. నియోజకవర్గంలో టీడీపీ అగ్రనేతలంతా ఏకం కావడం ఆనంకు మరింతగా కలిసివచ్చే అంశం. వర్గబలం గల కొమ్మి, బొల్లినేని, గూటూరు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిల కలయిక ఆయన విజయానికి అదనపు బలం. వీటికి తోడు వైసీపీ ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకత కూడా కలిసొచ్చే అంశం.

• పదేళ్లు నైరాశ్యం

ఆది నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఆత్మకూరులో పదేళ్ల క్రితం మేకపాటి కుటుంబం నుంచి రాజకీయ ఆరంగేట్రం చేసిన గౌతంరెడ్డిని ప్రజలు గెలిపించారు. 2019లోనూ గౌతమ్ విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆయన ఆకస్మిక మరణంతో 2022లో జరిగిన ఉప ఎన్ని కల్లో ఆయన సోదరుడు విక్రమ్‌రెడ్డి విజయం సాధించారు. వైసీపీ ప్రాబల్యంపైనే ఆయన విజయం ఆధారపడి ఉంది. ఈ క్రమంలో నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో తన ప్రాబల్యం తగ్గకుండా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. అయితే పలువురు వైసీపీ నాయకులు పార్టీలో మారుతుండటం మేకపాటికి కంటి మీద కునుకులే కుండా చేస్తోంది. అంతేగాక ఆశించిన మేర నియోజకవర్గంలో అభివృద్ధి జరగకపోవడం ప్రతికూల అంశమైంది. 2014, 2019 ఎన్నికల్లో మేకపాటి గౌతంరెడ్డి పెద్దగా హామీలు ఇవ్వలేదు. ఇచ్చిన మూడు, నాలుగు హామీల సైతం నెరవేర్చలేదు. అసెంబ్లీలో గళమెత్తి పోరాడిన దాఖలాలు కూడా లేవు. ఇవన్నీ ప్రజల అసంతృప్తికి కారణమయ్యాయి.

వర్తమానం

ఉలవపాడు: టీడీపీకి చెందిన పలు కుటుంబాలు భారీగా తమపార్టీలో చేరినట్లు ఫేక్ ప్రచారాలతో వైసీపీ నాయకత్వం ఆత్మసంతృప్తి పొందుతోంది. అయితే ఈ విషయాన్ని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో ఖండించారు. కాలనీలో తొలినుంచి కాంగ్రెస్‌లోనూ, అనంతరం వైసీపీలోనూ సానుభూతిపరులుగా ఉంటున్న ఒకటిరెండు కుటుంబాలవారికి వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ సమక్షంలో శుక్రవారం కండువాలు కప్పి టీడీపీవారు చేరారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. అయితే ఆ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు మాత్రం వైసీపీ ఫేక్ ప్రచారాలపై మండిపడుతున్నారు. గత నాలుగు రోజుల క్రితం కూడా టీడీపీ యువత భారీగా వైసీపీలో చేరిందని ప్రచారం చేసుకున్నారు. అలా చేరినవారిలో సగానికిపైగా ఓటు హక్కులేని విద్యార్థులని తేలింది. ఓవైపు మండలంలో ప్రతిగ్రామం నుంచి టీడీపీలోకి రోజురోజుకు వలసలు పెరిగిపోతుంటే, వైసీపీలో ఏర్పడిన అనిశ్చితి చర్చనీయాంశంగా మారింది.

వాళ్లకు వాళ్లే కండువాలు కప్పుకుని..

- టీడీపీ నేతలు చేరారంటూ వైసీపీ ఫేక్ ప్రచారం



వైసీపీ నాయకులకే పార్టీ కండువాలు కప్పి మళ్లీ వైసీపీలోకి ఆహ్వానిస్తున్న బుర్రా మధుసూదన్

వారు తొలగించడం.. వీరు కట్టడం!

- 'కోడ్'ను ఖాతరు చేయని అధికార పార్టీ నేతలు
- తల పట్టుకుంటున్న అధికార యంత్రాంగం

సంగం, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా తమనేమి చేస్తారనే ధీమానో లేదా అహంకారమో తెలియదు కానీ సంగం మండలంలోని సిద్ధీపురం, వెంగారెడ్డిపాళెం, సంగం గ్రామాల్లో అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా మారింది. కొందరు వైసీపీ మద్దతుదారులు స్థానికుల ఇళ్ల గోడలపై జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అధికారులు ఇళ్ల యజమానులను అడిగితే ఎవరో వచ్చి కట్టి వెళుతున్నారని, ఈ విషయం మాకు తెలియదని సమాధానం ఇస్తున్నారు. దీంతో అధికారులు ఫ్లెక్సీలను తొలగించి చేతులు దులుపుకున్నారు. శుక్రవారం సంగంలో పలు ఇళ్లకు ఈ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇలా ఇష్టప్రకారం ఫ్లెక్సీలను కడుతుండటంతో వాటిని తొలగించలేక అధికార యంత్రాంగం తల పట్టుకుంటోంది.



సంగంలోని ఓ దుకాణం గోడకు కట్టిన వైసీపీ బ్యానర్

ఎన్నికల విధుల్లోకి శిక్షణ ఐపీఎస్‌లు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి అన్ని జిల్లాలకు శిక్షణ ఐపీఎస్‌లను కేటాయిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాకు మయాంక్ మిశ్రా, ప్రతీక్‌సింగ్, కుష్‌మిశ్రా, సురజ్ డి, అబినవ్ ద్వివేది, జామాసోనార్, ఆషిమా వాశ్వాణి, అపర్ణలను కేటాయించారు. జిల్లాలోని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవార్గాలకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ట్రైనీ ఐపీఎస్‌ను పర్యవేక్షణాధికారిగా నియమించనున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు వీరంతా జిల్లాలోనే ఉంటూ విధులు నిర్వహించనున్నారు.

నెరవేర్చే హామీలే ఇచ్చేవారు!?



మేము వయసులో ఉన్న రోజుల్లో రాజకీయం ఎంతో నీతిగా విలువలతో కూడిన విధంగా ఉండేది. ప్రజలకు సేవ చేసే వారికి మాత్రమే పార్టీ పెద్దలు సీట్లు ఇచ్చేవారు. ఎన్నికల వేళ ప్రజలే వారి ఆర్థిక బాగోగులు చూసేవారు. బరిలో ఉన్న నేతలు నెరవేర్చే హామీలను మాత్రమే చెప్పి ఓట్లు అడిగే వారు. గెలిచాకా ఇచ్చిన వాగ్దానాలు తీర్చేవారు. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా కనిపిస్తోంది. ఇప్పుడు ప్రచార ఆర్భాటం ఎక్కువగా ఉంది. మా రోజుల్లోలాగే ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఖర్చులు తగ్గి దేశ ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుపడి ఉండేది.

- రామయ్యానాయుడు (81), సంజీవనగరం, అనంతసాగరం

బైండోవర్ అంటే...

తెలుసుకుందాం

ఏ ఎన్నికలు వచ్చినా తరచూ వినిపించేమాట బైండోవర్... అనగా బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచుతారు, గొడవలు సృష్టించేవారు, రౌడీషీటర్లు, బెల్టు దుకాణాదారులు, అసాంఘిక శక్తులపై నిఘా కూడా పెంచుతారు. ఎన్నికలవేళ ఫలానా వ్యక్తుల వల్ల శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందని భావిస్తే, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే పోలీసులు బైండోవర్ చేస్తారు. అలాంటి వారిని తహసీల్దారు లేదా ఆర్డీవో ఎదుట హాజరు పరుస్తారు. చట్టవ్యతిరేక పనులు చేయబోమని బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆరోజు నుంచి ఏడాదిపాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండులో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటారో.. అంత మొత్తం జరిమానా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరంగానే పరిగణిస్తారు. అతడిపై ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద కేసు నమోదు చేస్తారు. రెండు అంతకన్నా ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని ఎవరైనా భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు.

- అనంతసాగరం/ఉదయగిరి రూరల్

సమర్థులైన పాలకులను ఎన్నుకుంటా!



ఓటు అనే ఆయుధం దేశ, రాష్ట్ర ప్రజల తలరాతలు మార్చేలా ఉండాలి. అవినీతికి దూరంగా ఉండే సమర్థమైన నాయ కుడికి నా ఓటు వేస్తా. డిగ్రీ వరకు చదివా. ఈసారి ఎన్నికల్లో తొలి సారిగా ఓటు వేసే అవ కాశం వచ్చింది. ఓటు వేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఐదేళ్లగా ప్రజలు అభద్రతా భావనలో ఉన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఉపాధి కోసం వలసలను నివారించే నేతకే నేను ఓటేస్తా.

- కీలుకుప్ప శ్రీజ, బీఎస్సీ, పెనుబల్లి , బుచ్చిరెడ్డిపాళెం

యువగళం